www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

శనివారం | 15-3-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 65 సంచిక (Issue) : 329 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరరుతువు, ఫాల్గుణమాసం, బహుళపక్షం, తిథి: పాడ్యమి మ.2.34 తదుపరి విదియ, నక్షత్రం: ఉత్తర ఉ.8.54 తదుపరి హస్త, వర్జ్యం: సా.6.17-8.05, అమృతఘడియలు: తె.5.02 ము., దుర్ముహూర్తం: ఉ.6.26-8.02 రాహుకాలం ఉ.9.00-10.30, సూర్యోదయం: 6.26, సూర్యాస్తమయం: 6.21 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru









ఒకటా.. రెండా?



తొలి టైటిల్ కోసం ఢిల్లీ ఆరాటం
రెండోసారి మురిసేందుకు ముంబై ప్రయత్నం
మహిళల ప్రీమియర్ లీగ్

నేడు ఇరు జట్ల మధ్య ఫైనల్

ముంబై: నెల రోజులపాటు క్రికెట్ అభిమానులను అలరించిన మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) మూడో సీజన్ ఆఖరి అంకానికి చేరుకుంది. శనివారం ముంబై ఇండియన్స్-ఢిల్లీ క్యాపిటల్స్ మహిళల జట్ల మధ్య ఫైనల్ ముంబైలోని బ్రబౌర్న్ స్టేడియం వేదికగా జరుగనుంది. 2023లోనూ ఈ రెండు జట్ల మధ్యే తుది పోరు జరగ్గా ముంబై తొలిసారి విజేతగా నిలిచింది. ఇక వరుసగా మూడోసారి ఫైనల్‌కు చేరిన ఢిల్లీ ఈ లీగ్ చరిత్రలోనే అత్యంత నిలకడైన జట్టుగా పేరు తెచ్చుకుంది. కానీ అన్నిసార్లూ రన్నరప్‌గానే సంతృప్తి చెందాల్సి వచ్చింది. మెగ్ లానింగ్ నేతృత్వంలోని ఈ టీమ్ ఈసారి మాత్రం కప్ కొట్టాల్సిందేనన్న కసితో ఉంది. తాజా సీజన్‌లో ఈ రెండు జట్లు అన్ని విభాగాల్లోనూ సమవుజ్జీలుగా కనిపించాయి. ఇరుజట్లు లీగ్‌లో తామాడిన 8 మ్యాచ్‌ల్లో 5 విజయాలు, 3 ఓటముల చొప్పున ఉండడం గమనార్హం. రన్‌రేట్ పరంగా మాత్రమే డీసీ నేరుగా తుది పోరుకు అర్హత సాధించింది. అయితే ఆర్‌సీబీ చేతిలో అనూహ్య ఓటమి తర్వాత ముంబై ఎలిమినేటర్‌లో ఆడి అదిరే ఆటతో తిరిగి ఫైనల్లోకి అడుగుపెట్టింది. స్టార్ ఆల్‌రౌండర్లతో కూడిన ఈ జట్టు ఫేవరెట్‌గా బరిలోకి దిగనుంది.

సీనియర్ల అండతో..

రెండోసారి ఫైనల్‌కు చేరిన ముంబై జట్టులో సీనియర్లు నాట్ సివర్ బ్రంట్, ఓపెనర్ హేలీ మాథ్యూస్, కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ సూపర్ ఫామ్‌లో ఉన్నారు. ముఖ్యంగా ఈ సీజన్‌లో సివర్ 493 రన్స్, 9 వికెట్లు.. మాథ్యూస్ 304 రన్స్, 17 వికెట్లతో అదుర్స్ అనిపించారు. అటు హర్మన్ 156.29 స్ట్రయిక్ రేట్‌తో 236 పరుగులు సాధించింది. ఈ మ్యాచ్‌లోనూ ఈ త్రయం బ్యాట్లు ఝళిపిస్తే భారీ స్కోరు ఖాయం. బౌలింగ్‌లో అమేలియా, షబ్నిం, సైకా రాణిస్తున్నారు.

ఆత్మవిశ్వాసంతో ఢిల్లీ

ముంబైతో జరిగిన రెండు లీగ్ మ్యాచ్‌ల్లోనూ నెగ్గిన డీసీ ఆత్మవిశ్వాసంతో ఉంది. ఈసారి హ్యాట్రిక్ విజయంతో తమ టైటిల్ స్వప్నాన్ని నెరవేర్చుకోవాలనుకుంటోంది. ఓపెనర్లు లానింగ్, షఫాలీలతో పాటు జెమీమా, సదర్లాండ్, కాప్‌లతో బ్యాటింగ్ విభాగం బలంగానే కనిపిస్తోంది. అటు ముంబై బ్యాటింగ్ పవర్‌ను కట్టడి చేసేందుకు డీసీ పేసర్లు జొనాసెన్, సదర్లాండ్, కాప్, శిఖా, స్పిన్నర్ విన్ను సిద్ధంగా ఉన్నారు. గత రెండు మ్యాచ్‌ల్లో వీరి బౌలింగ్‌ను ముంబై దీటుగా ఎదుర్కోలేకపోయింది.

తుది జట్లు (అంచనా)

ముంబై: యాస్తిక భాటియా, మాథ్యూస్, సివర్, హర్మన్‌ప్రీత్ (కెప్టెన్), సజన, అమేలియా, అమన్‌జ్యోత్, కమలిని, సంస్కృతి, షబ్నిం ఇస్మాయిల్, సైకా ఇషాక్.
ఢిల్లీ: మెగ్ లానింగ్ (కెప్టెన్), షఫాలీ వర్మ, జెమీమా రోడ్రిగ్స్, సదర్లాండ్, కాప్, జొనాసెన్, సారా బ్రైస్, నికీ ప్రసాద్, శిఖా పాండే, మిన్ను మణి, టిటాస్ సాధు.



ముగింపోత్సవంలో నోరా ఫతే డ్యాన్స్

డబ్ల్యూపీఎల్ ముగింపు కార్యక్రమంలో బాలీవుడ్ నటి, డ్యాన్సర్ నోరా ఫతే తన ప్రదర్శనతో అభిమానులను ఆకట్టుకోనుంది. ఫైనల్ మ్యాచ్‌కు ముందు జరిగే ఈ ఈవెంట్‌లో 33 ఏళ్ల కెనడియన్ నోరా తన ఆట పాటలతో స్టేడియాన్ని హోరెత్తించేందుకు సిద్ధమవుతున్నట్టు లీగ్ నిర్వాహకులు ప్రకటించారు.

అక్షర్‌కు ‘ఢిల్లీ’ పగ్గాలు

న్యూఢిల్లీ: ఐపీఎల్ మరో వారం రోజుల్లో ఆరంభం కానుండగా, ఢిల్లీ క్యాపిటల్స్ ఫ్రాంచైజీ తమ కొత్త కెప్టెన్‌ను ప్రకటించింది. స్పిన్ ఆల్‌రౌండర్ అక్షర్ పటేల్‌కు ఈ బాధ్యతలు అప్పగిస్తున్నట్టు డీసీ పేర్కొంది. ఇన్నాళ్లూ డీసీ కెప్టెన్‌గా ఉన్న రిషభ్ పంత్ లఖ్‌నవూకు మారడంతో నూతన సారథి నియామకం అనివార్యమైంది. ఢిల్లీ జట్టు కెప్టెన్‌గా ఎంపికవడం సంతోషాన్నిస్తోందని, జట్టును ముందుకు నడిపించేందుకు ఎదురుచూస్తున్నట్టు అక్షర్ చెప్పాడు. వేలానికి ముందే అక్షర్‌ను డీసీ జట్టు రూ.16.5 కోట్లకు అట్టిపెట్టుకున్న సంగతి తెలిసిందే. ఇక 2019 నుంచి క్యాపిటల్స్ తరఫున అక్షర్ 82 మ్యాచ్‌లు ఆడాడు. ఓవరాల్‌గా 150 లీగ్ మ్యాచ్‌ల్లో అతను 1653 పరుగులు సాధించి, 123 వికెట్లు పడగొట్టాడు.

లాహోర్‌లో మహిళల వన్డే వరల్డ్‌కప్ క్వాలిఫయర్స్

న్యూఢిల్లీ: మహిళల వన్డే వరల్డ్‌కప్ క్వాలిఫయర్ టోర్నమెంట్‌కు పాకిస్థాన్ ఆతిథ్యమివ్వనుంది. ఆరు జట్లు పాల్గొనే ఈ ఈవెంట్ వచ్చేనెల 9 నుంచి 19 వరకు లాహోర్‌లో జరగనుంది. పూర్తిస్థాయి సభ్య దేశాలైన ఆతిథ్య పాకిస్థాన్, బంగ్లాదేశ్, వెస్టిండీస్, ఐర్లాండ్‌లతో పాటు అసోసియేట్ సభ్యదేశాలు స్కాట్లాండ్, థాయ్‌లాండ్ జట్ల మధ్య ఈ టోర్నీ జరగనుంది. తొలి రెండుస్థానాల్లో నిలిచిన జట్లు ఈ ఏడాది అక్టోబరు-నవంబరులో భారత్ వేదికగా జరిగే మహిళల వన్డే వరల్డ్‌కప్‌నకు అర్హత సాధిస్తాయి. ఈ వరల్డ్‌కప్‌లో ఎనిమిది జట్లు తలపడనున్నాయి. కాగా, ఐసీసీ మహిళల చాంపియన్‌షిప్ (2022-25) సైకిల్‌లో భాగంగా తొలి ఆరు స్థానాల్లో నిలవడం ద్వారా ఆతిథ్య భారత్, ఆస్ట్రేలియా, ఇంగ్లండ్, న్యూజిలాండ్, దక్షిణాఫ్రికా, శ్రీలంక నేరుగా వరల్డ్‌కప్‌కు అర్హత సాధించాయి. మిగిలిన రెండు జట్లు క్వాలిఫయర్ ఈవెంట్ ద్వారా ఎంపికవుతాయి.

ముగిసిన భారత్ పోరు

- లక్ష్య సేన్, గాయత్రి జోడీ అవుట్
- ఆల్ ఇంగ్లండ్ బ్యాడ్మింటన్

బర్మింగ్‌హామ్: ఎన్నో అంచనాలతో ఆల్ ఇంగ్లండ్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ బరిలోకి దిగిన భారత షట్లర్లు నిరాశపరిచారు. సింగిల్స్‌లో మిగిలిన మాజీ రన్నరప్ లక్ష్య సేన్, డబుల్స్‌లో ఆశలు రేపిన పుల్లెల గాయత్రి గోపీచంద్/ట్రీసా జాలీ జోడీ సెమీఫైనల్స్ చేరకుండానే నిష్క్రమించింది. శుక్రవారం జరిగిన క్వార్టర్‌ఫైనల్లో లక్ష్య సేన్ 10-21, 16-21తో చైనాకు చెందిన ప్రపంచ ఆరో ర్యాంకర్ లి షి ఫెంగ్ చేతిలో ఓటమి పాలయ్యాడు. 2022 ఫైనలిస్టు అయిన లక్ష్య.. 45 నిమిషాలపాటు సాగిన ఏకపక్ష పోరులో ప్రత్యర్థి ధాటికి ఏ దశలోనూ బదులివ్వలేక వరుస గేముల్లో వెనుదిరిగాడు. కాగా, మహిళల డబుల్స్ క్వార్టర్స్‌లో గాయత్రి/ట్రీసా ద్వయం 14-21, 10-21తో చైనా జోడీ, రెండో సీడ్ లూ షెంగ్సూ/టాన్ నింగ్ చేతిలో పరాజయం పాలైంది. సింగిల్స్‌లో పీవీ సింధు, ప్రణయ్ తొలి రౌండ్‌లోనే ఇంటిబాట పట్టిన సంగతి తెలిసిందే. దీంతో ఈ టోర్నీలో భారత షట్లర్ల పోరు పూర్తిగా ముగిసినట్టయింది.

ముంబై తొలిపోరుకు హార్దిక్ దూరం



బుమ్రా వచ్చేదెప్పుడో!


వెన్ను నొప్పితో బాధ పడుతున్న స్టార్ పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా తాజా ఐపీఎల్‌లో ఎప్పుడు చేరతాడనేది సందేహంగా మారింది. బోర్డర్-గవాస్కర్ ట్రోఫీలో గాయపడిన అతడు రెండున్నర నెలలుగా క్రికెట్‌కు దూరంగానే ఉంటున్నాడు. పూర్తి ఫిట్‌నెస్ సాధించాకే బుమ్రాను లీగ్‌లోకి అనుమతించాలని బీసీసీఐ భావిస్తోంది. ఈ నేపథ్యంలో తను ముంబై ఇండియన్స్ ఆరంభ మ్యాచ్‌లకు దూరం కానున్నాడు. వచ్చే నెల రెండో వారంలో బుమ్రా జట్టుతో కలిసే అవకాశం ఉన్నట్టు కథనాలు వినిపిస్తున్నాయి. అదే జరిగితే ముంబై ఆడే తొలి ఐదు మ్యాచ్‌లకు బుమ్రా అందుబాటులో ఉండడు. ‘ఎన్ని మ్యాచ్‌లకు దూరం కానున్నాడనేది ఇప్పుడే తెలియదు. లీగ్ ఆరంభమయ్యాక ఏదో దశలో జట్టుతో చేరుతాడు. అయితే ఇందుకు బీసీసీఐ మెడికల్ టీమ్ నుంచి అనుమతి తప్పనిసరి’ అని ఓ క్రీడా వెబ్‌సైట్ పేర్కొంది. ఈనెల 23న ముంబై జట్టు చెన్నైతో తొలి మ్యాచ్ ఆడనుంది.



ముంబై: ఈ సీజన్ ఐపీఎల్‌లో ముంబై ఇండియన్స్ తొలి మ్యాచ్‌కు కెప్టెన్ హార్దిక్ పాండ్యా దూరం కానున్నాడు. ఇందుకు కారణం, అతనిపై ఓ మ్యాచ్ నిషేధం ఉండడమే. ఈ నిషేధం గత సీజన్‌లోది కావడం గమనార్హం. వివరాల్లోకెళ్తే.. గతేడాది ఐపీఎల్‌లో ముంబై ఇండియన్స్ జట్టు మూడుసార్లు స్లో ఓవర్ రేట్‌కు పాల్పడింది. దీంతో నిబంధనల ప్రకారం ఆ జట్టు కెప్టెన్‌గా హార్దిక్ రూ. 30 లక్షల జరిమానా ఎదుర్కోవడంతో పాటు ఓ మ్యాచ్ నిషేధానికి గురయ్యాడు. అయితే, ఆ జట్టు దారుణ వైఫల్యంతో గ్రూప్ దశలోనే నిష్క్రమించి, ప్లేఆఫ్స్‌కు దూరమవడంతో పాండ్యాపై మ్యాచ్ నిషేధం సాధ్యం కాలేదు. దీంతో ఈ సీజన్‌లో ఈనెల 23న చెన్నైలో సీఎస్‌కే జట్టుతో ముంబై ఇండియన్స్ ఆడే తమ తొలి మ్యాచ్‌కు హార్దిక్ దూరమవక తప్పని పరిస్థితి నెలకొంది. పాండ్యాపై వేటు నేపథ్యంలో తొలి మ్యాచ్‌కు ముంబై కెప్టెన్‌గా ఎవరు వ్యవహరిస్తారన్నది చర్చనీయాంశంగా మారింది.

లంక మహిళలు అదరగొట్టారు

కివీస్ గడ్డపై తొలి టీ20 గెలుపు



క్రైస్ట్‌చర్చ్: శ్రీలంక మహిళల క్రికెట్ జట్టు న్యూజిలాండ్ గడ్డపై అదరగొట్టింది. ఇక్కడ పొట్టి ఫార్మాట్‌లో ఆతిథ్య జట్టుపై తొలి విజయాన్ని నమోదుచేసింది. మూడు టీ20ల సిరీస్‌లో భాగంగా శుక్రవారం జరిగిన తొలి మ్యాచ్‌లో లంక 7 వికెట్ల తేడాతో కివీస్‌ను చిత్తుగా ఓడించింది. అరంగేట్ర బౌలర్, ‘ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్’ మల్కి మదార (3/14) సత్తా చాటడంతో.. మొదట కివీస్ 18.5 ఓవర్లలో 101 పరుగులకే కుప్పకూలింది. కివీస్ బ్యాటర్లలో ఎమ్మా మెక్‌లాయిడ్ (44) టాప్ స్కోరర్. కవిష దిల్హరి (2/18), ఇనోషి ప్రియదర్శని (2/25) చెరో రెండు వికెట్లు తీశారు. ఛేదనలో కెప్టెన్ చమరి ఆటపట్టు (64 నాటౌట్) అజేయ అర్ధసెంచరీతో చెలరేగడంతో లంక 14.1 ఓవర్లలో 102/3 స్కోరు చేసి గెలిచింది. ఓవరాల్‌గా టీ20ల్లో కివీస్‌పై లంకకిది రెండో గెలుపు.

రోహిత్ రిటైర్ కానవసరంలేదు!


డివిల్లీర్స్

న్యూఢిల్లీ: వన్డేల నుంచి రోహిత్ శర్మ రిటైర్ కావాల్సిన అవసరం లేదని దక్షిణాఫ్రికా బ్యాటింగ్ దిగ్గజం డివిల్లీర్స్ తేల్చి చెప్పాడు. క్రికెట్ చరిత్రలో..వన్డేలలో గొప్ప కెప్టెన్‌గా నిలవగలిగే సత్తా రోహిత్‌కు ఉందని పేర్కొన్నాడు. చాంపియన్స్ ట్రోఫీ అనంతరం 50 ఓవర్ల ఫార్మాట్‌కు రోహిత్ వీడ్కోలు పలుకుతాడని వార్తలొచ్చిన విషయం విదితమే. అయితే తాను వన్డేలనుంచి వైదొలగడంలేదని చాంపియన్స్ ట్రోఫీ టైటిల్ విజయానంతరం భారత కెప్టెన్ స్పష్టంజేశాడు. ‘మిగతా సారథులతో పోలిస్తే కెప్టెన్‌గా రోహిత్ విజయాల శాతం (74) ఎంతో మెరుగ్గా ఉంది. ఇది గతంలో ఏ సారథికీ లేదు. అతడు ఇలాగే సాగితే వన్డేలలో అన్ని తరాలకు అత్యుత్తమ కెప్టెన్‌గా నిలవడం ఖాయం’ అని తన యూట్యూబ్ చానెల్‌లో డివిల్లీర్స్ అభిప్రాయపడ్డాడు.

పసిడి రికార్డు పరుగు

అంతర్జాతీయ బులియన్ మార్కెట్లో 3,000 డాలర్లు దాటిన ఔన్స్ గోల్డ్
దేశీయంగానూ సరికొత్త గరిష్ఠానికి..



న్యూఢిల్లీ: బంగారం ధరలు మళ్లీ కొండెక్కుతున్నాయి. అంతర్జాతీయ మార్కెట్లో ఔన్స్ (31.10 గ్రాములు) గోల్డ్ తొలిసారిగా 3,000 డాలర్ల మైలురాయిని దాటింది. శుక్రవారం ఒక దశలో 0.6 శాతం పెరుగుదలతో 3,009.10 డాలర్ల స్థాయిలో ట్రేడైంది. సిల్వర్ కూడా ఒక శాతానికి పైగా పెరిగి 34.65 డాలర్లకు ఎగబాకింది. ట్రంప్ సుంకాల వడ్డనతో అంతర్జాతీయంగా పెరిగిన వాణిజ్య ఉద్రిక్తతలతో పాటు అమెరికా ఫెడరల్ రిజర్వ్ వచ్చే సమీక్షలో ప్రామాణిక వడ్డీరేట్లను మరింత తగ్గించవచ్చన్న అంచనాలు తాజా గోల్డెన్ ర్యాలీకి ఆజ్యం పోశాయి. ఎందుకంటే, ఆర్థిక అనిశ్చితుల్లో భద్రమైన పెట్టుబడి సాధనంగా బంగారానికి పేరుంది. ఇందుకుతోడు, అంతర్జాతీయంగా ఈక్విటీ మార్కెట్లు భారీగా దిద్దుబాటుకు లోనవుతున్నాయి. ఈ నేపథ్యంలో ఇన్వెస్టర్లు తమ పెట్టుబడులను ఈ విలువైన లోహాల్లోకి మళ్లిస్తుండటంతో బంగారం, వెండికి డిమాండ్ అనూహ్యంగా పెరిగి గత రెండు వారాలుగా ధరలు వేగంగా ఎగబాకుతున్నాయని మార్కెట్ విశ్లేషకులు పేర్కొన్నారు. ఆయా దేశాల సెంట్రల్ బ్యాంక్‌లు సైతం పసిడి నిల్వలను భారీగా పెంచుకుంటూ వస్తుండటం ప్రస్తుత గోల్డ్ ర్యాలీకి మరో కారణమని వారన్నారు.

ఏడాది చివరి నాటికి 3,300 డాలర్లకు!?

అంతర్జాతీయ మార్కెట్లో బంగారం ధర ఈ ఏడాదిలో ఇప్పటివరకు 14 శాతానికి పైగా పెరిగింది. ట్రంప్ సుంకాలతో మున్ముందు ఆర్థిక అనిశ్చితులు మరింత తీవ్రతరమయ్యే అవకాశాలున్నాయి. ఇందుకుతోడు, అమెరికా మళ్లీ ఆర్థిక మాంద్యంలోకి జారుకోవచ్చన్న అంచనాలూ ఉన్నాయి. ఇదే గనక జరిగితే, బంగారం, వెండి ధరలు మరింత ఎగబాకడం ఖాయమని బులియన్ విశ్లేషకులు అంటున్నారు. వచ్చే వారమూ గోల్డ్ ర్యాలీ కొనసాగవచ్చని శాక్సో బ్యాంక్ కమోడిటీ విభాగ అధిపతి అన్నారు. ఈ ఏడాది చివరి నాటికి ఔన్స్ గోల్డ్ 3,300 డాలర్లకు చేరుకోవచ్చని ఆయన అంచనా వేశారు. కాగా, అంతర్జాతీయ బ్యాంకింగ్, ఆర్థిక సేవల సంస్థ ఏఎన్‌జెడ్ ఈ ఏడాది గోల్డ్ టార్గెట్‌ను 3,050 డాలర్లుగా అంచనా వేసింది.

మన దగ్గర రూ.లక్ష దాటుద్దా..?

అంతర్జాతీయ మార్కెట్ ట్రెండ్‌కు అనుగుణంగా దేశీయంగానూ పసిడి ధరలు సరికొత్త జీవితకాల గరిష్ఠానికి చేరాయి. హైదరాబాద్ మార్కెట్లో 24 క్యారెట్ల బంగారం 10 గ్రాముల రేటు రూ.1,200 పెరుగుదలతో దాదాపు రూ.90,000 (రూ.89,780)కు చేరింది. 22 క్యారెట్ల లోహం రూ.82,300 పలికింది. కిలో వెండి రూ.1.12 లక్షలకు ఎగబాకింది. బులియన్ విశ్లేషకుల అంచనాల ప్రకారం.. ఈ ఏడాది చివరినాటికి అంతర్జాతీయ మార్కెట్లో ఔన్స్ గోల్డ్ 3,300 డాలర్లకు చేరితే, దేశీయంగా 10 గ్రాముల మేలిమి బంగారం రూ.లక్ష దాటే అవకాశాలున్నాయి.

నగలపై భారీ డిస్కౌంట్లు

పసిడి ధరలు ఆల్‌టైమ్ రికార్డు స్థాయికి పెరగడంతో స్వర్ణాభరణాలకు గిరాకీ భారీగా తగ్గిందని, కస్టమర్లు వేచి చూసే ధోరణిలో ఉన్నారని చెన్నైకి చెందిన బులియన్ వర్తకుడు ఒకరు వెల్లడించారు. దాంతో జువెలర్లు నగలపై భారీ డిస్కౌంట్లు ఆఫర్ చేస్తున్నారని, ఈ డిస్కౌంట్లు 8 నెలల క్రితం నాటికి గరిష్ఠ స్థాయికి చేరాయని వారన్నారు.

హెచ్‌ఎస్‌ఎల్ డైరెక్టర్‌గా కిరణ్



విశాఖపట్నం (ఆంధ్రజ్యోతి): హిందుస్థాన్ షిప్‌యార్డ్ లిమిటెడ్ (హెచ్‌ఎస్‌ఎల్) డైరెక్టర్ (ఫైనాన్స్ అండ్ కమర్షియల్)గా కిరణ్ ఈశంకరాల శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. 1997లో చార్టర్డ్ అకౌంటెంట్‌గా కెరీర్ ప్రారంభించిన కిరణ్ 1998లో విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ (ఆర్‌ఐఎన్‌ఎల్)లో చేరారు. కార్పొరేట్ అకౌంట్స్, ప్రాజెక్ట్ ఫైనాన్స్, బడ్జెటింగ్, ఇంటర్నల్ ఆడిట్ తదితర బాధ్యతలు నిర్వర్తించారు. ఆ తర్వాత ఆర్‌ఐఎన్‌ఎంఓఐఎల్ ఫెర్రో అల్లాయిస్‌లో చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్ (సీఎఫ్‌ఓ)గా పని చేశారు. హెచ్‌ఎస్‌ఎల్‌కు రాక ముందు ఆయన డ్రెడ్జింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (డీసీఐ)లో సీఎఫ్‌ఓగా విధులు నిర్వర్తించారు.

వచ్చే ఆర్థిక సంవత్సరం ఐటీలో
1.5 లక్షల ఫ్రెషర్ల నియామకాలు!
2024-25తో పోలిస్తే రెట్టింపు హైరింగ్!!

న్యూఢిల్లీ: ఐటీ రంగంలో మళ్లీ ఉద్యోగావకాశాలు పెరగనున్నాయని, సాఫ్ట్‌వేర్ కంపెనీలు ప్రాంగణ నియామకాల జోరు పెంచే అవకాశాలు కన్పిస్తున్నాయని విశ్లేషకులు భావిస్తున్నారు. వచ్చే ఆర్థిక సంవత్సరం (2025-26)లో ఫ్రెషర్ల నియామకాలు 1.5 లక్షల స్థాయిని దాటవచ్చని, ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25)తో పోలిస్తే దాదాపు రెట్టింపు కావచ్చన్న అంచనాలున్నాయి. ఈ నెలాఖరుతో ముగియనున్న 2024-25 ఆర్థిక సంవత్సరంలో ఐటీ కంపెనీల ఫ్రెషర్ల హైరింగ్ 85,000-95,000కు పరిమితం కావచ్చని రిక్రూట్‌మెంట్ సేవల సంస్థ టీమ్‌లీజ్ భావిస్తోంది.

సవాళ్ల సంద్రంలో ఐటీ: ప్రస్తుతం దేశీయ ఐటీ రంగం పలు సవాళ్లు ఎదుర్కొంటోంది. ఒకవైపు సాంకేతిక పరివర్తనం.. మరోవైపు ప్రధాన ఆదాయ వనరైన ఉత్తర అమెరికా మార్కెట్లో ఐటీ వ్యయాలు తగ్గడం. ఈ రెండు కారణాల వల్ల కంపెనీలు గత ఏడాదిలో ముందు జాగ్రత్త ధోరణితో వ్యవహరించాయి. వ్యయ నియంత్రణ సాకుతో ఉద్యోగాల్లో కోతలు పెట్టాయి. ప్రాంగణ నియామకాలూ పరిమిత స్థాయిలోనే జరిగాయి. ఐటీ రంగంలో ఇప్పుడిప్పుడే హైరింగ్ మళ్లీ పెరుగుతోందని, కంపెనీలు ముఖ్యంగా ఫ్రెషర్లతో పాటు ప్రత్యేక నిపుణుల నియామకాలపై దృష్టిసారించాయని రిక్రూట్‌మెంట్ ఏజెన్సీలంటున్నాయి. కృత్రిమ మేధ (ఏఐ), క్లౌడ్ కంప్యూటింగ్, డిజిటల్ పరివర్తన నిపుణులకు డిమాండ్ పెరిగిందని టీమ్‌లీజ్ డిజిటల్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ నీతి శర్మ తెలిపారు.

మళ్లీ మాంద్యం భయాలు: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సుంకాల వడ్డనతో అంతర్జాతీయంగా వాణిజ్య అనిశ్చితి పెరిగింది. యూఎస్ మళ్లీ మాంద్యంలోకి జారుకోవచ్చన్న ఆందోళనలూ వ్యక్తమవుతున్నాయి. అమెరికాలో ఆర్థిక మాంద్యం మన ఐటీ రంగానికి ప్రతికూల పరిణామమే. కాస్త మెరుగవుతూ వస్తున్న నియమాకాల సెంటిమెంట్‌ను మళ్లీ దెబ్బతీయవచ్చని కొందరు భావిస్తున్నారు.

బిజినెస్

రెపో రేటు మరో 0.75 % తగ్గింపు!
ఎస్‌బీఐ రీసెర్చ్ అంచనా

ముంబై: దేశంలో వడ్డీ రేట్లు మరింత తగ్గనున్నాయి. ప్రస్తుతం 6.25 శాతంగా ఉన్న రెపో రేటును.. ఈ ఏడాది అక్టోబరులోగా భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ).. ద్రవ్య పరపతి విధాన కమిటీ (ఎంపీసీ) ముప్పావు శాతం (0.75 శాతం) వరకు తగ్గించే అవకాశం ఉందని ఎస్‌బీఐ రీసెర్చ్ వెల్లడించింది. ఏప్రిల్, జూన్, అక్టోబరు నెలల్లో జరిగే ద్వైమాసిక పరపతి, ద్రవ్య విధాన సమీక్షల్లో పావు శాతం (0.25 శాతం) చొప్పున ఎంపీసీ ఈ తగ్గింపు ప్రకటించే అవకాశం ఉందని పేర్కొంది. దిగొస్తున్న రిటైల్ ద్రవ్యోల్బణమే ఇందుకు కారణమని తెలిపింది. ఈ ఆర్థిక సంవత్సరం (2024-25) మొత్తానికి 4.7 శాతంగా ఉండే రిటైల్ ద్రవ్యోల్బణం వచ్చే ఆర్థిక సంవత్సరం (2025-26)లో 4.2 శాతం మించకపోవచ్చని అంచనా వేసింది. ఫిబ్రవరిలో 3.6 శాతానికి పడిపోయిన రిటైల్ ద్రవ్యోల్బణం ఈ ఆర్థిక సంవత్సరం చివరి త్రైమాసికం మొత్తానికి చూసినా 3.9 శాతం మించకపోవచ్చని ఎస్‌బీఐ రీసెర్చ్ తెలిపింది. దీంతో వచ్చే ఏప్రిల్ నుంచే ఆర్‌బీఐ రెపో రేటు కోతకు సిద్ధమవుతుందని భావిస్తున్నారు.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



15వ తేదీ			
హైదరాబాద్	385	విజయవాడ	420
వరంగల్	387	గోదావరి	390
చిత్తూరు	443	విశాఖపట్నం	400
		డజను గుడ్లు రూ. 66	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	78	విజయవాడ	85
వరంగల్	78	గుంటూరు	85
కరీంనగర్	78	ఒంగోలు	85
మహబూబ్‌నగర్	78	చిత్తూరు	89
కర్నూలు	78	నెల్లూరు	94
విశాఖపట్నం	79	అనంతపురం	94
గోదావరి	85		

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	89,780 ▲	82,300 ▲	1,12,000 ▲
విజయవాడ	90,500 ▲	85,800 ▲	1,03,000 ▲
విశాఖపట్నం	88,530 ▲	81,150 ▲	1,01,660 ▲
రాజమండ్రి	89,780 ▲	82,300 ▲	1,03,200 ▲
ప్రొద్దుటూరు	89,250 ▲	82,650 ▲	1,00,200 ▲
ముంబై	86,843 ▲	79,548 ▲	98,322 ▲

www.andhrajyothy.com
విజయవాడ సిటీ
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI
శనివారం | 15-3-2025
Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



జనసేన ఆవిర్భావ సభకు భారీగా తరలివచ్చిన జన సైనికులకు పార్టీ అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అభివాదం



నిలిచి.. గెలిచాం!

జయ.. జయ.. కేతనం

జనసంద్రమైన పిఠాపురం

- జనసేన అధికారంలోకొచ్చాక పిఠాపురంలో తొలి విజయోత్సవ సభ
- అభిమానులతో పోటెత్తిన రహదారులు
- వేల వాహనాలు హైవేపైనే నిలిపివేత
- కిలోమీటర్ల కొద్దీ నడిచొచ్చిన పవన్ సేన

జగన్ ఇంకో ఇరవై ఏళ్లు హ్యాపీగా నిద్రపోవాలి



- ఏ హాస్యగాడూ ఆయనంత గొప్పగా మాట్లాడలేరు
- 164 సీట్లలో విజయానికి పవన్ కష్టపడ్డారు
- పిఠాపురంలో ఆయన విజయానికి మేమే కారణమని ఎవరనుకున్నా అది వారి ఖర్మ: నాగబాబు

దేశానికి ఉపయోగపడేలా పవన్ ఎదగాలి: నాదెండ్ల



దేశం కోసం చనిపోవడానికైనా సంసిద్ధంగా ఉన్నా. ప్రస్తుతం భాష, సంస్కృతిని తిడుతున్నారు. హిందీని రుద్దుతున్నారంటా హడావుడి చేస్తున్నారు. అన్నీ దేశ భాషలే కదా! తమిళనాడులో హిందీ వద్దని అంటున్నారు. అలాగైతే తమిళ సినిమాలను హిందీలోకి అనువదించవద్దు.. హిందీవాళ్ల డబ్బులు కావాలి. కానీ హిందీ భాష వద్దంటే ఎలా? - పవన్ కల్యాణ్

అసెంబ్లీ గేటును కూడా తాకలేవని సవాల్ చేశారు

చరిచిన ఆ తొడల్ని బద్దలు కొట్టాం: పవన్ కల్యాణ్

100% స్ట్రైక్ రేటుతో ఘన విజయం సాధించాం

నిలబడ్డాం.. 4 దశాబ్దాల టీడీపీని నిలబెట్టాం

- 21 మంది ఎమ్మెల్యేలతో అసెంబ్లీలో, ఇద్దరు ఎంపీలతో పార్లమెంటులో అడుగుపెట్టాం
- ఇప్పుడు జయకేతనం ఎగరేస్తున్నాం.. వైసీపీ వాళ్లు మళ్లీ వస్తే తప్పు మనదే అవుతుంది
- రాజకీయాల్లోకి వచ్చి వేల కోట్లు సంపాదన.. ఆ డబ్బు కోసం అన్నాచెల్లెళ్లు కొట్టుకుంటే మనకు సమస్య ఎలా అవుతుంది?.. జనసేనకు తెలంగాణ జన్మస్థలం.. ఆంధ్ర కర్మ స్థానం

బహుభాషలే దేశానికి మంచిది


- తమిళనాడులో హిందీ వద్దంటారా?
- అలాగైతే మీ సినిమాలను హిందీలోకి అనువదించవద్దు.. డబ్బులైతే కావాలా?
- రాజకీయ వైరుధ్యాలతో దేశాన్ని ముక్కలు చేయొద్దు
- సనాతన ధర్మం నా రక్తంలోనే ఉంది
- ఆవిర్భావ సభలో జనసేనాని పవన్

10,11

అసెంబ్లీ గేటును కూడా తాకలేవని మనల్ని చాలెంజ్ చేసి.. చరిచిన ఆ తొడల్ని బద్దలుకొట్టాం.. అసెంబ్లీలో 21 మంది ఎమ్మెల్యేలు, పార్లమెంటులో ఇద్దరు ఎంపీలతో అడుగుపెట్టాం. దేశమంతా తలతిప్పి తిరిగి చూసేలా వంద శాతం స్ట్రైక్‌రేట్‌తో ఘన విజయం సాధించాం. ఎన్డీయే ప్రభుత్వాన్ని నిలబెట్టాం. ఈ రోజు జయకేతనం ఎగరేస్తున్నాం. - పవన్ కల్యాణ్

పథకాల్లో వివక్ష ఉండదు

పార్టీలకతీతంగా సంక్షేమం: చంద్రబాబు



వైసీపీ దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలి

సంక్షేమం వేరు.. రాజకీయ బంధాలు వేరు

వైసీపీ నేతలతో కలవొద్దు! వారిని దరి చేరనివ్వొద్దు

- ఇన్‌చార్జి మంత్రుల జిల్లా పర్యటనలు పెరగాలి
- గ్రూపు రాజకీయాలకు తావివ్వొద్దు
- మూడు పార్టీ నేతలనూ కలుపుకొని వెళ్లాలి
- ఆ బాధ్యత ప్రజాప్రతినిధులే తీసుకోవాలి
- నామినేటెడ్ పదవులపై కసరత్తు జరుగుతోంది
- మొదటిసారే ఏమీ రాలేదని అనుకోవద్దు
- అందరికీ అవకాశాలిచ్చే బాధ్యత నాది
- పదవి పొందాక హుందాగా ఉండాలి: సీఎం
- మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలతో టెలీ భేటీ

ఇన్‌చార్జి మంత్రులు జిల్లాలకు వెళ్లే సమయంలో ఆయా జిల్లాల కో-ఆర్డినేటర్లు, ఎమ్మెల్యేలు, ఎంపీలకు సమాచారం అందించాలి. కార్యకర్తలు, నాయకులతో మమేకం కావాలి. జిల్లా పార్టీ కార్యాలయానికి తప్పకుండా వెళ్లాలి.

మొదటిసారే పదవులు రాలేదని ఎవరూ అనుకోవద్దు, రెండేళ్ల పదవీకాలం ముగిసిన తర్వాత మిగిలిన వారికి అవకాశాలు కల్పిస్తాం. ఆ బాధ్యత నాది. - చంద్రబాబు

అమరావతి, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): ఏ స్థాయిలో కూడా వైసీపీ నేతలతో సంబంధాలు పెట్టుకోకూడదని టీడీపీ నేతలకు ఆ పార్టీ అధినేత, సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. ఈ మాట చెబితే వైసీపీకి ఓటు వేసిన వారికి పథకాలు ఇవ్వొద్దని తాను చెప్పినట్లుగా ఆ పార్టీ నేతలు తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. దీనిని తిప్పికొట్టాలని టీడీపీ శ్రేణులకు పిలుపిచ్చారు. సంక్షేమ కార్యక్రమాల అమల్లో వివక్ష ఉండదని, పార్టీలకతీతంగా పథకాలు అందజేస్తున్నామని చెప్పారు. టీడీపీ మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలతో ఆయన శుక్రవారం టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. పలు అంశాలపై పార్టీ నేతలకు దిశానిర్దేశం చేశారు. సంక్షేమ పథకాలు వేరు.. రాజకీయపరమైన సంబంధాలు వేరన్నారు. వైసీపీ వారిని దరి

మిగతా 10వ పేజీలో...

'హయగ్రీవ'ను ఆనాడు లాక్కున్నారు

- జీవీ, ఎంవీవీ బృందం నాకు అన్యాయం చేసింది
- భూకేటాయింపు రద్దును స్వాగతిస్తున్నా
- మంచి పనులకు ఆ భూమిని ఉపయోగించాలి
- హయగ్రీవ ఎండీ జగదీశ్వరుడు వ్యాఖ్యలు

12

అతివకు అందలం!



12

- మహిళా సంక్షేమం, ఆర్థిక స్వావలంబనకు ప్రాధాన్యం
- ఎనిమిది నెలల్లో వరాల జల్లు కురిపించిన రాష్ట్ర సర్కారు
- 10.64 లక్షల మంది మహిళలకు 4,418 కోట్ల సంక్షేమం
- శ్రీసత్యసాయి, కాకినాడ జిల్లాల్లో లక్ష దాటిన లబ్ధిదారులు
- అతి తక్కువ మందితో చివరి స్థానాల్లో అల్లూరి, మన్యం
- తల్లికి వందనంతో లబ్ధిదారులు మరింత పెరిగే అవకాశం
- కుట్టుపని శిక్షణకు 1,02,832 మంది మహిళలు ఎంపిక

టీడీఆర్ బాండ్ల జారీకి నిర్దిష్ట గడువు

- అధికారులను బాధ్యులను చేసిన ప్రభుత్వం
- ఫైళ్ల క్లియరెన్స్ సమయ పాలనపై విధివిధానాలు

12

వివేకా హత్యకు నేటితో ఆరేళ్లు

- సాక్షులు, కీలక వ్యక్తుల అనుమానాస్పద మృతి
- కలకలం రేపిన రంగన్న మరణం
- వివేకా కేసులో ఇంకా పూర్తికాని సీబీఐ దర్యాప్తు
- 248 మంది విచారణ..ఎనిమిది మందిపై చార్జిషీట్
- దర్యాప్తును నాడు ముందుకెళ్లనివ్వని జగన్ అండ్ కో
- ఊహించని మలుపులు, ట్విస్ట్‌లు ఎన్నో

12



ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

వెంటాడిన నేరం...!

ఫిలిప్పీన్స్ రాజధాని మనీలాలో అరెస్టయి, ప్రత్యేక విమానంలో నెదర్లాండ్స్‌కు తరలిన ఫిలిప్పీన్స్ మాజీ అధ్యక్షుడు రోడ్రిగో దుతర్తే శుక్రవారం హేగ్‌లోని అంతర్జాతీయ నేర న్యాయస్థానం (ఇంటర్నేషనల్ క్రిమినల్ కోర్టు–ఐసిసి) ముందు హాజరైనారు. అలసిపోయి ఉంటారు, ప్రత్యక్షంగా రానక్కరలేదు అంటూ న్యాయమూర్తులు ఇచ్చిన మినహాయింపు మేరకు, సమీపంలో ఉన్న డిటెన్షన్ సెంటర్‌నుంచి ఆయన వీడియోలింకు ద్వారా తొలిసారిగా విచారణకు హాజరైనారు. మాదకద్రవ్యాలమీద యుద్ధం పేరిట తన ఏలుబడిలో వేలాదిమందిని చంపిన నేరానికి ఐసిసి ఆయనను విచారిస్తోంది. దశాబ్దంన్నరకు పైగా ఐసిసి తనను వెంటాడుతున్నకాలంలో, అడపాదడపా ఆ న్యాయస్థానాన్ని అవమానిస్తూ, నన్ను నువ్వేం చేయలేవంటూ అసభ్యపదజాలంతో చేసిన వ్యాఖ్యలన్నీ ఈ సందర్భంగా ఆయనకు గుర్తుకొచ్చివుంటాయి.

దేవుడు క్షమించడు, పాపులను శిక్షించేవరకూ విశ్రమించడు అని దుతర్తే హయాంలో ఆయన తుపాకీగుళ్ళకు బలైన వారి కుటుంబీకులు సంతోషిస్తున్నారు. ఒక వదరు,పొగరుబోతుకు తగినశాస్తి జరిగిందని అంటున్నారు. తన నేరాలూ ఘోరాలమీద ఆయనకు పశ్చాత్తాపమేమీ లేదు. మాదకద్రవ్యాల వ్యాపారాన్ని అణచివేయడం తప్పుకాదని వాదిస్తూ, ఆ ముసుగులో తాను నిబంధనలను ఉల్లంఘించిన నేరాన్ని కప్పిపుచ్చుకుంటున్నాడు. వీధులను శుభ్రం చేస్తున్నప్పుడు కొన్ని జీవులు సహజంగానే చస్తాయంటూ డ్రగ్స్‌తో సంబంధం ఉన్న నేరంమీద అమాయకులను సైతం కాల్చిపారేసిన గతాన్ని నిజం కాదంటున్నాడు. ఇప్పుడు ఆయన లాయర్ ఈ అరెస్టు అక్రమమంటున్నాడు కానీ, దేశ పాలకుడుగా తాను ఎంతటి అమానుషత్వానికైనా ఒడిగట్టవచ్చునని దుతర్తే స్వయంగా గతంలో పలుమార్లు చెప్పుకున్నాడు. 2016లో ఫిలిప్పీన్స్ అధ్యక్షుడు కావడానికి ముందు, దావౌనగర మేయర్‌గా ఉన్న కాలంలో డెత్‌స్క్వాడ్‌లను రహస్యంగా నిర్వహించాడు. కేసులు, విచారణలు, ఆధారాలతో నిమిత్తం లేకుండా, ఈ ప్రైవేటు సైన్యమే నేరగాళ్ళకు మరణశిక్ష విధించేది. తన హయాంలో నేరాలు తగ్గుముఖం పట్టాయని ప్రజలకు చూపించి, దేశాన్ని ప్రక్షాళించడానికి తనలాంటి హీరో అవసరమని ప్రజలను నమ్మించి అధ్యక్షుడైనాడు. దేశం మొత్తం తన అధీనంలోకి రావడంతో ముసుగులు కూడా అవసరం లేకపోయింది. మరిన్ని డెత్‌స్క్వాడ్‌లు తయారైనాయి. పోలీసులకు సర్వాధికారాలు ఇచ్చి, ప్రాణానికి ఇంత అంటూ వెలగట్టడంతో వారు అడ్డూఆపూ లేకుండా రెచ్చిపోయారు. అనుమానితులను తిరగబడేట్టుగా చేసి కాల్చిపారేయమని తానే చెప్పానని ఒక దశలో దుతర్తే గొప్పలకు పోయాడు. ఆయన ఆధ్వర్యంలో సాగిన మాదకద్రవ్యాలమీద యుద్ధంలో కనీసం ముప్పైవేలమంది మరణించారని అంచనా.

మానవహక్కుల ఉల్లంఘనలు, హత్యలపై ఐసిసి దర్యాప్తు ఆరంభించడంతో ఆయన 2019లో తన దేశాన్ని రోమ్ ఒప్పందంనుంచి బయటకు తెచ్చేశారు. ఐసిసికి విచారణార్హతలేదనో, పరిధి కాదనో ఆయన ప్రభుత్వం అడ్డుకుంటూ వచ్చింది. 2022 ఎన్నికల్లో కొత్తప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. అధ్యక్షుడు ఫెర్డినాండ్ మార్కోస్ మార్గాన్ని సుగమం చేయడంతో ఐసిసికి మళ్ళీ 2023జులైనుంచి దర్యాప్తు కొనసాగించే అవకాశం వచ్చింది. ఫిలిప్పీన్స్ అంతర్గత రాజకీయవైరాలు ఈ మాజీ అధ్యక్షుడి అరెస్టులో కీలకపాత్ర పోషించినమాట వాస్తవం. ప్రస్తుత అధ్యక్షుడు ఫెర్డినాండ్ మార్కోస్, దుతర్తే కుమార్తె సారా దుతర్తే కలసి 2022 ఎన్నికల్లో ఘనవిజయం సాధించి అధికారంలోకి వచ్చారు. ఇటీవల ఈ రెండు కుటుంబాల మధ్యా చెడింది. అధ్యక్షుడినే హత్యచేయించడానికి ప్రయత్నించారన్న ఆరోపణతో సహా పలు అభియోగాలతో ఉపాధ్యక్షురాలిని అభిశంసించే ప్రక్రియసాగుతోంది. యుద్ధాలు చేస్తున్న పుతిన్, నెతన్యాహూలమీద కూడా అరెస్టువారెంట్లు జారీ చేసినా, వారిని పట్టితేలేకపోయిన ఐసిసికి దుతర్తే రాక కాస్తంత ఉపశమనం. గాజాలో మానవహననానికి పాల్పడిన నెతన్యాహూమీద అరెస్టువారెంట్ జారీచేయించినందుకు ఐసిసి చీఫ్ ప్రాసిక్యూటర్ కరీంఖాన్‌పై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ పలురకాల ఆంక్షలు విధించిన విషయం తెలిసిందే. దుతర్తేమీద విచారణ ఎన్ని సంవత్సరాలు సాగుతుందో, ఆయనకు ఏ శిక్షపడుతుందో తెలియదు కానీ, ప్రజల ప్రాణాలంటే విలువలేని, మానవహక్కులమీద గౌరవం లేని పాలకులకు ఇది ఒక హెచ్చరిక. అధికారంలో ఉండగా తిరుగులేదని, ఎదురులేదని విర్రవీగుతూ, చట్టవ్యతిరేకంగా వ్యవహరించేవారికి గుణపాఠం.

ఆ దోస్తీ భారత్‌కు మేలు చేసేనా?



▪ పి. చిదంబరం

'పళని' పలుకు

ప్రపంచ చరిత్రలో మొట్టమొదటి హక్కుల పత్రం మాగ్నాకార్టా అని విశ్వసిస్తారు. క్రీ.శ. 1215లో ఇంగ్లాండ్ రాజు దాన్ని అంగీకరించారు. ప్రపంచంలో మొట్టమొదటి పార్లమెంటుగా ఐస్‌లాండ్ దేశపు అల్థింగ్ అని భావిస్తారు. క్రీ.శ.1262లో ఈ తొలి పార్లమెంటు నేర్పాటు చేశారు. ప్రథమ ద్విసభీయ శాసన వ్యవస్థ చరిత్ర బ్రిటన్‌లో క్రీ.శ.1341లో ప్రారంభమయింది. ప్రథమ లిఖిత రాజ్యాంగం శాన్‌మరినో రిపబ్లిక్‌ది. క్రీ.శ.1600 సంవత్సరం నుంచి ఇది అమల్లో ఉంది. అధికారాల విభజనకు ప్రేరణ 'స్పిరిట్ ఆఫ్ లాస్'. ఫ్రెంచ్ తాత్త్వికుడు మోంటెస్క్యూ (1889–1775) రాసిన ఈ ఉద్గ్రంథం అమెరికా రాజ్యాంగ నిర్మాతలకు స్ఫూర్తినిచ్చింది. ఒక దేశ న్యాయ అధికారాలను మొట్టమొదట ఒక సుప్రీంకోర్టుకు అధీనం చేసిన దేశం అమెరికా. సెప్టెంబర్ 24, 1789న సమస్త న్యాయ అధికారాలను సుప్రీంకోర్టుకు అప్పగించారు.

రాజ్యాంగబద్ధమైన చరిత్ర ఉన్నతమైన, ప్రశంసనీయమైన పాఠాలు అన్నీ అమెరికా రాజ్యాంగంలో నిర్దిష్టంగా పొందుపరిచారు. భారత రాజ్యాంగ నిర్మాతలతో సహా అనేక దేశాలలో అమెరికా రాజ్యాంగాన్ని అనుకరించారు. యుద్ధాలు, పేదరికం, వ్యాధుల ముప్పుకు ఆస్కారం లేని కొత్త ప్రపంచ వ్యవస్థను నిర్మించేందుకు అమెరికా నాయకత్వంలో స్వేచ్ఛాయుత, ప్రజాస్వామిక దేశాలు మానవాళికి వాగ్దానం చేశాయి. ఆ లక్ష్య పరిపూర్తిలో అవి చాలవరకు సఫలమయ్యాయి.

ఈ నేపథ్యంలో గత మూడు సంవత్సరాలలో, ముఖ్యంగా జనవరి 20, 2025 నుంచి సంభవించిన, సంభవిస్తున్న పరిణామాలు ప్రపంచ ప్రజలను దిగ్భ్రాంతి పరిచాయి. భావావేశాలకు లోను చేస్తున్నాయి. సహేతుకమైన ప్రతిస్పందనలవి. ఎందుకంటే గత మూడేళ్ల పరిణామాలు ప్రపంచానికి ఎనలేని ముప్పు కలిగించేవిగా ఉన్నాయి. స్వార్థపరత్వం రాజ్యమేలే, నిరంకుశాధికార వ్యవస్థలు ప్రబలిపోయేందుకు ఆ పరిణామాలు దోహదం చేసేవిగా ఉన్నాయి.

అమెరికా సంయుక్త రాష్ట్రాల అధ్యక్ష పదవి మహా శక్తిమంతమైనది. నిర్దిష్టమైన అధికారాలు, ప్రత్యేక అధికారాలతో పాటు అనిర్ణీత అధికారాలు కూడా ఆ పదవికి ఉన్నాయి. పైగా అమెరికా ప్రపంచ అగ్రగామి సంపన్న దేశం అనే వాస్తవం ఆ పదవికి మరింత ప్రాధాన్యాన్ని కల్పిస్తుంది. ఆ అధికారాలను ఉపయోగించుకుని 19వ శతాబ్దిలో అధ్యక్షుడు విలియం మెక్ కిల్లే అమెరికాను భౌగోళికంగా విస్తరింపచేశాడు. ప్యూర్టొరికో, గువామ్, ఫిలిప్పీన్స్, హవాయిలను అమెరికాకు అనుసంధించాడు. ఇరవయో శతాబ్దిలో ఉడ్రో విల్సన్, ఫ్రాంక్లిన్ డి రూజ్వెల్ట్ లు వాక్ స్వాతంత్ర్యాన్ని అణచివేశారు. తమ కార్యనిర్వాహక అధికారాలను ఉపయోగించి విదేశీయులను నిర్బంధంలోకి తీసుకున్నారు. అలా అరెస్ట్ చేసిన వారిని బలవంతంగా స్వదేశాలకు పంపించివేశారు. రాజకీయ అసమ్మతివాదులను సైతం తీవ్రంగా అణచివేశారు. 21వ శతాబ్దిలో బరాక్ ఒబామా అమెరికా కాంగ్రెస్ అనుమతి లేకుండానే లిబియాలో యుద్ధాన్ని ప్రారంభించాడు. యుద్ధ అధికారాల చట్టం–1973 కింద ఆయన స్వతంత్ర నిర్ణయం తీసుకున్నాడు ఇతర అధ్యక్షులు సైతం తమ పదవీ అధికారాల పరిమితులను తమ స్వతంత్ర నిర్ణయాలతో పరీక్షించారు. రాజ్యాంగ విరుద్ధమైన నిర్ణయాలు తీసుకోవడం, చర్యలు చేపడుతూనే కాంగ్రెస్ అభిశంసన నుంచి తప్పించుకోగలిగారు.

అమెరికా అధ్యక్ష పదవి అధికారాలను మరే అధ్యక్షుడు కంటే ఎక్కువగా ఉపయోగించుకున్నది 47వ అధ్యక్షుడు డోనాల్డ్ జె ట్రంప్. గత ఎనిమిది దశాబ్దాలలో అమెరికా ఎన్నిమార్లు తన మామూలు విధానాలకు భిన్నంగా వ్యవహరించినప్పటికీ, ఎన్నిసార్లు దుస్సాహసాలకు పాల్పడినప్పటికీ స్వేచ్ఛాయుత, ప్రజాస్వామిక దేశాల నాయకుడుగా గౌరవాదరాలు పొందింది. సకల దేశాల ప్రజలు, ప్రభుత్వాలు ప్రపంచ వ్యవహారాలలో అమెరికా అధ్యక్షుడి మాటను, ఆమోదించినా, ఆమోదించకపోయినా, ప్రాధాన్యమిచ్చారు. ప్రపంచ వ్యవస్థ భద్రతకు హామీపడ్డ దేశం అమెరికా. ప్రపంచ శాంతి సంరక్షణకు, విద్యావ్యాసంగాల వికాసానికి, ఆరోగ్య భద్రతకు, మానవ హక్కుల పరిరక్షణకు అమెరికా ప్రభుత్వం ఎన్నో అంతర్జాతీయ సంస్థలను నెలకొల్పి, నిర్వహించింది. అయితే డోనాల్డ్ ట్రంప్ మళ్లీ అధికారానికి వచ్చిన రెండు నెలల లోగానే అమెరికా ప్రపంచ ఆరోగ్య సంస్థ నుంచి వైదొలిగింది; ఐక్యరాజ్యసమితి మానవ హక్కుల సమితికి, యునైటెడ్ నేషన్స్ రిలీఫ్ అండ్ వర్క్స్ ఏజెన్సీకి నిధులు నిలిపివేస్తామని, అసలు ఆ సంస్థ నుంచి ఉపసంహరించుకుంటామని అమెరికా బెదిరిస్తోంది. ట్రంప్ ఆదేశాల మేరకు ఇప్పటికే యుఎస్ ఎయిడ్‌ను మూసివేశారు. ఫలితంగా ప్రపంచ వ్యాప్తంగా ఎన్నో సహాయ కార్యక్రమాల అమలు పూర్తిగా నిలిచిపోయింది. అలాగే నాటో నుంచి కూడా వైదొలుగుతామని, యూరోపియన్ మిత్ర దేశాలకు గతంలో వలే ఎటువంటి సహాయ సహకారాలు అందించే ప్రసక్తి లేదని ట్రంప్ మహాశయుడే స్వయంగా ప్రకటించాడు.

డోనాల్డ్ ట్రంప్ విచిత్రమైన వ్యక్తి. స్నేహితుడు శత్రువు అయిపోయాడు (ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్స్కీ), శత్రువు మిత్రుడు కావచ్చు (రష్యా అధ్యక్షుడు పుతిన్). పొరుగు దేశం సువిశాల కెనడాను అమెరికాలో 51వ రాష్ట్రంగా ఉండాలని ఆయన ప్రగాఢంగా అభిలషిస్తున్నాడు. అమెరికాలో చేరమని గ్రీన్ ల్యాండ్‌కు బహిరంగంగా ఆహ్వానం పలికాడు. అంతటితో ఆగకుండా ఏదో ఒక విధంగా గ్రీన్ ల్యాండ్‌ను తమ దేశంలో కలుపుకుంటామని' నర్మగర్భితమైన హెచ్చరికను ట్రంప్ జారీ చేశాడు.

డోనాల్డ్ ట్రంప్‌కు అమెరికా ప్రయోజనాలే ముఖ్యం. శత్రువు (చైనా), మిత్రుడు (భారత్) మధ్య ఎటువంటి భేదాన్ని చూపరు. 'నేను నా జీవితమంతా ఎన్నో ఒప్పందాలు చేసుకున్నాను' అని ఆయన ఘనంగా చెప్పుకున్నారు. ఉక్రెయిన్ అధ్యక్షుడిని చర్చలకు ఆహ్వానించి, అవమానపరిచి, పంపించివేసిన ట్రంప్ 'ఒప్పందానికి సిద్ధమయినప్పుడే మళ్లీ వైట్‌హౌజ్‌కు రండి' అని జెలెన్ స్కీని ఆహ్వానించాడు బహుశా, ఉక్రెయిన్‌లో లభించే అరుదైన ఖనిజ సంపద విషయమై ఒప్పందం కుదుర్చుకునేందుకు కాబోలు! రష్యాతో యుద్ధంలో సహాయపడుతున్నందుకు ఉక్రెయిన్ తన ఖనిజ సంపదను అమెరికాకు ఇవ్వాలన్నది ట్రంప్ వాదన మరి.



అమెరికా, రష్యా, చైనాలు ప్రపంచాన్ని 'ప్రభావ ప్రాంతాలు'గా విభజించి తమ ప్రాబల్యంలో ఉన్న ప్రాంతాలలోని సహజవనరులను దోపిడీ చేస్తాయి. ట్రంప్ సుంకాల సమరంతో నియమబద్ధ ప్రపంచ వాణిజ్యం తలకిందులవుతుంది. భారత ఆర్థిక వ్యవస్థ ధ్వంసమవుతుంది. స్వార్థపరుడు, అహంభావి అయిన ట్రంప్ తన విధానాలతో ప్రపంచ ఆర్థిక వ్యవస్థ కూలిపోయినా లెక్కచేయడు. మరో నాలుగు సంవత్సరాల పాటు ప్రపంచానికి అన్నీ కష్టాలే.

రాజనీతిజ్ఞతను వ్యాపార లావాదేవీగా మార్చి వేసిన ఘనత ట్రంప్‌దే అనడంలో సందేహం లేదు. అత్యంత శక్తిమంతమైన పదవిలో ఉన్న ఇటువంటి వ్యక్తితో ప్రపంచం ఏమవనున్నది? ట్రంప్ విధానాల పర్యవసానాలు మన దేశం విషయంలో ఎలా ఉంటాయి? ప్రపంచ స్థాయిలో చూస్తే నిరంకుశ పాలకులు అయిన ట్రంప్, పుతిన్, క్సీ జిన్‌పింగ్‌లు తమ ప్రయోజనాలకు ఏకమయ్యే అవకాశమున్నది. వారు తాము కోరుకుంటున్న ఇరుగు పొరుగు దేశాలను స్వాధీనం చేసుకునేందుకు తప్పక ప్రయత్నిస్తారు. ట్రంప్ ఇప్పటికే పనామా కాలువ, కెనడా, గ్రీన్‌ల్యాండ్, గాజాపై కన్ను వేశారు; ఇప్పటికే క్రిమియా, అబ్కాజియా, దక్షిణ ఒస్సెటియాను కలిపివేసుకున్న రష్యా ఉక్రెయిన్‌ను కైవశం చేసుకోవడానికే యుద్ధానికి దిగింది. బహుశా జార్జియాను కలిపివేసుకోవడానికి కూడా ప్రయత్నించవచ్చు. ఇక చైనా టిబెట్, హాంకాంగ్‌లను బలవంతంగా కలిపివేసుకుని ఇప్పుడు తైవాన్, భారత్‌లోని కొన్ని హిమాలయ ప్రాంతాలు, దక్షిణ చైనా సముద్రంలోని దీవులను కలిపివేసుకోవాలని ప్రగాఢంగా ఆకాంక్షిస్తోంది. దీన్ని ఆ దేశం ఏ మాత్రం దాచుకోవడం లేదు.

అమెరికా, రష్యా, చైనాలు ప్రపంచాన్ని 'ప్రభావ ప్రాంతాలు'గా విభజించి తమ ప్రాబల్యంలో ఉన్న ప్రాంతాలలోని సహజవనరులను ఉపయోగించుకుని ఆర్థికంగా బలోపేతమవుతాయి. ఈ దృష్ట్యా భారత్, చైనా దాడికి గురయ్యే అవకాశమున్నది. అరుణాచల్ ప్రదేశ్, ఇతర హిమాలయ ప్రాంతాలను చైనా ఆక్రమించుకోవడానికి ప్రయత్నిస్తే అమెరికా గానీ, రష్యా గానీ మనకు ఎటువంటి సహాయ సహకారాలు అందించవు. అమెరికా నుంచి మన దేశం మరింత ఎక్కువగా సైనిక సామగ్రిని కొనుగోలు చేసుకోవల్సిన అనివార్యత ఏర్పడుతుంది. అలాగే అమెరికా నుంచి మరిన్ని వస్తూత్పత్తులను స్వల్ప సుంకాలతో దిగుమతి చేసుకోవడానికి అంగీకరించవలసివస్తుంది. అమెరికా, రష్యాల సామరస్యం నెలకొంటే రష్యన్ చమురు సంపద మనకు చౌక ధరలకు ఇంకెంత మాత్రం అందుబాటులో ఉండదు. బ్రిక్స్, క్వాడ్ కూటమి నుంచి మనకు పెద్దగా తోడ్పాటు లభించకపోవచ్చు. అమెరికా మద్దతుతో పాకిస్థాన్, బంగ్లాదేశ్‌లు భారత్‌కు వ్యతిరేకంగా తమ ద్వైపాక్షిక సంబంధాలను పటిష్ఠం చేసుకుంటాయి. ట్రంప్ సుంకాల సమరాన్ని పూర్తి స్థాయిలో ప్రారంభిస్తే నియమబద్ధ ప్రపంచ వాణిజ్యం తలకిందులవుతుంది. భారత ఆర్థిక వ్యవస్థ ధ్వంసమవుతుంది. జర్మనీ, ఫ్రాన్స్‌లు ఇప్పటికే గ్రహించినట్టుగానే భారత్ కూడా తనను తానే కాపాడుకోవల్సి ఉంటుంది. డోనాల్డ్ ట్రంప్ స్నేహం (దోస్తీ) భారత్‌కు బహుధా ఉపకరిస్తుందని నరేంద్ర మోదీ భావిస్తున్నారేమో కానీ అందుకు ఏ మాత్రం ఆస్కారం లేదు. ట్రంప్ స్వార్థపరుడు, అహంభావి. తన విధానాలతో ప్రపంచ ఆర్థిక వ్యవస్థ కూలిపోయినా ఆయన లెక్క చేయడు. మరో నాలుగు సంవత్సరాల పాటు ప్రపంచానికి అన్నీ కష్టాలే, సందేహం లేదు.

(వ్యాసకర్త కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు)

బహుజన రాజ్యాధికార పథనిర్దేశకుడు

బహుజనుల సకల సమస్యల పరిష్కారం లక్ష్యంగా మహోద్యమాన్ని నడిపిన యోధుడు కాన్షీరామ్. 'ఓట్ హమారా – రాజ్ తుమారా, నహీ చలేగా.. నహీ చలేగా' అనే డైనమేట్ వంటి నినాదంతో, జిస్‌కా జిన్‌కా సంఖ్య భారీ, ఉస్‌కి ఉత్‌ని భాగ్యధారి అనే నినాదంతో సమాజంలోని 85 శాతంగా ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ ప్రజలకు రాజ్యాధికారం దక్కాలనే సిద్ధాంత భూమికలో ఉత్తరప్రదేశ్‌లో రాజకీయ ప్రకంపనలు సృష్టించిన గొప్ప వ్యూహకర్త కాన్షీరామ్.

1934 మార్చి 15న పంజాబ్ రాష్ట్రం, రోపార్ జిల్లా ఖవాస్‌పూర్‌లో ఉన్న పీర్షిపూర్ బంగ్లా గ్రామంలో ఒక చమార్ కుటుంబంలో కాన్షీరామ్ జన్మించారు. ఆయిదో సిక్కు గురు రాందాస్ చమార్‌లను సిక్కు మతంలోకి తీసుకువచ్చారు. వారిని రాందాసియాలు అనేవారు. కబీర్, రవిదాస్‌ల వంటి దళిత సాధువులతో ప్రభావితమైన ఖల్సా పంథ్, ఆర్యసమాజ్ ఉద్యమాల ప్రభావం చిన్ననాడే కాన్షీరామ్‌పై పడింది. పూణేలోని (ఈఆర్‌డిఎల్) ఎక్స్‌ప్లోజివ్ రీసర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ల్యాబరేటరీలో సైంటిస్ట్‌గా పనిచేస్తున్నప్పుడు అధికారులు బుద్ధ జయంతి, అంబేడ్కర్ జయంతి సెలవులను రద్దు చేయడంపై దళిత ఉద్యోగులు నిరసన తెలుపడంతో, అందులో రాజస్థానీ షెడ్యూల్డ్ కులానికి చెందిన వ్యక్తిని సస్పెండ్ చేయడంపై కాన్షీరామ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కాన్షీరామ్ ఆయన పక్షాన నిలిచి పోరాడారు. అది ఆయన దళిత ఉద్యోగుల ఉద్యమాన్ని నిర్మించేందుకు కారణమైంది. ఈ ఉద్యమం తీవ్రతరమై కాన్షీరామ్ ఏకంగా రక్షణ మంత్రి వై.బి.చవాన్‌ను కలిసి పరిస్థితి వివరించారు. చవాన్ మొత్తం ఉదంతంపై ఉన్నత స్థాయి దర్యాప్తునకు ఆదేశించి సస్పెండయిన ఉద్యోగికి న్యాయం జరిగేలా చేశారు. దీనితో కాన్షీరామ్ దళిత ఉద్యోగులకు ఒక హీరోగా మారారు. ఈ సంఘటనే కాన్షీరామ్ జీవితాన్ని మార్చి వేసింది. తన జాతి జనుల కోసం పాటుపడ్డ బాబాసాహెబ్ అంబేడ్కర్ ఆశయాల్ని కొనసాగించాలని, ప్రస్తుత సామాజిక వ్యవస్థపై తిరుగుబాటు చేయక తప్పదని నిర్ణయించుకున్నారు.



ఈ దేశాన్ని పాలించడమే లక్ష్యంగా రాజ్యాధికారం వైపు వెళితేనే బహుజనులకు భవిష్యత్తు ఉంటుందని స్పష్టంగా వివరించినవారు కాన్షీరామ్. ఆయన మరణించినా ఆయన ఆశయం మరణించలేదు.

1965 నుంచి 1971 వరకు రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియాను బలోపేతం చేయడానికి రాత్రి పగలు అకుంఠిత దీక్షతో కృషి చేశాడు. ఆర్పీఐలో వచ్చిన విభేదాలతో ఆయన పార్టీ నుంచి బయటకు వచ్చి తన ఉద్యమాన్ని కొనసాగించారు. బోధించు, పోరాడు, సమీకరించు నినాదంతో 1978 డిసెంబర్ 6న 'వెనుకబడిన కులాల, మైనారిటీ ఉద్యోగుల సమాఖ్య' (బామ్‌సెఫ్) స్థాపించారు. తాము పుట్టిన కులంలోని అట్టడుగున ఉన్న తమ సోదరుల కోసం తాము కొంత పాటుపడాలని పిలుపునిచ్చారు. అంబేడ్కర్ కృషితో వచ్చిన రిజర్వేషన్ల వల్ల లాభం పొందిన వారిని ఏకం చేశారు. బామ్‌సెఫ్ నిర్వహణకు అవసరమైన ఆర్థిక సహాయం కోసం తీవ్రంగా శ్రమించాడు. 'పే బ్యాక్ టు ద సొసైటీ' అనే నినాదంతో రాజకీయేతర పునాదులను పటిష్ఠం చేయడానికి బామ్‌సెఫ్ పనిచేసింది. దోపిడీకి గురౌతున్న సమాజానికి విద్యావంతులైన ఉద్యోగులు మేధస్సు, డబ్బు, ప్రతిభ అందించాలని, బామ్‌సెఫ్ నిర్మాణానికి ఈ మూడే చోదక శక్తులని కాన్షీరామ్ ప్రకటించాడు. బామ్‌సెఫ్‌ను కాన్షీరామ్ నిజమైన అంబేడ్కర్ మిషన్‌గా తీర్చిదిద్దాడు.

సామాజిక పరివర్తన ధ్యేయంగా 1981లో డిసెంబర్ 6న దళిత అణగారిన వర్గాల పోరాట సమితి (డీఎస్ 4) స్థాపించారు. ఉత్తర భారతదేశంలో ఒక సంచలనాత్మక సామాజిక విప్లవాన్ని సృష్టించారు. ఇందులో యువత, విద్యార్థులు పెద్ద సంఖ్యలో చేరారు. కార్గిల్ నుంచి కన్యాకుమారి వరకు 'సమానత్వం కోసం' సైకిల్ ర్యాలీ నిర్వహించిన కాన్షీరామ్ 1982లో హర్యానా, ఢిల్లీ, పంజాబ్, జమ్మూకాశ్మీర్ ఎన్నికల్లో సంస్థ పోటీ చేసింది. పోటీ చేసిన పార్టీలలో 4వ స్థానాన్ని సాధించింది. ఈ ఉత్సాహంతో కాన్షీరామ్ ఉత్తర భారత దేశమంతా పర్యటించి బహుజనులకు ఒక రాజకీయ పార్టీ అవసరాన్ని తెలియజేస్తూ సభలు నిర్వహించాడు. 1930లో డా. బి.ఆర్. అంబేడ్కర్ తొలిసారిగా ఓటు హక్కు లభించాక "మీరు వెళ్ళి మీ ఇంటి గోడలపై రాయండి, ఈ దేశానికి మేము పాలకులం కాబోతున్నాం" అని పేర్కొన్నారు. ఈ నినాదాన్ని తీసుకుని. మేధావులతో చర్చించి కాన్షీరామ్ పార్టీ పేరు, ఎన్నికల గుర్తు గురించి చర్చించి, ఏప్రిల్ 14, 1984న బహుజన్ సమాజ్ పార్టీని స్థాపించారు. కాన్షీరామ్ ఏ కొత్త కార్యక్రమం మొదలుపెట్టినా అది అంబేడ్కర్ పుట్టిన రోజున గానీ, మరణించిన రోజున గానీ చేస్తారు. ఎందుకంటే ఆ రెండు రోజులు బహుజనులకు ప్రధానమైనవని ఆయన భావించేవారు. పూలే ఉద్యమం నుండి బహుజన్ సమాజ్ పేరును, అంబేడ్కర్ ఉద్యమం నుండి నీలిజెండా, ఏనుగు గుర్తును తీసుకున్నట్లుగా కాన్షీరామ్ ప్రకటించారు.

బహుజన సమాజ్ పార్టీని జాతీయ పార్టీగా తీర్చిదిద్దడంలో కాన్షీరామ్ నిరంతరం శ్రమించాడు. విజయం సాధించాడు. దేశంలో పెద్ద రాష్ట్రమైన ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి ఒక సామాన్య మహిళా, 'చమార్ స్త్రీని మూడుసార్లు ముఖ్యమంత్రిని చేసిన ఘనత పూర్తిగా కాన్షీరామ్‌దే. ఓట్ల రాజకీయాలను నోట్లు కలుషితం చేస్తూ కార్పొరేట్ రాజకీయాలు కొనసాగుతున్న తరుణంలో 'ఒక ఓటు ఒక నోటు' అనే నినాదంతో ప్రజల దగ్గరకు వెళ్ళి వారిచ్చే డబ్బుతో ప్రచారం చేస్తూ ఉత్తరప్రదేశ్‌లో అధికారాన్ని సాధించి దేశ రాజకీయాలకు సరికొత్త విలువలు నేర్పిన మార్గదర్శకుడు కాన్షీరామ్. పదవులు ముఖ్యం కాదు బహుజన సమాజ్ నిర్మాణమే నా కర్తవ్యం అని భావించేవారు. 1994లో కోనేరు రంగారావు ఉపముఖ్యమంత్రి కాగలిగారంటే అందుకు కాన్షీరామ్ హైదరాబాద్ జింఖానా గ్రౌండ్స్‌లో నిర్వహించిన శక్తి ప్రదర్శన ప్రధాన కారణం. 2003లో మెదక్ అసెంబ్లీ ఉపన్నికలలో బీఎస్పీ అభ్యర్థి పోటీ చేసినప్పుడు బహుజనులు ఏకమైతేనే ఈ నిచ్చనమెట్ల కుల వ్యవస్థను కూలదోయవచ్చని పిలుపునిచ్చారు.

దేశ రాజకీయాల్లో కాన్షీరామ్ ప్రవేశం గొప్ప సంచలనం. అంబేడ్కర్ కలలు నిజం చేయడానికి ముందుకురికిన రాజనీతిజ్ఞుడు. అన్ని రాజకీయ పార్టీలు వారి వారి పార్టీ స్థాపకుల ఫోటోలను వేదిక మీద ప్రదర్శిస్తుంటే కాన్షీరామ్ మాత్రం జాతిని చైతన్య పరిచిన బుద్ధుడు, పూలే, నారాయణగురు, పెరియార్, అంబేడ్కర్‌ల వంటి సామాజిక విప్లవకారుల చిత్రపటాలను బహిరంగ సభల్లో ప్రదర్శించేవారు. ఈ దేశాన్ని పాలించడమే లక్ష్యంగా రాజ్యాధికారం వైపు వెళితేనే బహుజనులకు భవిష్యత్తు ఉంటుందని స్పష్టంగా వివరించినవారు కాన్షీరామ్. ఆయన మరణించినా ఆయన ఆశయం మరణించలేదు.

• డాక్టర్ బోనకుర్తి సోమేశ్వర్
'పునాది' సెంటర్ ఫర్ రిసెర్చ్

(నేడు కాన్షీరామ్ జయంతి)

దీనజన సేవావ్రతుడు

నిస్వార్థంగా తపోనిష్ఠతో పనులు చేయడం, సామాజిక సంస్కరణ, మద్యపాన నిషేధం ఆయుధాలుగా నిర్విరామ గాంధీజీ ఉపదేశాలతో ప్రభావితమై దీనజన సేవే తన కర్తవ్యంగా జనంలోకి వెళ్ళిన సేవాపరాయణుడు పొట్టి శ్రీరాములు. సత్యవ్రతం, అస్పృశ్యతా నివారణ, అహింస, ఖాదీ ప్రచారం ఆయన నమ్మిన సామాజిక పరివర్తనలుగా వెలుగొందాయి. అందుకే ఆ బలం ఆయన్ను మహోన్నతుడిగా ధ్రువీకరించింది.

గాంధీజీ బోధించిన నిర్మాణ కార్యక్రమంలో స్వార్థత్యాగం, దీనజనోద్ధరణలే శ్రీరాములును విశిష్టంగా ఆకర్షించాయి. దీనజన సౌభాగ్యానికి అవసరమైన నిస్వార్థపరత, సాత్విక ప్రవృత్తి, క్లేశసహిష్ణుత, నిరాడంబరత, సహనం మొదలైన గుణాలను దేహభాగాలుగా అలవరుచుకోవాలనే సదాశయంతో సబర్మతీ ఆశ్రమ జీవనాన్ని ఆయన ఆశయదీపంగా ముందుకు నడిచాడు.

శ్రీరాములు ఫిర్యాదుతో గాంధీజీ నానాదాస్, ప్రేమాబెహన్‌లను మందలించడం గొప్ప విశేషం. బ్రహ్మచర్యమంటే కేవలం స్త్రీ పురుష సంపర్కం మాత్రమే కాదు, మనోవాక్కాయకర్మల కామక్రోధాల మీద పూర్తి నిగ్రహం కల్గి ఉండడమేనని, అదే నిజమైన బ్రహ్మచర్యమన్న గాంధీజీ సిద్ధాంతిక వారసుడు శ్రీరాములని నిరూపించాడు. ఆశ్రమవాసుల్లో క్రమశిక్షణ, సమయపాలన ఎంతైనా అవసరమనేది శ్రీరాములు ప్రగాఢ విశ్వాసం. శ్రీరాములు సత్యవ్రత పాలన నిష్ఠ, అతని నిర్భయత్వం చూసి గాంధీజీ ఎంతో ఆనందించారట.


దీనజన సేవా వ్రతాన్ని చక్కగా అలవరుచుకొన్న ఆదర్శమూర్తి, అద్భుత స్ఫూర్తి, సేవాతపస్వి శ్రీరాములు. ఆదర్శాలన్నిటిలోను శ్రీరాములును ఎక్కువగా ఆకర్షించింది దీనజన సేవే కావడం విశిష్ట సంకేతం. అందుకే ఆయన తన శేష జీవితాన్ని దీన జనసేవకే అంకితమివ్వాలని నిర్ణయించుకొన్నాడు. ఆ ప్రకారమే నడుచుకొన్నాడు. నిబద్ధతతో వ్యవహరించిన మహర్షి శ్రీరాములు.

గాంధీజీకి ప్రీతిపాత్రమైన సత్యవ్రతపాలన శ్రీరాములును విశేషంగా ఆకర్షించింది. అయితే, సత్యవ్రతపాలకుడు జనరంజకుడు కావడం అరుదైన విషయం. గాంధీజీ సత్యవ్రతాన్ని పాటిస్తూనే, లోకప్రియత్వాన్ని కూడా సాధించగల్గారు. ఆయన అడుగుజాడై, వెలుగువాడై సాధించిన పరిణతితో శ్రీరాములు సైతం సత్యవ్రతాన్ని పాటిస్తూ జనరంజకుడై ప్రజామోదయోగ్యుడయ్యాడు. సత్యవ్రతాన్ని తన గురువు కంటే ఖచ్చితంగా పాటించిన ఘనత శ్రీరాములుదే కావడం విశేషం. శ్రీరాములు నిష్ఠుర సత్యవ్రత పోరాటానికి, పాటవానికీ సబర్మతీ ఆశ్రమ సంఘటనే దృష్టాంతరంగా పేర్కొనవచ్చు. సబర్మతీ ఆశ్రమంలో స్త్రీ పురుషులకు ప్రత్యేక హాస్టల్ ఉండేది. కులమతాలు, లింగబేధాలు, వయస్సు, సాంఘిక హోదాల వివక్ష లేకుండా ఆశ్రమవాసులందరికీ నిబంధనలు వర్తించేవి. రాత్రి తొమ్మిది గంటలు దాటిన తర్వాత 'క్షాత్రాలయం' అనే స్త్రీల హాస్టల్‌లో పురుషులెవ్వరూ కన్పించరాదనే నియమావళి, సబర్మతీ ఆశ్రమసిద్ధాంతంగా పరిడవిల్లేది. ఓ రోజు ఆశ్రమ వ్యవహారాల కార్యదర్శి నానాదాస్ గాంధీ 'క్షాత్రాలయం'లో వివిధ వ్యవహారాలను చర్చిస్తూ ప్రేమాబెహన్ కాంతక్ వద్దే ఎక్కువసేపు ఉండడం జరిగింది. నానాదాస్ గాంధీ పట్లా, కుమారి ప్రేమాబెహన్‌కాంతక్ పట్లా ఉన్న గౌరవంతో ఆ సంఘటనను మిగతా వారు పట్టించుకోకపోయినా శ్రీరాములు మాత్రం తీవ్రంగా పరిగణించాడు. ఆశ్రమ కార్యదర్శికి తన మీద కోపం వస్తుందని కూడా చూడకుండా, ఇరుగు పొరుగు వారి సలహా వినకుండా ఈ నియమోల్లంఘనను గాంధీజీ దృష్టికి తీసుకెళ్ళాడు. ఎంతటి సచ్ఛీలురైనా బాధ్యతాయుత పదవులలో ఉన్నవారు క్రమశిక్షణలో ఇతరులకు మార్గదర్శకం కాకపోవడం అపరాధం అని వాదించి, నియమపాలనతో రాజీపడని రుజువర్తనుడు శ్రీరాములు.

వ్యక్తిగత ఆస్తి లేకపోవడం శ్రీరాములు జీవితం పూర్తిగా ప్రజాసేవకు అంకితం కావడానికి దోహదం చేసింది. ఇలా వ్యక్తిగత ఆస్తులు లేని అరుదైన సమున్నత వ్యక్తిత్వం ప్రకాశం పంతులు లాంటి త్యాగమయ జీవితం శ్రీరాములు గారిది కావడంతో మహోన్నతమైంది.

అస్పృశ్యతా నిర్మూలన శ్రీరాములు గాంధీజీ నుంచి గ్రహించిన సిద్ధాంతాలలో అగ్రగామిగా భాసిల్లుతుంది. అంటరానితనాన్ని నిర్మూలించడానికి పాకీ వారి ఇళ్ళలో ఉంటూ, హరిజనుల దేవాలయ ప్రవేశం కోసం అగణితంగా కృషిసల్పిన మహానుభావుడు అమరజీవి శ్రీరాములు సర్వమానవ సౌభ్రాతృత్వం ఆయనకు మదిలో నాటుకొన్న మహత్తరమైన అంశం. దానికే ఆయన అంకితం కావాలని నిర్ణయించుకొన్న త్యాగధనుడాయన. ఆంధ్ర రాష్ట్ర నిర్మాణానికి అసువులు బాసిన అమరజీవి ఆయన. భోగభాగ్యాలు స్వీకరించని నిజమైన సత్యాగ్రహి శ్రీరాములు ఒక్కడే! ఆయన జన్మదినం ఆంధ్రులకు పుణ్యదినం! భాషాప్రయుక్త రాష్ట్రాలకు పర్వదినం!!

○ చిన్ని నారాయణరావు



గాంధీజీకి నిజమైన వారసుడు పొట్టి శ్రీరాములు. భారతదేశ చిత్రపటాన్ని పునర్లిఖింపచేసిన అనుపమాన అహింసాయోధుడు. ఆయన సేవాపరాయణత్వం విస్మరించలేని స్ఫూర్తిదాయక చరిత్ర.

లక్ష్య పరిపూర్తిలో 'దీక్షా' బద్ధుడు

పొట్టి శ్రీరాములు అనగానే ఆంధ్రరాష్ట్రం ఏర్పాటు గుర్తుకు రావచ్చు. కానీ, 58 రోజులు కఠోర దీక్షకు కూర్చుని ప్రాణాలు కోల్పోయిన పొట్టి శ్రీరాములు నేపథ్యం ఏమిటి? ఎందుకంత సాహసానికి ఒడిగట్టారు అని తరచి చూస్తే ఎన్నో విషయాలు తారసపడతాయి. 1952 అక్టోబరు 19న పొట్టి శ్రీరాములు మదరాసు నగరంతో కూడిన ఆంధ్ర రాష్ట్రం కావాలని చేపట్టిన దీక్ష ఐదవ నిరాహార దీక్ష. అంతకుముందు చేసిన నాలుగు దీక్షలు ఎంతో విజయవంతమయ్యాయి.

1946 మార్చి ఏడవ తేదీన హరిజన దేవాలయ ప్రవేశం కోసం నెల్లూరులోని మూలాపేట వేణుగోపాలస్వామి ఆలయంలో 10 రోజుల పాటు నిరాహారదీక్ష చేసి, విజయం సాధించారు. అదే పద్ధతిలో తిరుమల దేవాలయంతో సహా అన్ని దేవాలయాలలో హరిజన ప్రవేశం కోసం అదే సంవత్సరం నవంబరు 25న మొదలుపెట్టిన రెండవ దీక్ష 19 రోజులు జరిగి సంబంధిత బిల్లు ఆమోదింపచేయడంలో విజయం పొందారు. ఈ రెండు దీక్షలు చేసిన కాలంలో గద్దె మీద ఉన్నది తెల్ల దొరలు. హరిజనోద్ధరణకు పాటుపడుతూనే ఖాదీ ప్రచారం, నెల్లూరు మునిసిపల్ ఉద్యోగులు, మరీ ముఖ్యంగా పారిశుద్ధ్య సిబ్బంది సమస్యలు, మద్యపాన నిషేధం వంటి ప్రధాన సమస్యలే కాకుండా బిక్షుక సమస్య, జైళ్ళలో ఖైదీల సమస్యలు, విద్యార్థుల సమస్యలు, వివాహ సంస్కరణలు వంటి రంగాలలో కూడా కృషి చేసి బొంబాయి దురంతాలకు వ్యతిరేకంగా శ్రమించారు.

హిందూ–ముస్లిం మత సమస్యను ప్రధానంగా తీసుకుని గాంధీజీ హరిజనుల సమస్యకు తక్కువ ప్రాధాన్యత ఇచ్చారేమోనని పొట్టి శ్రీరాములు భావన. హరిజనుల అభ్యున్నతికి దేవాలయ ప్రవేశం ఒక్కటే సరిపోదని, మరింత దృష్టి పెట్టి సాంఘిక సమానత్వం సాధిస్తే మినహా దక్షిణ భారతదేశంలోని అట్టడుగు ప్రజలు స్థిమితపడరని ఆయన భావించారు. గాంధీజీ గతించిన తర్వాత 1948 సెప్టెంబర్ 10వ తేదీన అప్పటి మదరాసు ప్రెసిడెన్సీ ముఖ్యమంత్రి కార్యాలయం ఎదుట నిరసన వ్రతానికి పొట్టి శ్రీరాములు దిగారు. ఈ దీక్షకు సంబంధించి గాంధీజీ స్థాపించిన 'హరిజన్' పత్రిక సంపాదకులు కిషోరీలాల్‌కు 1948 సెప్టెంబర్ 29న పొట్టి శ్రీరాములు హృదయ విదారక విషయాలతో ఒక ఉత్తరం రాశారు. బ్రిటీషు ప్రభుత్వం పూనుకోలేని ఘాతుకానికి అప్పటి ప్రభుత్వం తెగబడిందని పొట్టి శ్రీరాములు మీద 1982లో పరిశోధన చేసి, పిహెచ్.డి చేసిన బాదం శ్రీరాములు తన సిద్ధాంత గ్రంథంలో ఈ లేఖలోని విషయాలు ఉటంకిస్తూ వ్యాఖ్యానించారు. మూడవ దీక్షలో 11 రోజుల తర్వాత అరెస్టు చేసి జైలుకు పంపారు. అక్కడ ఏడు రోజులు దీక్ష కొనసాగించి మరింత ముందుకు వెడితే తన ఉనికికే సమస్య అవుతుందని దీక్ష మానివేశారు. అలా మూడవ దీక్ష మొత్తం 18 రోజులు చేశారు. గాంధీజీ గతించిన జనవరి 30ని ఒక ప్రాధాన్యతగా గమనించి ప్రతినెలా 30వ తేదీని 'హరిజన సేవా దినోత్సవం'గా ప్రకటించి, ఈ దిశగా చేసిన చర్యలు సమీక్ష చేసుకుంటూ మరిన్ని చర్యలు క్రమం తప్పకుండా చేపట్టాలని పొట్టి శ్రీరాములు ఆలోచన. దానికోసమే ఈ 3, 4 దీక్షలు కొనసాగాయి. అర్ధాంతరంగా మూడవ దీక్ష ఆగిపోయినప్పుడు నిరాహార దీక్షకు రంగస్థలం వార్ధా ఆశ్రమమని గుర్తించి అక్కడ దీక్షకు పూనుకున్నారు. అతి కష్టం మీద వినోబా భావే జోక్యంతో అనుమతి పొంది 1949 జనవరి 13న మధ్యాహ్నం 12 గం.లకు వీరి కొనసాగింపు దీక్షను వార్ధాలో చేపట్టారు. ఇది 28 రోజులు సాగి విజయవంతంగా ప్రభుత్వం అనుకూలంగా స్పందించడంతో ముగిసింది. తత్ఫలితంగానే ప్రభుత్వ నిర్ణయం తీసుకున్నది. అయితే పొట్టి శ్రీరాములు ఉద్దేశించిన లక్ష్యాన్ని అప్పటి ప్రభుత్వం, తర్వాత ప్రభుత్వాలు పెడచెవిని పెట్టినా పొట్టి శ్రీరాములు త్యాగ బుద్ధినీ, గుండె ధైర్యాన్ని మెచ్చుకోకుండా ఉండలేం.

మెట్రిక్యులేషన్ తప్పిన శ్రీరాములు మదరాసు పట్టణంలో కళాశాలలో సీటు దొరకకపోవడం వల్ల 1920లో బొంబాయిలోని విక్టోరియా జూబిలీ టెక్నికల్ ఇన్‌స్టిట్యూట్‌లో సీటు సంపాయించి నాలుగేళ్ళ ఇంజనీరింగ్ కోర్సు పూర్తి చేసి అక్కడే నెలకు నూట నలభై ఐదు రూపాయల జీతం ఇచ్చే ఉద్యోగంలో చేరారు. వందేళ్ళ క్రితం విక్టోరియా జూబిలీ టెక్నికల్ ఇన్‌స్టిట్యూట్‌లో ఇంజనీరింగ్ కోర్సు చెయ్యడం, సెంట్రల్ పెనిన్సులర్ రైల్వేలో ఉద్యోగం గడించడం ఏ మాత్రమూ చిన్న విషయాలు కాదు. 1930లో గాంధీజీ ప్రభావంతో ఉద్యోగానికి రాజీనామా చేసి స్వాతంత్ర్య ఉద్యమంలో దూకారు. అప్పటికి అనారోగ్యంతో భార్య కనుమూసి రెండేళ్ళయ్యింది. అలా స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొని సబర్మతీ జైలులో ఖైదీగా ఉన్నప్పుడు బిహారు భూకంపం పెద్ద ఎత్తున నష్టం చెయ్యడంతో విడుదలయ్యారు. గాంధీజీ సలహామీద బాబూ రాజేంద్రప్రసాద్‌తో కలిసి సహాయక చర్యలను పెద్ద ఎత్తున చేపట్టారు. అనంతరం రాజ్‌కోట్ ఆశ్రమంలో కొంత కాలం, తారవాడ ఆశ్రమంలో కొంతకాలం ఉన్నారు.

గుడివాడలో ఎర్నేని సుబ్రహ్మణ్యం స్థాపించిన గాంధీ ఆశ్రమంలో కొంతకాలం ఉన్న తరువాత 1944 అక్టోబరు రెండవ తేదీ నుంచి పొట్టి శ్రీరాములు హరిజనుల అభ్యున్నతికి పూనుకుని ఎన్నో కార్యక్రమాలు చేపట్టారు. దానికి నెల్లూరు రంగస్థలం అయ్యింది. అమరజీవి పొట్టి శ్రీరాములు జీవితం గురించి తెలిసిన విషయాల కన్నా తెలియని సంగతులు ఎక్కువ ఉన్నాయి.

○ డా. నాగసూరి వేణుగోపాల్

(రేపు పొట్టి శ్రీరాములు జయంతి)





వన్‌టౌన్‌లో చిన్నారుల సందడి

హోలీ సంబరం

రంగుల పండుగ హోలీని జిల్లా వ్యాప్తంగా శుక్రవారం ఘనంగా జరుపుకొన్నారు. చిన్నారులు, యువతీ యువకులు ఒకరిపై మరొకరు రంగులు చల్లుకుంటూ డ్యాన్సులు చేశారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు సందడిగా గడిపారు. 4లో



దేదీప్యం..

నేడు వెంకటపాలెంలో శ్రీవారి కల్యాణం

రాజధాని గ్రామం వెంకటపాలెంలోని వేంకటేశ్వర స్వామి దేవాలయం కల్యాణోత్సవానికి సిద్ధమైంది. విద్యుత్ దీపాల వెలుగులో ఆలయం దేదీప్యమానంగా వెలిగిపోతోంది. శనివారం శ్రీనివాసుని కల్యాణానికి టీటీడీ అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. టీటీడీ ఆధ్వర్యంలో సాయంత్రం 6.30 గంటల నుంచి 8.30 గంటల వరకు స్వామి వారి కల్యాణోత్సవం జరగనుంది. 4లో

ఈస్ట్ బైపాస్‌ను బతికిద్దాం

మంజూరైన ప్రాజెక్టును కాలదన్నుకోవద్దంటున్న నగర వాసులు

ఓఆర్ఆర్‌కు దగరగా ఉండటం వల్లనే వీలుకానపుడు.. ఈస్ట్ బైపాస్ అలైన్‌మెంట్‌ను మార్చితే సరిపోతుందని సూచన

అమరావతి అవుటర్ రింగ్ రోడ్డు (ఓఆర్ఆర్)కు అతి సమీపంలో వెళుతుందన్న కారణంతో మంజూరైన విజయవాడ ఈస్ట్ బైపాస్ ప్రాజెక్టుకు సమాధి కట్టొద్దని నగర ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు. ఈస్ట్ బైపాస్ అలైన్‌మెంట్‌ను మార్చితే సరిపోతుందని సూచిస్తున్నారు. ఆప్షన్-1లో భాగంగా ఈస్ట్ బైపాస్‌ను తీసుకొచ్చి ఐఆర్ఆర్‌లో కలపొచ్చని, దీని వల్ల రాష్ట్ర ప్రభుత్వానికి ఖర్చు తగ్గుతుందని హితవు పలుకుతున్నారు. లేదంటే ఎనికేపాడు-తాడిగడప 100 అడుగుల రోడ్డునూ పరిశీలించవచ్చునని, నిడమానూరు-పోరంకి- పెదపులిపాక రోడ్డును విస్తరించవచ్చునని అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

- ఆప్షన్-1లో భాగంగా ఈస్ట్ బైపాస్‌ను తీసుకొచ్చి ఐఆర్ఆర్‌లో కలపొచ్చని సలహా
- దీని వల్ల రాష్ట్ర ప్రభుత్వానికి ఖర్చు తగ్గుతుందని హితవు
- లేదంటే ఎనికేపాడు-తాడిగడప 100 అడుగుల రోడ్డునూ పరిశీలించవచ్చు!
- నిడమానూరు-పోరంకి- పెదపులిపాక రోడ్డును విస్తరించవచ్చు!

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): అమరావతి అవుటర్ రింగ్ రోడ్డు (ఓఆర్ఆర్)కు అతి సమీపంలో వెళుతుందన్న ఒకే ఒక్క కారణంతో మంజూరైన విజయవాడ ఈస్ట్ బైపాస్ ప్రాజెక్టును వదులుకోవాల్సిన అవసరం లేదన్న అభిప్రాయం నగర ప్రజల నుంచి వ్యక్తమవుతోంది. ఈస్ట్ బైపాస్ కేంద్ర ప్రభుత్వం హామీ ఇచ్చిన ప్రాజెక్టు. ఇలాంటి ప్రాజెక్టును ఓఆర్ఆర్ పేరుతో వదులుకోవటం కంటే కూడా దీని అలైన్‌మెం ట్‌ను సవరించటం ద్వారా విజయవాడ నగరం, గ్రేటర్ విలీన ప్రతిపాదిత ప్రాంతాల అవసరాలకు అనుగుణంగా తీర్చిదిద్దాల్సిన అవసరం ఉంది. ఓఆర్ఆర్ అలైన్‌మెంట్ దగ్గరగా ఉండటమే విజయవాడ ఈస్ట్ బైపాస్‌కు సమస్య అయితే దీని అలైన్‌మెంట్‌ను మార్చటానికి తగిన ప్రత్యామ్నాయం ఉంది. దీనిపై అధికార పార్టీ ప్రజా ప్రతినిధులు, ప్రభుత్వం దృష్టి సారిస్తే విజయవాడ తూర్పు బైపాస్‌ను కూడా సాకారం చేసుకోవటానికి అవకాశం ఏర్పడుతుంది. ఓఆర్ఆర్‌కు భూసేకరణ, తదుపరి ప్రక్రియ పూర్తయ్యి పనులు మొదలు కావటానికి మరింత సమయం పడుతుంది. ఈ ప్రాజెక్టులో అతి పెద్ద టన్నెల్స్ వంటివి పూర్తి కావటానికి మరింత సమయం అవసరమవుతుంది. ఓఆర్ఆర్ పూర్తి అయ్యే నాటికి విజయవాడలో అంతర్గతంగా నెలకొనే ట్రాఫిక్ సమస్యలు ఎంత భయంకరంగా ఉంటాయో ఒక్కసారి ఊహిస్తేనే భయం వేస్తోంది. కాబట్టి ఈస్ట్ బైపాస్ అలైన్‌మెంట్‌ను ఓఆర్ఆర్‌కు దూరంగా విజయవాడ ప్రజలకు సౌకర్యంగా ఉండేలా మిగతా 4లో..



ఎనికేపాడు- తాడిగడప 100 అడుగుల రోడ్డు

ఈ రోడ్డును విజయవాడ తూర్పు బైపాస్‌లో అంతర్భాగంగా విస్తరించవచ్చు. ప్రస్తుతం ఎనికేపాడు దగ్గర ఎన్‌హెచ్ - 16కు అనుసంధానంగా విజయవాడ నగరం బయట నుంచి తాడిగడప వరకు ఎన్‌హెచ్ - 65కు అనుసంధానంగా ఉంది. ఈ రోడ్డు ప్రస్తుతం రెండు వరసలుగా ఉంది. దీనిని నాలుగు వరసలుగా విస్తరించవచ్చు. విస్తరించటానికి వీలుగా భూములు ఉన్నాయి. నిర్మాణాలు కూడా తక్కువ సంఖ్యలో ఎఫెక్ట్ అవుతాయి. ఎనికేపాడు - తాడిగడప చివర పాయింట్ దగ్గర ఫ్లై ఓవర్ నిర్మించటం ద్వారా నేరుగా పంట పొలాల మీదుగా చిన్న కాకాని సమీపంలోని కాజ దగ్గర వెస్ట్ బైపాస్ రోడ్డుకు అనుసంధానించవచ్చు. అలాగే ప్రారంభం భాగం దగ్గర బాటిల్ నెక్ ఉంది. ఇక్కడ ఉన్న చిన్న సమస్యను పరిష్కరించగలిగితే దీనికి అభిముఖంగా ఎన్‌హెచ్-16 నుంచి నేరుగా విజయవాడ వెస్ట్ బైపాస్ రోడ్డుకు అనుసంధానం అవుతుంది. ఎనికేపాడు - తాడిగడప రోడ్డును కనుక విజయవాడ ఈస్ట్ బైపాస్ అలైన్‌మెంట్ పరిధిలోకి తీసుకు రాగలిగితే.. విజయవాడ పశ్చిమ బైపాస్‌కు కూడా అనుసంధానం ఏర్పడుతుంది. ఇప్పటికే రెండు వరసలుగా ఉండటం వల్ల దీనిని నాలుగు వరసలుగా విస్తరించటానికి కేంద్ర ప్రభుత్వానికి వ్యయం కూడా తక్కువ అవుతుంది. భూసేకరణ భారం కూడా చాలా వరకు తగ్గుతుంది. కేంద్ర ప్రభుత్వం ఈస్ట్ బైపాస్‌ను ముందుకు తీసుకు వెళ్లటానికి ఇదో ప్రత్యామ్నాయంగా ఉంది.

పైపైకి..

భారీగా పెరిగిన బంగారం, వెండి ధరలు

- బంగారం 22 క్యారెట్లు రూ.8,580, 24 క్యారెట్లు రూ.9,050
- కిలో వెండి రూ.1,03,000



వన్‌టౌన్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): విజయవాడ బులియన్ మార్కెట్‌లో బంగారం, వెండి ధరలు పైపైకి ఎగబాకుతున్నాయి. 22 క్యారెట్ల బంగారం రూ.8,580 కాగా, 24 క్యారెట్లు రూ.9,050 చేరింది. కిలో వెండి రూ.1,03,000 ధర పలికింది. ఆయా ప్రాంతాలను బట్టి కూడా ధరల్లో కొద్ది మార్పు కనిపిస్తోంది. అంతర్జాతీయ మార్కెట్‌లో ఒక్కసారిగా బంగారం, వెండి ధరలు పెరిగాయి. గురువారం ఔన్స్ గోల్డ్ ధర 2,945 డాలర్లు ఉండగా, శుక్రవారం అమాంతంగా 43 డాలర్లు పెరిగి 2,988 డాలర్లకు చేరుకుంది. ప్రస్తుతం ఔన్స్ సిల్వర్ ధర 33.80 డాలర్లుగా ఉంది. అయితే ఈ ధరల్లో శనివారం నాటికి మరికొంత మార్పు ఉంటుందని చెబుతున్నారు. ఇటీవల కాలంలో బంగారం, వెండి జోలికి వెళ్లేందుకు సామాన్య, మధ్యతరగతి ప్రజలు భయపడుతున్నారు. వివాహ సమయంలో ఆడపిల్లలకు తమ శక్తి కొలది బంగారు నగలు చేయించి కానుకగా ఇవ్వటం జరుగుతుంది. ధరలు అమాంతం పెరిగిపోవటంతో వాయిదా వేసుకుంటున్న పరిస్థితి అక్కడక్కడ కనిపిస్తోంది. ఇటీవల కాలంలో బంగారం, వెండి ధరలు ప్రతి రోజూ అంతో ఇంతో పెరుగుతూనే ఉన్నాయి. ఒకవేళ తగ్గింది అనుకున్నా కూడా నామమాత్రమే. అంతర్జాతీయ మార్కెట్‌ను అనుసరించి ఈ బంగారం, వెండి ధరలు ఎప్పటికప్పుడు మారుతున్నాయి. ఏదైనా వెండి ధరలు మరింతగా పెరగటం ఆశ్చర్యం కలిగిస్తోంది. ఇటీవల కాలంలో వెండి ధర దాదాపుగా లక్ష రూపాయలకు అటు, ఇటుగా నడుస్తూనే ఉంది. వెండి కంచాలు, వెండి పాత్రలు, ముఖ్యంగా పూజా సామగ్రి వంటి వాటిని ఆడపిల్లలకు కొని ఇవ్వాలంటే భారమైన పరిస్థితి నెలకొంది. బంగారం, వెండి ధరలు ఏరోజు ఎంత పెరిగాయి, ఎంత తగ్గాయి అనే దానిపై గృహిణులు ఆసక్తిగా గమనిస్తున్నారు.

జీలగలగండిలో లారీని ఢీకొన్న బొలెరో వాహనం



ఎ.సీతారాంపురంలో లారీని ఢీకొన్న కారు



ముగ్గురి ఉసురు తీసిన అతివేగం

లారీని బొలెరో వాహనం ఢీకొని ఇద్దరు మృతి

మరో ఘటనలో లారీని కారు ఢీకొని ఒకరు దుర్మరణం

జాతీయ రహదారుల్లో రెండు చోట్ల రోడ్డు ప్రమాదాలు

రెండు ప్రమాదాల్లో ఐదుగురికి గాయాలు

- కృష్ణాజిల్లా జీలగలగండి, ఎ.సీతారాంపురంలో ఘటనలు
- మృతులది పశ్చిమ గోదావరి జిల్లా, ఎన్టీఆర్ జిల్లా

ఘంటసాల/హనుమాన్‌జంక్షన్‌రూరల్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారులపై వేర్వేరు చోట్ల జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు ప్రాణాలు కోల్పోగా, ఐదుగురు గాయపడ్డారు. రెండు చోట్ల అతివేగమే ప్రమాదానికి కారణంగా తెలుస్తోంది.

రొయ్య పిల్లలను లోడ్ చేసుకుని వెళ్తుండగా..

కృష్ణాజిల్లా ఘంటసాల మండలం జీలగలగండి గ్రామం వద్ద 216 జాతీయ రహదారిపై శుక్రవారం తెల్లవారుజామున ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో బొలెరోలోని ఇద్దరు వ్యక్తులు మృతి చెందగా, లారీ డ్రైవర్, క్లీనర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. ఘంటసాల పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... పశ్చిమ గోదావరి జిల్లా కాళ్ల మండలం పాతర్లమరక గ్రామానికి చెందిన కోటి వరప్రసాద్ (58), కాళ్ల మండలం జువ్వలపాలెం గ్రామానికి చెందిన చీపురుపల్లి శివకృష్ణ (29) బొలెరో వాహనంలో ఒంగోలులో రొయ్య పిల్లలను లోడ్ చేసుకుని కాళ్ల బయలుదేరారు. అస్సాం నుంచి చీరాలకు సరుగుడు బాదుల లోడ్‌తో వెళ్తున్న లారీని ఘంటసాల మండలం యందకుదురు శివారు జీలగలగండి గ్రామం వద్ద జాతీయ రహదారిపై శుక్రవారం తెల్లవారుజామున 3.20 గంటలకు బొలెరో వాహనం బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బొలెరో వాహనంలో ఉన్న వరప్రసాద్, శివకృష్ణ అక్కడికక్కడే మృతి చెందారు. నిద్రమత్తు కారణంగానే ఈ ప్రమాదం జరిగి ఉంటుందని స్థానికులు భావిస్తున్నారు. విషయం తెలుసుకున్న మిగతా 4లో..

దైవదర్శనానికి వెళ్లి వస్తుండగా..

దైవ దర్శనానికి వెళ్లి వస్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలు మృతి చెందగా, మరో ముగ్గురు గాయపడిన ఘటన జాతీయ రహదారిపై బాపులపాడు మండలం ఎ.సీతారాంపురంలో శుక్రవారం జరిగింది. వీరవల్లి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... విజయవాడ లోని అశోక్‌నగర్‌కు చెందిన పెద్ది వేణుమాధవ్ భార్య తేజస్విని, తల్లి పద్మావతి(72)తో కలిసి కొవ్వూరులోని శ్రీరాజేశ్వరి అమ్మవారిని దర్శించుకుని తిరుగు ప్రయాణమయ్యారు. జాతీయ రహదారిపై ఎ.సీతారాంపురం వద్ద కారు డ్రైవర్ కళ్లపై సూర్యకిరణాలు పడటంతో కారు అదుపు తప్పి ముందు వెళ్తున్న లారీని వేగంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో కారు ముందు సీట్లో కూర్చున్న పద్మావతి అక్కడికక్కడే మృతి చెందగా, కారు డ్రైవర్ రవి, వెనుక సీట్లో కూర్చున్న వేణుమాధవ్, తేజస్విని గాయపడ్డారు. వెంటనే వీరిని అంబులెన్సులో విజయవాడలోని ఆస్పత్రికి తరలించారు. సమాచారం అందుకున్న వీరవల్లి ఎస్ఐ శ్రీనివాస్ ఘటనాస్థలానికి చేరుకుని పద్మావతి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గన్నవరం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అమరావతి రాజమార్గాలకు డీపీఆర్‌లు సిద్ధం

ఈ-13, 15 రోడ్లకు రూ.1,142.05 కోట్లతో టెండర్లు

ఎన్‌హెచ్-16కు అనుసంధానం చేస్తూ ఏర్పాట్లు

- అటవీ భూమి ల్యాండ్ కన్వర్షన్ కోసం కేంద్రానికి ప్రతిపాదనలు
- 6 వరసల డివైడెడ్ ఆర్‌వోబీ కోసం రైల్వేమంత్రికి సీఎం వినతి

విజయవాడ, మార్చి 14(ఆంధ్రజ్యోతి): అమరావతి రాజమార్గాలకు డీపీఆర్‌లు సిద్ధమయ్యాయి. టెండర్లు పిలవడానికి సీఆర్‌డీఏ అధికారులు రంగం సిద్ధం చేశారు. 16వ నంబరు జాతీయ రహదారి నుంచి అమరావతికి అనుసంధానంగా ప్రధాన మార్గాలైన ఈ-13, ఈ-15 రోడ్లను అభివృద్ధి చేయాలని నిర్ణయించారు. ఈ రెండు ప్రధాన రహదారుల అభివృద్ధికి కన్సల్టెన్సీ సంస్థ లాసా రూ.1,142.05 కోట్లతో రూపొందించిన డీపీఆర్‌లకు రాష్ట్ర ప్రభుత్వం ఆమోదముద్ర వేసింది. ముఖ్యమంత్రి చంద్రబాబు గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడంతో సీఆర్‌డీఏ అధికారులు టెండర్లు పిలవటానికి సన్నాహాలు చేస్తున్నారు. రాజధాని పునర్నిర్మాణ పనులతో పాటే ఈ రాచమార్గాల పనులను కూడా ఒకేసారి ప్రారంభించేందుకు వీలుగా టెండర్లను పూర్తిచేసి ఎల్‌వోఏలు ఇవ్వాలని సీఆర్‌డీఏ భావిస్తోంది. రాజధానికి ప్రధానమైన సీడ్‌యాక్సెస్ రోడ్డును ఎన్‌హెచ్-16కు అనుసంధానం చేయాలని ప్రభుత్వం మొదట నిర్ణయించింది. దీనితోపాటు ఈ-11, ఈ-13, ఈ-15 రోడ్లను కూడా ఎన్‌హెచ్-16కు అనుసంధానించాలని భావించింది. డీపీఆర్‌లు రూపొందించాల్సిందిగా లాసా కన్సల్టెన్సీకి బాధ్యతలు అప్పగించింది. ఈ మూడింటికి మిగతా 4లో..



రోడ్లకు సంబంధించిన ప్రతిపాదిత మ్యాప్

అమరావతి ప్రధాన రహదారుల పనులకు టెండర్ల ఖరారు 6లో

నేటి నుంచి ఒంటి పూట బడులు

- ఉదయం 7.45 నుంచి మధ్యాహ్నం 12.30 వరకు

విజయవాడ, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు శనివారం నుంచి ఒంటిపూట బడులు నిర్వహించనున్నారు. మండుతున్న ఎండలను దృష్టిలో పెట్టుకుని ఉదయం 7.45 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పనిచేస్తాయి. పదవ తరగతి పరీక్షా కేంద్రాలు ఉండే పాఠశాలలు మధ్యాహ్నం 1.15 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు పనిచేయనున్నాయి.

భక్తి పరవశంతో.. దుర్గమ్మ గిరి ప్రదక్షిణ



4లో

ప్రభుత్వ బడిని బతికించుకుందాం 6లో

- యూటీఎఫ్ రౌండ్ టేబుల్ సమావేశంలో ఉపాధ్యాయులకు వక్తల పిలుపు



తిరుపతమ్మ,గోపయ్య

బోనాల పండుగ

తిరుపతమ్మ చిన్న తిరునాళ్లు ప్రారంభం

పెనుగంచిప్రోలులోని శ్రీతిరుపతమ్మ చిన్న తిరునాళ్లు శుక్రవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. భక్తులు.. మంగళవాయిద్యాలు, మేళతాళాల నడుమ ఊరేగింపుగా వచ్చి అమ్మవారికి బోనాలు సమర్పించారు. 4లో



బోనాలతో తరలివచ్చిన భక్తులు

రంజాన్ వేళలు



ఇఫ్తార్ (సాయంత్రం): 06-17(శని)
సహర్ (ఉదయం) : 04-04 (ఆది)

భక్తి పరవశంతో.. దుర్గమ్మ గిరి ప్రదక్షిణ



గంగా, పార్వతీ మల్లేశ్వరుల ఉత్సవమూర్తుల గిరిప్రదక్షిణ




ఇంద్రకీలాద్రి, మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : ఇంద్రకీలాద్రి దుర్గామల్లేశ్వర దేవస్థానం ఆధ్వర్యంలో శుక్రవారం ఫాల్గుణ పౌర్ణమి నాడు గంగా, పార్వతీ మల్లేశ్వరుల ఉత్సవమూర్తుల గిరిప్రదక్షిణ భక్తితో సాగింది. ఉదయం ఉత్సవమూర్తులకు మేళతాళాలతో ఘాట్‌రోడ్డు టోల్‌గేట్ వద్ద అన్నపు రాశిని పోసి బలిహరణలు సమర్పించారు. స్థానాచార్యుడు శివప్రసాద్ శర్మ, గుమ్మడికాయ దిష్టితీయగా.. డిప్యూటీ ఈవో రత్నరాజు, ముఖ్యఅర్చకుడు శ్రీనివాసశాస్త్రి, స్థానాచార్యుడు శివ ప్రసాద్ శర్మ, ఆలయ ఉద్యోగులు, భక్తులు జై భవానీ, జైజై భవానీ అంటూ గిరిప్రదక్షిణ కోలాహలంగా ప్రారంభమైంది. మేళతాళాలు, తప్పెట వాయిద్యాలు, భజనల మధ్య అమ్మవారి గిరిప్రదక్షణ బయలుదేరింది. కుమ్మరిపాలెం సెంటర్, నాలుగు స్తంభాల సెంటర్, సొరంగం, కబేలా సెంటర్, సీవీఆర్ బ్రిడ్జి, పాలఫ్యాక్టరీ, చిట్టినగర్, కొత్తపేట, బ్రాహ్మణ వీధి, రథం సెంటర్‌ల మీదుగా బయలుదేరి తిరిగి ఘాట్ రోడ్డు మీదుగా ఉత్సవమూర్తులు కొండపైకి చేరుకున్నారు. వందలాది భక్తులు పాల్గొన్నారు.

● కనకదుర్గమ్మ గిరిప్రదక్షణ సమయంలో గరికపర్రు నుంచి వచ్చే డప్పు వాయిద్యాలు శుక్రవారం కనిపించలేదు. కాగా, మూడునెలల నుంచి వారికి పారితోషకం ఇవ్వటం లేదని చెబుతున్నారు. డప్పుల వాయిద్యాలు ఉంటేనే గిరిప్రదక్షిణకు నిండుదనం ఉంటుంది. డప్పులు వాయించటంతో పాటు నృత్యం చేస్తూ ఒకరిపై ఒకరు నిలుచుని విన్యాసాలు చేస్తారు. ఇవన్నీ భక్తులను ఆకట్టుకునే అంశాలు. సన్నాయి మేళాలు కొంత వరకు మాత్రమే వచ్చి వెనుదిరుగుతున్నవైనం. ఈ లోటును దేవస్థానం పరిశీలించి సరిదిద్దాలని భక్తులు కోరుతున్నారు.

ఇంద్రకీలాద్రిపై భక్తుల రద్దీ..

ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ దర్శనానికి శుక్రవారం పెద్ద సంఖ్యలో భక్తులు తరలి వచ్చారు. అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. తలనీలాలు సమర్పించి, కృష్ణానదిలో పవిత్ర స్నానాలు చేసి అమ్మవారి దర్శనానికి కొండపైకి చేరుకున్నారు. అమ్మవారిని దర్శించుకున్నారు. పౌర్ణమి సందర్భంగా కనకదుర్గమ్మ స్వర్ణకవచంతో భక్తులకు దర్శనమిచ్చారు. పలువురు భక్తులు పొంగళ్లు సమర్పించారు. భక్తుల రద్దీ పురస్కరించుకుని తాగునీరు, ఉచిత ప్రసాదం, అన్నప్రసాదం సత్వరం అందేలా దేవస్థానం అధికారులు చర్యలు తీసుకున్నారు.



వైభవంగా తిరుపతమ్మ చిన్న తిరునాళ్లు ప్రారంభం

పెనుగంచిప్రోలు, మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : తిరుపతమ్మ చిన్న తిరునాళ్ల మహోత్సవాలు మాఘ శుద్ధపౌర్ణమి శుక్రవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ముందుగా అమ్మవారికి ఆలయ డిప్యూటీ కమిషనర్ బి.హెచ్.వి.ఎస్ కిషోర్ కుమార్, ధర్మకర్తల మండలి చైర్మన్ జంగాల శ్రీనివాసరావు, ధర్మకర్తలు ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారికి అఖండ దీపాన్ని వెలిగించి ఉత్సవాలను లాంఛనంగా ప్రారంభించారు. తొలి బోనాలు ఆలయ స్థల దాత చింతయ్య వంశీకులు గ్రామానికి చెందిన మాదిగ కులస్థులు సమర్పించారు. తూర్పు బజారు మాదిగ పల్లి నుంచి సుమారు 1000 మంది మహిళలు, వృద్ధులు, యువకులు బోనాలను నెత్తిన పెట్టుకొని మేళతాళాలు మంగళ వాయిద్యాలు, కనకతప్పెట్లతో గ్రామంలో భారీ ఊరేగింపు నిర్వహించి అత్యంత భక్తిశ్రద్ధలతో బోనాలను చెల్లించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి సభ్యుడు బెజవాడ శ్రీనివాసరావుతో పాటు మాదిగ కుల ప్రముఖులు, పెద్ద సంఖ్యలో సంఘీయులు పాల్గొన్నారు. భక్తులు మునేటిలో పుణ్యస్నానాలు ఆచరించి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. తహసీల్దార్ శాంతిలక్ష్మి, ఈఈ ఎల్.రమ, పంచాయతీ సర్పంచ్ వేల్పుల పద్మకుమారి, పంచాయతీ కార్యదర్శి జి.శ్యామ్‌కుమార్‌లు పారిశుధ్య ఏర్పాట్లను పర్యవేక్షించారు. విజయవాడ సీనియర్ సివిల్ జడ్జి రమణారెడ్డి కుటుంబసభ్యులతో అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించారు. వారికి ఆలయ అర్చకులు వేద పండితులు ఆశీర్వచనం చేసి శేషవస్త్రాలు, ప్రసాదాలను అందజేశారు. మేడ్చెల్ జిల్లా ఘట్‌కేసరి మండలం ఆయిషాపూర్ గ్రామానికి చెందిన సంకూరి హనుమంతరావు - లలిత దంపతులు అమ్మవారికి రూ.50 వేలు, మణుగూరుకు చెందిన గురిజాల గోపి రూ.50 వేలు విలువగల వస్త్రాలను ఆలయ మాజీ చైర్మన్ నూతలపాటి చెన్నకేశవరావు చేతుల మీదుగా అందజేశారు. నందిగామ డివిజన్ గ్రామీణ వైద్యుల సంక్షేమశాఖ ఉచితంగా మందులను అందజేయగా.. శాంతిభద్రతలకు విఘాతం లేకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.



తిరుపతమ్మ సేవలో విజయవాడ సీనియర్ సివిల్ జడ్జి రమణారెడ్డి దంపతులు



తిరుపతమ్మ అమ్మవారికి బోనాలు చెల్లిస్తున్న పెనుగంచిప్రోలు మాదిగ సంఘీయులు

ఏపీలో అభివృద్ధి సంస్కరణలు భేష్

» ఆర్యవైశ్య కార్పొరేషన్‌ను సందర్శించిన తెలంగాణ కార్పొరేషన్ చైర్‌పర్సన్ కాల్వ సుజాత



ఏపీలో ఆర్యవైశ్యులకు అందిస్తున్న సేవలను కాల్వ సుజాతకు వివరిస్తున్న డూండీ రాకేష్

వన్‌టౌన్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వ ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య అభివృద్ధి కార్పొరేషన్ కార్యకలాపాలు, సేవలు ఎంతో బాగున్నాయని, ఇదే తరహాలో తెలంగాణలోనూ అమలు చేయటానికి త్వరలోనే తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కలను కలిసి వివరిస్తానని తెలంగాణ ఆర్యవైశ్య అభివృద్ధి కార్పొరేషన్ చైర్‌పర్సన్ కాల్వ సుజాత అన్నారు. శుక్రవారం ఆమె పశ్చిమ నియోజకవర్గంలో ఉన్న ఆర్యవైశ్య డెవలప్‌మెంట్ కార్పొరేషన్ కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా చైర్మన్ డూండీ రాకేష్, తదితర వైశ్య ప్రముఖులు ఆమెకు సాదర స్వాగతం పలికారు. అనంతరం ఆమె మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వ హయాంలో పేద, మధ్యతరగతి ఆర్యవైశ్యులు, చిరువ్యాపారులకు అందుతున్న సేవలను అభినందించారు. వీటిపై అధ్యయనం చేసి తమ రాష్ట్రంలోనూ అమలు చేసేందుకు సీఎం రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కలను కలిసి మాట్లాడి కృషి చేస్తామని తెలిపారు. గడ్డం సత్యనారాయణ, వీవీకే నరసింహారావు, కె.ఎల్.వి .సతీష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



పికిల్ బాల్ కోర్టు ప్రారంభిస్తున్న ఎంపీ శివనాథ్, ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

నగరంలో పికిల్ బాల్ కోర్టులు ప్రారంభం

విజయవాడ(స్పోర్ట్స్), మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : అమరావతిలో రాబోయే రోజుల్లో 220 ఎకరాల్లో స్పోర్ట్స్ సిటీ, స్పోర్ట్స్ యూనివర్సిటీ రానున్నాయని ఎంపీ కేశినేని శివనాథ్ అన్నారు. సిద్ధార్థ నగర్‌లో 'ది పికిల్ బాల్ రిపబ్లిక్' పేరుతో ఏర్పాటు చేసిన కోర్టులను ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్‌తో కలిసి ఎంపీ కేశినేని శివనాథ్ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అమరావతి స్పోర్ట్స్ సిటీలోనే అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం కూడా నిర్మాణం జరుగుతుందని, స్పోర్ట్స్ యూనివర్సిటీకి ప్రభుత్వం 142ఎకరాలు కేటాయించిందని తెలిపారు. ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ మాట్లాడుతూ, ఇటువంటి అకాడమీలతో ఎంతో మంది యువక్రీడాకారులు ఎదుగుతారని, పికిల్‌బాల్‌పై యువత ఆసక్తి చూపుస్తున్నారన్నారు. అనంతరం ఎంపీ, ఎమ్మెల్యేలు కొద్దిసేపు పికిల్ బాల్ ఆడి క్రీడాకారులను ఉత్సాహపరిచారు. కార్యక్రమంలో నిర్వాహకులు వడ్లమూడి స్రవంతి, ప్రియ, ప్రశాంతి తదితరులు పాల్గొన్నారు.




రాజధానిలో శ్రీనివాసుడి కల్యాణానికి ఏర్పాట్లు పూర్తి

గుంటూరు, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతిలోని వెంకటపాలెంలో శ్రీనివాసుడి కళ్యాణోత్సవం నిర్వహించడానికి టీటీడీ, జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేసింది. శనివారం సాయంత్రం 6.30 గంటల నుంచి 8.30 గంటల వరకు స్వామి వారి కల్యాణం జరుగుతుంది. ఆలయ ఆవరణలో భక్తులు కూర్చునేందుకు గ్యాలరీలు సిద్ధం చేశారు. సీఆర్డీఏ పరిధిలోని 24 గ్రామాల ప్రజలు వెంకటపాలెం చేరేందుకు వీలుగా టీటీడీ దాదాపు 300 బస్సులు ఏర్పాటు చేసింది. విజయవాడ నుంచి వచ్చే వారి కోసం మందడంలో ప్రతి 5 నిమిషాలకు బస్సు ఏర్పాటు చేశారు. శనివారం సాయంత్రం 4 గంటలనుంచి అన్నమాచార్య సంకీర్తనలు, ఇతర సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి, స్వామివారి కళ్యాణాన్ని ప్రారంభిస్తారు.

చేపల చెరువులో విషప్రయోగం

బంటుమిల్లి : పెద తుమ్మిడి గ్రామానికి చెందిన చిట్టిబొమ్మ నాగ మునీంద్రరావు చేపల చెరువులో విషప్రయోగం జరిగి చేపలు మృత్యువాత పడ్డాయి. నాగమునీంద్రరావు జయపురం కాంప్లెక్స్ రోడ్‌లో 2.20 ఎకరాల విస్తీర్ణం చెరువులో చేపలు, రొయ్యలు సాగు చేస్తున్నారు. చేపలు, రొయ్యలు పట్టుబడికి రావడంతో అమ్మకానికి ఏర్పాట్లు చేసుకుంటున్న ఆన గురువారం రాత్రి చెరువువద్దకు వెళ్లి చూడగా చేపలు తేలియాడుతూ కన్పించాయి. గుర్తుతెలియని వ్యక్తులు చెరువులో విషప్రయోగం చేశారని పేర్కొంటూ బంటుమిల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు.



చనిపోయి చెరువులో తేలియాడుతున్న చేపలు



గవర్నర్ నజీర్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న రాంజీ

గవర్నర్‌ను కలిసిన కేయూ ఉపకులపతి

మచిలీపట్నం టౌన్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర గవర్నర్, కృష్ణా విశ్వవిద్యాలయం చాన్సలర్ అబ్దుల్ నజీర్‌ను శుక్రవారం కృష్ణా విశ్వవిద్యాలయం ఉపకులపతి రాంజీ మర్యాద పూర్వకంగా శుక్రవారం గవర్నర్ చాంబర్‌లో కలిశారు. పలు అంశాలపై చర్చించారు. ప్రభుత్వం నుంచి అందాల్సిన అనుమతులను గవర్నర్ ముందు ఉంచారు.

కానూరులో లగ్జరీ లైఫ్ ముహూర్తపు షాట్



ముహూర్తపు షాట్ చిత్రీకరిస్తున్న చిత్ర బృందం

బెంజిసర్కిల్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : ఎస్ఎంఆర్ క్రియేషన్స్ బ్యానర్‌పై తెరకెక్కుతున్న లగ్జరీ లైఫ్ చిత్రంపై పెనమలూరు మండలం కానూరులోని అభయాంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు అనంతరం శుక్రవారం ముహూర్తపు షాట్‌ను చిత్రీకరించారు. ఇది ఎంతో సందేశాత్మక చిత్రమని, కళాశాల విద్యార్థులు లగ్జరీ లైఫ్‌కు అలవాటుపడి ఎలా చెడిపోతున్నారు.. వీరివల్ల తల్లిదండ్రులు ఎలా బాధపడుతున్నారు అనే ఇది వృత్తంతో సినిమా తెరకెక్కనుందని డైరెక్టర్ మల్లేష్‌నాయుడు చెప్పారు. ప్రేమలో పడిన యువతీ యువకులు వ్యామోహపు మోజులో పడి మానవీయ విలువలను మరిచిపోతున్న పరిస్థితులను, వాస్తవ జీవితాలకు అద్దం పట్టే విధంగా ఈచిత్రాన్ని రూపొందిస్తున్నామని ఆయన పేర్కొన్నారు. ప్రస్తుత సమాజంలో యువశక్తి దేశానికి ఎంత అవసరం, మానవీయ విలువలను కాపాడటంలో వాటి పాత్రను తెలియజేసేలా సినిమా తీసున్నట్లు చెప్పారు. వివిధ ప్రాంతాల్లో ఈచిత్రం రూపొందించి మే 25నాటికి అన్ని షెడ్యూళ్లను పూర్తిచేయాలనే లక్ష్యంతో చిత్ర యూనిట్ పనిచేస్తుందని ఆయన వివరించారు.

ముగ్గురి ఉసురు తీసిన అతివేగం



కారులో ఇరుక్కుపోయిన పద్మావతి



ఘటనాస్థలంలో కోటే వరప్రసాద్

(3వ పేజీ తరువాయి) చల్లపల్లి సీఐ ఈశ్వరరావు, ఘంటసాల ఎస్ఐ ప్రతాప్ రెడ్డి సంఘటనా ప్రాంతాన్ని పరిశీలించి సహాయక చర్యలు చేపట్టారు. లారీ ముందు భాగంలో ఇరుక్కుపోయి బొలెరో వాహనాన్ని జేసీబీ సహాయంతో బయటకు లాగారు. వాహనంలో ఇరుక్కుని ఉన్న మృతదేహాలను పోలీసులు అతి కష్టం మీద బయటకు తీసి అవనిగడ్డ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ప్రతాప్ రెడ్డి తెలిపారు. కాగా, జనసేన ఆవిర్భావ సభకు పిఠాపురం వెళ్తున్న ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ తనయుడు మండలి వెంకట్రామ్ రోడ్డు ప్రమాదం విషయం తెలుసుకుని సంఘటనా ప్రాంతాన్ని పరిశీలించి ప్రమాదానికి గల వివరాలను అడిగి తెలుసుకున్నారు.

అమరావతి రాజమార్గాలకు డీపీఆర్‌లు సిద్ధం

(3వ పేజీ తరువాయి)

సంబంధించి డీపీఆర్‌లు పూర్తయ్యాయి. ఈ-11 రోడ్డుకు సంబంధించి భూ ఇబ్బందులు ఉన్న నేపథ్యంలో ఈ-13, ఈ-15 రోడ్లను జాతీయ రహదారికి అనుసంధానించాలని నిర్ణయించారు. ఈ రాజమార్గాలను అభివృద్ధి చేయటానికి భూ సమీకరణ, భూ సేకరణ, ఆర్అండ్ఆర్, ట్రాన్స్‌ఫర్ ఆఫ్ డెవలప్‌మెంట్ రైట్స్ (టీడీఆర్) విధానాల్లో భూములు సేకరించవచ్చని లాసా సూచించింది.

ఈ-13కు రూ.834.46 కోట్లు

అమరావతి ప్రధాన రాజమార్గం ఈ-13కు సంబంధించి రూ.834.46 కోట్లతో డీపీఆర్ పూర్తయింది. ఈ ప్రాజెక్టులో భాగంగా ప్రభుత్వ, అటవీ భూములతో కలిపి 38.42 ఎకరాలు, ప్రైవేట్ ఓపెన్ భూములు 9.97 ఎకరాలు, నిర్మాణాలతో కూడిన ప్రైవేట్ భూమి 5.58 ఎకరాలు, పక్కా నిర్మాణాలు-8, సెమీ పక్కా ఇళ్లు 31, కచ్చా ఇళ్లు 3 ఉన్నాయి. ఈ రాజమార్గం కొనసాగింపులో భాగంగా రైల్వే లైన్ క్రాస్ చేయాల్సి ఉండటంతో పీఎం గతిశక్తి ప్రాజెక్టు కింద ఆరు వరసల డివైడెడ్ ఆర్‌వోబీ నిర్మించాలని రైల్వేశాఖ మంత్రికి సీఎం చంద్రబాబు ఇటీవల లేఖ రాశారు.

ఈ-13 రోడ్డును ఎన్‌హెచ్-16కు కలవటానికి 7.29 కిలోమీటర్ల మేర అభివృద్ధి చేయాల్సి ఉంటుంది. ఇందులోనే ఆర్‌వోబీ కూడా ఉంటుంది. దీని అలైన్‌మెంట్ మంగళగిరి రిజర్వు ఫారెస్ట్ పరిధిలో 1.6 కిలోమీటర్ల మేర సాగుతుంది. గుంటూరు డివిజన్ పరిధిలో తాడేపల్లి రిజర్వు ఫారెస్ట్ కంపార్ట్‌మెంట్ 132లో 23.7 ఎకరాల అటవీ భూముల ల్యాండ్ కన్వర్షన్ కోసం చెన్నైలోని ఆర్వో కార్యాలయానికి ప్రతిపాదించారు.

రూ.307.59 కోట్లతో ఈ-15

అమరావతి రెండో ప్రధాన రాజమార్గంగా ఈ-15ను 16వ నంబరు జాతీయ రహదారికి అనుసంధానం చేయడానికి వీలుగా రూ.307.59 కోట్లతో లాసా డీపీఆర్‌ను తయారు చేసింది. దీనిప్రకారం ప్రభుత్వ భూమి 24.98 ఎకరాలు, ప్రైవేట్ ఓపెన్ భూమి 3.52 ఎకరాలు, నిర్మాణాలతో కూడిన ప్రైవేట్ ఓపెన్ భూమి 7.18 ఎకరాలు, పక్కా నిర్మాణాలు 21, సెమీ పక్కా నిర్మాణాలు 76, కచ్చా నిర్మాణాలు 6 ఉన్నాయి. ఈ అలైన్‌మెంట్ పరిధిలోనూ రైల్వేలైన్ ఉన్నందున పీఎం గతిశక్తి కింద 6 వరసల డివైడెడ్ ఆర్‌వోబీని, ఫుట్‌పాత్‌లతో కలిపి నిర్మించాలని రైల్వే మంత్రికి చంద్రబాబు విజ్ఞప్తి చేశారు.

ఈస్ట్ బైపాస్‌ను బతికిద్దాం

(3వ పేజీ తరువాయి)

చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ఈస్ట్ బైపాస్ 3 ఆప్షన్లలో మిగిలిన వాటి సంగతేమిటి?

ఈస్ట్ బైపాస్ అలైన్‌మెంట్‌కు ఇచ్చిన డీపీఆర్‌లో మూడు ఆప్షన్స్ ఇచ్చారు. మూడు ఆప్షన్స్‌లో రెండో ఆప్షన్‌ను ఎంపిక చేశారు. మొదటి ఆప్షన్‌ను వదిలేశారు. మొదటి ఆప్షన్‌లో ఎక్కువ నిర్మాణాలు ఉన్నాయన్నది జాతీయ రహదారుల సంస్థ (ఎన్‌హెచ్) అధికారుల వాదనగా ఉంది. రెండో ఆప్షన్‌లో మాత్రం వ్యవసాయ భూములు ఎక్కువగా ఉండటం వల్ల భూ సేకరణ వ్యవహారాలు తేలిగ్గా ఉంటాయని ఎన్‌హెచ్ చెబుతోంది. మొదటి ఆప్షన్ కంటే రెండో ఆప్షన్‌లోనే ఎక్కువ భూసేకరణ వ్యయం అవుతుంది. అయినప్పటికీ ఎన్‌హెచ్ అధికారులు ఆప్షన్ - 2ను ఎంపిక చేశారు. మిగిలిన ఆప్షన్లను గమనిస్తే ఆప్షన్ - 3 అనేది పూర్తిగా అవుటర్ రింగ్ రోడ్డుకు సమాంతరంగా అలైన్‌మెంట్ సాగుతుంది కాబట్టి దీనిని వదిలివేయవచ్చు. ఆప్షన్- 1లో పరిశీలించదగిన ప్రత్యామ్నాయంతో పాటు మరో సమస్య కూడా ఉంది. ఆప్షన్ - 1 అమరావతి ఇన్నర్ రింగ్ రోడ్డు (ఐఆర్ఆర్)కు సమాంతరంగా ఉంది. అందువల్ల ఆప్షన్ - 1ను పరిశీలించాల్సిన అవసరం లేదన్న వాదనలు కూడా వస్తున్నాయి.

- ఇన్నర్ రింగ్ రోడ్డులో.. ఈస్ట్ బైపాస్ ఆప్షన్ -1ను అంతర్భాగం చేయవచ్చు

అమరావతి ఇన్నర్ రింగ్ రోడ్డు (ఐఆర్ఆర్)ను రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టాలనుకుంటున్న ప్రాజెక్టు. పూర్తిగా రాష్ట్ర ప్రభుత్వం తన సొంత ఖర్చుతో దీనిని నిర్మించాల్సి ఉంటుంది. అమరావతి ఐఆర్ఆర్.. ఈస్ట్ బైపాస్ ఆప్షన్ - 1 కు సమాంతరంగా ఉంటుంది కాబట్టి విజయవాడ ఈస్ట్ బైపాస్‌ను అమరావతి ఇన్నర్ రింగ్ రోడ్డులో భాగంగా సగం భాగానికి ఉపయోగించుకోవచ్చు. దీని వల్ల రాష్ట్ర ప్రభుత్వానికి అమరావతి ఐఆర్ఆర్‌లో సగం ఖర్చు తగ్గుతుంది. మిగిలిన సగం పనులకు సంబంధించి మాత్రమే రాష్ట్ర ప్రభుత్వం భరిస్తే సరిపోతుంది. ఈ దిశగా రాష్ట్ర ప్రభుత్వం ఆలోచిస్తే ఈస్ట్ బైపాస్ కారణంగా చాలా వరకు ఐఆర్ఆర్‌పై భారం తగ్గుతుంది. దీనికి అనుగుణంగా మిగిలిన సగభాగాన్ని రాష్ట్ర ప్రభుత్వం నిర్మించుకోవచ్చు.

- ఇవిగో ప్రత్యామ్నాయాలు.. పరిశీలించండి

మంజూరైన తూర్పు బైపాస్ రోడ్డు ప్రాజెక్టును కాలదన్నుకోకుండా ఉండాలంటే అనేక ప్రత్యామ్నాయాలు అందుబాటులో ఉన్నాయి. విజయవాడ ఈస్ట్ బైపాస్‌కు కేంద్ర ప్రభుత్వం మీద కూడా భారం తగ్గించుకునే ప్రత్యామ్నాయాలు ఉన్నాయి. అవేంటో చూద్దాం..

నిడమానూరు - పోరంకి - పెదపులిపాక రోడ్డు

ఈ రోడ్డు కూడా విజయవాడ ఈస్ట్ బైపాస్‌గా అతి తక్కువ ఖర్చుతో కేంద్ర ప్రభుత్వం చేపట్టడానికి అవకాశం ఉంది. నిడమానూరు గ్రామం నుంచి నేరుగా ఈ రోడ్డు పోరంకి దగ్గర ఎన్‌హెచ్ - 65కు అనుసంధానమవుతుంది. ఈ రోడ్డును అక్కడ నుంచి పెదపులిపాక మీదుగా కాజ దగ్గరకు తీసుకువెళ్లటానికి అవకాశం ఉంటుంది. నిడమానూరుకు ముందు భాగంలో అలైన్‌మెంట్ తీసుకువెళుతూ విజయవాడ వెస్ట్ బైపాస్‌కు అనుసంధానం చేయవచ్చు. ఈ రోడ్డుకు కూడా పెద్దగా ఖర్చు చేయాల్సిన అవసరం లేదు. అలాగే ఈ రోడ్డును విజయవాడ వెస్ట్ బైపాస్‌కు నిడమానూరు నుంచి పంట పొలాల మీదుగా తీసుకువెళ్లవచ్చు.

రంగు పడింది!

» హోలీ వేడుకల్లో ఆబాల గోపాలం

వన్‌టౌన్‌లో విద్యార్థుల కేరింత





పిన్నమనేని పాలిక్లినిక్ రోడ్‌లో..



విజయవాడ(కల్చరల్), మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : నగరం హోలీ వేడుకల్లో కళకళలాడింది. వన్‌టౌన్ ప్రాంతంలోని పలు వీధులు, లబ్బీపేట బబ్బూరి గ్రౌండ్స్, పిన్నమనేని పాలిక్లినిక్ రోడ్డులో రంగుల వాన కురిసింది. చిన్నా పెద్దా తేడా లేకుండా ప్రజలు హోలీ సంబరాలు జరుపుకున్నారు. ఉదయం నుంచే వీధుల్లో రంగుల పండుగ ప్రారంభమైంది. కుటుంబసభ్యులు, స్నేహితులు, చిరువ్యాపారులు, విద్యార్థులు, ఉద్యోగులు రంగులు చల్లుకుంటూ సందడి చేశారు. లబ్బీపేట బబ్బూరి గ్రౌండ్స్‌లో భారీ స్థాయిలో హోలీ వేడుకల్లో పాల్గొన్నారు. డీజేకు అనుగుణంగా స్టెప్పులు వేసి ఉత్సాహంగా గడిపారు. పిన్నమనేని పాలిక్లినిక్ రోడ్డులో ప్రజలు గ్రూపులుగా చేరి హోలీ సంబరాల్లో పాల్గొన్నారు. చిన్నారులు రంగుల పిచికారీలతో సందడి చేశారు.

ఎన్టీటీపీఎస్‌లో సందడి చేసిన ఉద్యోగులు

డాక్టర్ ఎన్టీటీపీఎస్‌లో లావుడియా నరసింహనాయక్ అధ్యక్షతన హోలీ వేడుకలు అంబరాన్నంటాయి. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎన్టీటీపీఎస్ చీఫ్ ఇంజనీర్ టి.నాగరాజు కేకు కట్ చేసి బంజారా సోదరులందరికీ హోలీ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆటపాటలతో హోరెత్తించారు.



కుటుంబసభ్యులతో ఉద్యోగుల ఆటాపాటా



పిన్నమనేని పాలిక్లినిక్ రోడ్‌లో..





గురునానక్ కాలనీలో..



ఎన్టీటీపీఎస్‌లో..

విజయవాడ తూర్పు



బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	90,97, 107
చికెన్ విత్ స్కిన్	170
చికెన్ స్కిన్‌లెస్	180

నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 420

నేడు కరెంట్ ఉండని ప్రాంతాలు

రామలింగేశ్వరనగర్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ లైన్ల మరమ్మతులు, మెయింటెనెన్స్ నిమిత్తం శనివారం ఉదయం 8గంటల నుంచి 10గంటల వరకు స్క్యూ బ్రిడ్జి సెక్షన్, కృష్ణలంక విద్యుత్ ఉపకేంద్రం, 11కేవీ బాలాజీనగర్ ఫీడర్ పరిధిలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏపీసీపీడీసీఎల్ కార్యనిర్వాహక ఇంజనీర్ పి.రవీంద్రబాబు తెలిపారు. బాపనయ్యనగర్, గుడ్‌మార్నింగ్ టీ స్టాల్ ప్రాంతం, రాణిగారితోట తదితర ప్రాంతాల్లో కరెంట్ సరఫరా ఉండదని ఆయన తెలిపారు.





యలమంచిలి కుటుంబయ్య - రామానుజమ్మ పార్క్ బోర్డు, పార్క్‌లో పేరుకుపోయిన వ్యర్థాలు, బురదమయంగా పల్లపు ప్రాంతం

సౌకర్యాల లేమితో అవస్థలు

- యలమంచిలి కుటుంబయ్య - రామానుజమ్మ పార్క్‌లో వెలగని లైట్లు,
- ఇరుకుగా వాకింగ్ ట్రాక్ , ఇబ్బందిపడుతున్న వాకర్స్

పటమట, ఆంధ్రజ్యోతి: తూర్పు నియోజకవర్గం పరిధి 11వ డివిజన్‌లోని వివేకానంద కాలనీలో శ్రీ యలమంచిలి కుటుంబయ్య- రామానుజమ్మ పార్క్‌లో సౌకర్యాల లేమితో వాకర్స్, సీనియర్ సిటిజన్స్ ఇబ్బందులు పడుతున్నారు. పార్క్‌లో నిర్వహణ లోపం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. చెత్త నిల్వలు పేరుకుపోతున్నాయి. పార్క్‌లో లైటింగ్ వ్యవస్థ పూర్తిగా దెబ్బతింది. ఉన్న 8 లైట్లలో ఒక లైటు పూర్తిగా విరిగిపోగా మిగిలినవి వెలగడం లేదు. దీంతో రాత్రి వేళల్లో పార్క్‌లో తీవ్ర అంధకారం నెలకొంటుంది. ఉదయం వాకింగ్‌కు వెళ్లే మహిళలు చాలా ఇబ్బందులు పడుతున్నారు. పార్క్ పల్లంగా ఉండటంతో కొద్ది పాటి వర్షానికి బురద మయంగా మారుతోంది. పార్క్‌లో మొక్కలకు నీరు పోసే నాథుడు లేదు. దీంతో కొన్ని ఎండిపోయి మోడుగా మారాయి. సాయంత్ర వేళలో ఆకతాయిల ఆగడాలతో వయో వృద్ధులు తీవ్ర ఇబ్బందులెదు ర్కొంటున్నారు. వాకింగ్ ట్రాక్ ఇరుకుగా మారడంతో కేవలం ఒక్కరు మాత్రమే నడిచే వీలుంది. దాన్ని విస్తృంత చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఇప్పటికైనా కార్పొరేషన్ అధికారులు స్పందించి పార్క్‌ను అభివృద్ధి చేయడంతో పాటు సౌకర్యాలను కల్పించాలని పలువురు కోరుతున్నారు.

సౌకర్యాలు కల్పించాలి



పార్క్‌లో సరైన సౌకర్యాలు లేక ఇబ్బందులు పడుతున్నాం. తెల్లవారు జామున వాకింగ్ వస్తున్నప్పుడు లైటింగ్ లేక ఇబ్బందిగా ఉంటుంది. ట్రాక్‌ను మరింత విస్తృతం చేయాలి.
రాఘవయ్య
(వాకర్, సీనియర్ సిటిజన్)

గత ప్రభుత్వం నిర్లక్ష్యం



గత వైసీపీ ప్రభుత్వం పార్క్ అభివృద్ధిని పూర్తిగా విస్మరించింది. పార్క్‌లో ఆట వస్తువులు దెబ్బతిన్నాయి. పలుమార్లు అధికారులకు వినతిపత్రాలు అందించినా ఫలితం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సౌకర్యాలు కల్పించాలి.
-బెజవాడ నజీర్ (స్థానికుడు)

దుర్గామల్లేశ్వరులకు విశేష నిత్య పూజలు



కుంకుమార్చన చేస్తున్న భక్తులు

ఇంద్రకీలాద్రి, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): పవిత్ర ఇంద్రకీలాద్రి క్షేత్రంలో కొలువై ఉన్న శ్రీదుర్గామల్లేశ్వరులకు శుక్రవారం విశేష నిత్య పూజలు వైభవంగా జరిగాయి. కనకదుర్గమ్మకు ప్రీతిపాత్రమైన శుక్రవారం పురస్కరించుకుని భక్తులు వివిధ ఆర్జిత సేవల్లో విశేషంగా పాల్గొన్నారు. లక్ష కుంకుమార్చన, చండీయాగం, శ్రీచక్ర నవావరణార్చన, శాంతి కల్యాణం పూజల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కనకదుర్గమ్మ దర్శనానికి వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలి వచ్చారు. దర్శనం అనంతరం ఉచిత ప్రసాదం, నిత్య అన్న ప్రసాదాన్ని స్వీకరించారు.

అన్నవితరణకు విరాళం

దుర్గామల్లేశ్వర దేవస్థానంలో అన్నవితరణకు విశాఖపట్నం, గాజువాకకు చెందిన సోపల్లి నారాయణ శుక్రవారం అమ్మవారి ఆలయానికి విచ్చేసి అన్నవితరణ నిమిత్తం అధికారులను కలిసి రూ.1,00,011 చెక్కు రూపంలో అందచేశారు. అమ్మవారి దర్శనానంతరం వారికి వేద పండితులు వేద ఆశీస్సులు అందచేశారు. అధికారులు ప్రసాదం, శేషవస్త్రం, అమ్మవారి చిత్రపటం అందచేశారు.

స్వర్ణతాపడం పనులకు లక్ష విరాళం

ఆలయ స్వర్ణతాపడం పనుల నిమిత్తం హైదరాబాద్, ఎల్‌బి నగర్‌కు చెందిన మెరుగు గోపాల్, కుటుంబ సభ్యులతో శుక్రవారం అమ్మవారి ఆలయానికి విచ్చేసి స్వర్ణతాపడం పనులకు అధికారులను కలిసి రూ.లక్ష చెక్కు రూపంలో అందచేశారు. అమ్మవారి దర్శనానంతరం వారికి వేద పండితులు ఆశీస్సులు అందజేశారు. అధికారులు ప్రసాదం, అమ్మవారి చిత్రపటం, శేషవస్త్రం అందజేశారు.

మెకాట్రోనిక్స్ ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం

భారతీనగర్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ (ఏపీఎస్ఎస్‌డీసీ) ఆధ్వర్యంలో డిప్లొమో, ఇంజనీరింగ్ చదివిన విద్యార్థులకు జర్మన్ భాషా శిక్షణతో పాటు మెకాట్రోనిక్స్ ఉద్యోగాలకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఆ సంస్థ జిల్లా అధికారి ఎస్.శ్రీనివాసరావు, జిల్లా ఉపాధి కల్పన అధికారి వై సత్యబ్రహ్మం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కోర్సుకు ఆరు నెలలు శిక్షణ తరగతులను నిర్వహిస్తామన్నారు. తొలుత విజయవాడ, విశాఖపట్నం నగరాలలోని కేంద్రాల్లో ప్రారంభిస్తున్నామన్నారు. స్కిల్డ్ మెకాట్రోనిక్స్ జాబ్‌కు మెకాట్రోనిక్స్, ఎలక్ట్రికల్, ఎనర్జీ సిస్టమ్స్ ఇండస్ట్రియల్ ఇంజనీరింగ్‌లో డిగ్రీ, డిప్లొమా అర్హత కలిగి 18 నుంచి 40ఏళ్ల మధ్యలో ఉండాలని అన్నారు. మూడేళ్ల అనుభవం కావాలన్నారు. డిప్లొమా, ఇంజనీరింగ్ చదివిన ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 25లోగా ఎన్ఏఐపీయూఏఎన్ వైఎఎం. ఏపీజీవోవీ ఇన్ వెబ్ సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు రిఫండబుల్ సెక్యూరిటీ డిపాజిట్ రూ.40,000 వేలను రెండు విడతలుగా 2ఈవోఎంఎస్ వారికి చెల్లించాలని అన్నారు. ఈ డిపాజిట్‌లు సబ్మిట్ చేయడం వలన శిక్షణలో అభ్యర్థుల గైర్హాజరును నివారించవచ్చని రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి ఎస్.శ్రీనివాసరావు అన్నారు. వివరాలకు 998885665, 8712655686, 8790118349, 8790117279 నెంబర్లకు సంప్రదించాలని అన్నారు.



మజ్జిగ, చెరుకురసం పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు

జనసైనికులకు మజ్జిగ, చెరుకు రసం పంపిణీ

రాణిగారితోట, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): జనసేన పార్టీ 12 ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా టీడీపీ నాయకులు కొప్పోలు శ్రీనివాస చౌదరి ఆధ్వర్యంలో కృష్ణలంక హైవేపై పిఠాపురం వెళ్తున్న జనసైనికులకు మజ్జిగ, చెరుకు రసం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనసైనికులు తమ సోదరులని, జనసేన ఆవిర్భావ సభ నిర్వహించుకోవడం సంతోషకరమని అన్నారు. ఈ కార్యక్రమంలో రాయి రంగమ్మ, వెన్నా శివశంకర్, సునాభి పాల్గొన్నారు.

అర్హులు సీఎంఆర్‌ఎఫ్‌కు దరఖాస్తు చేసుకోండి

ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్



సీఎంఆర్‌ఎఫ్ చెక్కును అందిస్తున్న గద్దె రామ్మోహన్

పటమట, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): సీఎం సహాయ నిధికి అర్హులైన ప్రతి ఒక్కరూ దరఖాస్తు చేసుకొని వీలైనంత ఎక్కువ మంది సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ పేర్కొన్నారు. అశోక్ నగర్ ఎమ్మెల్యే కార్యాలయంలో 7వ డివిజన్‌కు చెందిన దాసరి కోటేశ్వరరావు వైద్య ఖర్చుల నిమిత్తం సీఎం సహాయ నిధి నుంచి మంజూరైన రూ.1.50 లక్షల ఎల్‌వోసీ పత్రాన్ని ఆయన అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అత్యవసర వైద్య సేవల నిమిత్తం సొంత నిధులతో వైద్య చికిత్స చేయించుకున్న వారు పూర్తి బిల్లులతో దరఖాస్తు చేస్తే వైద్య ఖర్చులు పొందవచ్చన్నారు. పూర్తి వివరాలకు తమ కార్యాలయంలో సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ పార్టీ అధ్యక్షుడు పటమట సతీష్ చంద్ర, పెనుగొండ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్ల కూడలిలో ఫ్రీ లెఫ్ట్ సక్రమంగా అమలు చేయాలి

- వైవీ ఈశ్వరరావు

బెంజిసర్కిల్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): రోడ్ల కూడలి ప్రాంతాల్లో ఫ్రీ లెఫ్ట్ సక్రమంగా అమలు చేస్తే ట్రాఫిక్ సమస్య పరిష్కారంతోపాటు రోడ్డు ప్రమాదాలను అరికట్టవచ్చని ఆంధ్రప్రదేశ్ లారీ ఓనర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి, ఆలిండియా మోటార్ ట్రాన్స్‌పోర్ట్ కాంగ్రెస్ సౌత్‌జోన్ ఉపాధ్యక్షుడు వైవీ ఈశ్వరరావు చెప్పారు. శుక్రవారం ఆయన బెంజిసర్కిల్‌లోని తన కార్యాలయంలో మాట్లాడుతూ ఫ్రీ లెఫ్ట్ వద్ద వైట్‌మార్జిన్ గీతలు వేసి అక్కడ సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. ఈ గీతలను అతిక్రమించి వాహనాలు నిలిపితే సీసీ కెమెరాలు ఆధారంగా అపరాధ రుసుం వసూలు చేయాలని ఆయన సూచించారు. దీనివల్ల ట్రాఫిక్ సమస్య తొలగడంతోపాటు ప్రభుత్వానికి ఆదాయం కూడా చేకూరుతుందని ఈశ్వరరావు పేర్కొన్నారు.

దేవినేని వెంకటరమణ, ప్రణీత మెమోరియల్ క్రికెట్ షైనింగ్ స్టార్స్, ఆంధ్రా బ్లూస్ గెలుపు

విజయవాడ(స్పోర్ట్స్), మార్చి14 (ఆంధ్రజ్యోతి): మూలపాడు గ్రౌండ్స్‌లో జరుగుతున్న దేవినేని వెంకటరమణ, ప్రణీత మెమోరియల్ బి లీగ్ మ్యాచ్‌లలో శుక్రవారం రెండు మ్యాచ్‌లు జరిగాయి. రైల్వే, షైనింగ్ స్టార్స్ మధ్య జరిగిన మ్యాచ్‌లో మొదట బ్యాటింగ్ చేసిన రైల్వే జట్టు 38ఓవర్లలో 10వికెట్లు కోల్పోయి 168పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్ చేసిన షైనింగ్ స్టార్స్ జట్టు 31.4ఓవర్లలో 6వికెట్లు కోల్పోయి 169పరుగులతో విజయం సాధించింది. జట్టులో కరీముల్లా 73పరుగులు చేశాడు. రెండో మ్యాచ్ మంగళగిరి గ్రౌండ్స్‌లో జరిగింది. న్యూ ఎవరెస్ట్, ఆంధ్రా బ్లూస్ మధ్య జరగ్గా ఆంధ్రా బ్లూస్ 38.5ఓవర్లలో 10వికెట్లు కోల్పోయి 216పరుగులు చేయగా అనంతరం బ్యాటింగ్ చేసిన న్యూ ఎవరెస్ట్ జట్టు 41.3ఓవర్లలో 10వికెట్లు కోల్పోయి 200పరుగులతో ఓటమి చెందింది. జట్టులో ఎం.రూపేష్ 80పరుగులు చేశాడు.

రేషన్ అక్రమ రవాణాకు అడ్డా కృష్ణలంక

- బహిరంగంగానే బియ్యం కొనుగోలు చేస్తున్న మహిళ
- రేషన్ డీలర్లు, ఎండీయూలు, సివిల్ సప్లై ఉద్యోగుల సహకారం

రాణిగారితోట, ఆంధ్రజ్యోతి: రేషన్ అక్రమ రవాణాకు అడ్డాగా కృష్ణలంక ప్రాంతం నిలిచింది. రామలింగేశ్వరనగర్ నుంచి రాణిగారితోట, కృష్ణలంక వరకు బియ్యం వ్యాపారులు భాగాలుగా విభజించుకుని రేషన్ వ్యాపారాన్ని జోరుగా సాగిస్తున్నారు. ఈ వ్యాపారంలో కొందరు డీలర్లు సూత్రధారులైతే, ఎండీయూలు పాత్రధారులుగా వ్యవహరిస్తున్నారు. ముఖ్యంగా రాణిగారితోట 17వ డివిజన్‌ను ఒక మహిళ తన అడ్డాగా చేసుకొని వ్యాపారం చేస్తోంది. ఈ ప్రాంతంలో ఆమె తప్ప ఎవరు బియ్యం కొనుగోలు చేసినా ఆమె కోపానికి బలవ్వాల్సిందే. సదరు మహిళ బహిరంగంగానే రేషన్ వాహనాల వద్ద బియ్యం కొనుగోలు చేస్తున్నా ఎవ్వరూ ప్రశ్నించే ధైర్యం చేయరు. ఆమె వ్యాపారానికి రేషన్ డీలర్లు, ఎండీయూలు, సివిల్ సప్లై ఉద్యోగులు పూర్తి సహకారం అందించడంతో ఆమె వ్యాపారానికి అడ్డూ అదుపు లేకుండా పోయింది. అదే విధంగా కృష్ణలంక మిగిలిన ప్రాంతాల్లో ఎండీయూలు బియ్యాన్ని కొనుగోలు చేసి దళారులకు అదే వాహనాల్లో మధ్యాహ్నం, రాత్రి వేళల్లో చేరవేస్తూ జేబులు నింపుకుంటున్నారు. రామలింగేశ్వరనగర్ నుంచి రాణిగారితోట వరకు ఓ వ్యక్తి బియ్యాన్ని కొనుగోలు చేస్తున్నట్లు సమాచారం. ఈ మహిళ కొనుగోలు చేసిన బియ్యాన్ని రాణిగారితోట ప్రాంతంలోనే ఉన్న ఆ వ్యక్తి గోడౌన్‌కు తరలిస్తుందనేది బహిరంగ రహస్యమే. ఇంత జరుగుతున్నా సంబంధిత అధికారులకు తెలియదా అంటే ఖచ్చితంగా తెలుసు వారి సహకారం లేకుండా ఇంత వ్యాపారం జరగదనేది అందరికీ తెలిసిన విషయమే. ఇందుకు ఇటీవల జరిగిన సంఘటనే నిదర్శనం.

సదరు మహిళకు ఒక ఎండీయూ తన వాహనం వద్ద దగ్గరుండి బియ్యాన్ని కొనుగోలు చేయించాడు. ఇదే సందర్భంలో రెగ్యులర్ తనిఖీలో భాగంగా సివిల్ సప్లై అధికారులు తనిఖీ చేయగా బియ్యం ఎక్కువగా వచ్చాయి. కారణం వెతకగా సదరు మహిళ కొనుగోలు చేసిన బియ్యంగా తేలింది. ఈ సందర్భంలో ఆమె తప్పించుకోగా సదరు ఎండీయూ అడ్డంగా బుక్కయ్యాడు. ఈ విషయం తెలిసిన బియ్యం కొనుగోలుదళారులు రంగంలోకి దిగి ఆమెపై ఒత్తిడి తెచ్చి విషయాన్ని గుట్టుగా సెటిల్ చేసినట్లు తెలిసింది. ఇదే విధంగా ఇంకొందరు వాహనాల వద్ద ఎండీయూల సహకారంతో అక్రమ రేషన్ బియ్యం వ్యాపారాన్ని కొనసాగిస్తున్నారు. చర్యలు తీసుకునేవారు సహకారం అందిస్తున్న సందర్భంలో ఈ అక్రమ వాపారాన్ని, అక్రమ వ్యాపారులను ఏ విధంగా కట్టడి చేస్తారని ప్రజలు చర్చించుకుంటున్నారు.

పరిశీలించి చర్యలు తీసుకుంటాం

ఎండీయూ వాహనాల వద్ద రేషన్ బియ్యాన్ని కొంటున్న వారి విషయం తమ దృష్టికి రాలేదు. దీనిపై ఇక నుంచి ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి అటువంటి వారిని గుర్తించి చర్యలు తీసుకుంటాం.
ఏఎస్‌వో శ్రీనివాసులు

బంజారా సంస్కృతి భావితరాలకు అందించాలి

- హోలీ వేడుకల్లో బంజారా ఉత్సవ కమిటీ

గవర్నర్‌పేట, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): బంజారా సంస్కృతి, సంప్రదాయాలను భవిష్యత్తు తరాలకు తెలియజేయాలనే లక్ష్యంతో హోలీ వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నట్లు సాంఘిక సంక్షేమ శాఖ, గిరిజన శాఖల ముఖ్య కార్యదర్శి ఎంఎం నాయక్ తెలిపారు. బంజారా హోలీ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో లెనిన్ సెంటర్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ భవన్‌లో హోలీ సంబరాలు కుటుంబ సభ్యులతో కలిసి జరుపుకున్నారు. బంజారా ఆఫీసర్స్ అసోసియేషన్ నాయకులు, కుటుంబ సభ్యులు కూడా వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. మహిళల సంప్రదాయ నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన నాయక్ మాట్లాడుతూ కుటుంబ సభ్యులతో కలిసి బంజారాలు హోలీ సంబరాలు జరుపుకోవడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. బంజారా ఉత్సవ కమిటీ అధ్యక్షుడు బి.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ బంజారాలకు నగరంలో బంజారా భవన్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో జలవనరుల శాఖా సీఈ బి.రాంబాబు, ఎంప్లాయిమెంట్ విభాగం డిప్యూటీ డైరెక్టర్ వి.హనుమనాయక్, డిప్యూటీ చీఫ్ ఇంజనీర్ ఎ.బుద్దయ్య నాయక్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

చోరీకి యత్నించిన ఇద్దరు అరెస్టు

విద్యాధరపురం, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రంలోని కోదాడలో ఓ బంగారం షాపులో దొంగతనానికి ప్రయత్నించిన ఇద్దరు నిందితులను శుక్రవారం భవానీపురం పోలీసులు అరెస్టు చేశారు. పోలీసుల వివరాల ప్రకారం రాజస్థాన్ రాష్ట్రానికి చెందిన రాజపురోహిత్ రాజసింగ్ వన్‌టౌన్‌లో గిఫ్ట్‌షాపు నిర్వహిస్తున్నాడు. ఇతను ఎక్కువ డబ్బులు సంపాదించాలనే దుర్బుద్ధితో కోదాడలోని ఓ బంగారం షాపులో దొంగతనం చేయాలని పక్కా ప్రణాళిక సిద్ధం చేశాడు. అతని అన్నయ్య రాజపురోహిత్ ప్రభాత్‌సింగ్‌తో పాటు మరో ఇద్దరిని కలుపుకున్నాడు. మూడు రోజుల క్రితం దొంగతనం చేయటానికి కావాల్సిన సామాగ్రిని కొనుగోలు చేసి బైక్‌పై కోదాడ బయలుదేరారు. గొల్లపూడి వెస్ట్ బైపాస్ వద్ద పోలీసులు తనిఖీలు చేయగా, వారిని చూసి అనుమానించి అదుపులోకి తీసుకుని విచారించగా అసలు విషయం బయట పడింది. పోలీసులు వారి వద్ద ఉన్న సామాగ్రిని స్వాధీనం చేసుకుని వారి పై కేసు నమోదు చేసి అరెస్టు చేశారు. విచారణలో భాగంగా పోలీసులు మిగిలిన నిందితుల కోసం కోదాడ వెళ్లారు.


సభ వద్ద నాగబాబు భార్య


సభకు కదలివచ్చిన అశేష ప్రజానీకం..అభివాదం చేస్తున్న పవన్


మేం సైతం: సభకు కదలివచ్చిన దివ్యాంగులు

జనషోన



పవనుడు అందరివాడు..

పిఠాపురం, మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : పవన్ సభకు ఎక్కడెక్కడి నుంచో అభిమానులు తరలివస్తారు. దానికి తగినట్టు ఏర్పాట్లు కూడా చేశారు. ఇతర రాష్ట్రాల నాయకులు, జనసైనికులు, వీరమహిళలు, అభిమానుల కోసం ఆయా భాషల్లో బోర్డులు ఏర్పాటు చేశారు. జయకేతనం అంటూ తమిళం, కన్నడ, హిందీ తదితర భాషల్లో ఏర్పాటు చేసిన బోర్డులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. సభ వద్ద కర్నాటక రాష్ట్రానికి చెందిన జన సైనికులు కన్నడ భాషలో రాసి ఉన్న ప్లకార్డులు ప్రదర్శించారు.


పవన్ అభిమానం


పచ్చని స్వాగతం..



పర్యావరణ ప్రాధాన్యతను వివరిస్తూ కాకినాడ సర్పవరం జంక్షన్ నుంచి చిత్రాడ వరకూ పచ్చని స్వాగతద్వారాలు ఏర్పాటు చేశారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో అన్ని వర్గాలకు మేలు చేసే పలు కార్యక్రమాలు నిర్వహించిన విశిష్ట వ్యక్తులు పిఠాపురం మహారాజా సూర్యారావు బహద్దూర్, మల్లాడి సత్యలింగ నాయకర్, డొక్కా సీతమ్మ పేర్లను స్వాగత ద్వారాలకు పెట్టడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

9 చోట్లా ఇంతే

చిత్రాడలో నిర్వహించిన జయకేతనం సభకు సంబంధించి 9 ప్రాంతాల్లో పార్కింగ్ ప్రదేశాలు కేటాయించారు. ప్రతి చోటా వాహనాలన్నీ ఇలా బారులుతీరాయి. బస్‌లు, కార్లు, ద్విచక్రవాహనాలతో ఎక్కడికక్కడ నిండిపోయాయి.



జయకేతనం.. విజయకేతనమే.. యువత ఉప్పొంగింది.. చిత్రాడను ముంచెత్తింది.. ఎటు చూసినా ఎక్కడ చూసినా జనమే జనం.. కాకినాడ జిల్లా పిఠాపురం మండలం చిత్రాడ వీధులన్నీ జనంతో నిండిపోయాయి.. జై పవన్.. జై జై పవన్ నినాదాలతో మార్మోగిపోయాయి.. డిప్యూటీ సీఎం.. పిఠాపురం ఎమ్మెల్యేగారి తాలూకా బైక్‌లతో నిండిపోయాయి.. కార్లు.. ఆటోలు.. బస్‌లు క్యూకట్టాయి.. రకరకాల విన్యాసాలు చేసుకుంటూ జనసైన్యం కదిలింది.. పవన్‌పై అభిమానం చాటింది. శుక్రవారం తెల్లవారుజాము నుంచే జనసైనికులు తరలిరావడం ఆరంభించారు.. ఆలస్యంగా వెళితే అన్నను వెనుక నుంచి చూడాలని ముందుగానే జయకేతనం సభ నిర్వహించే చిత్రాడకు చేరుకున్నారు.. లక్షలాది మందితో గ్రామం కిక్కిరిసిపోయింది..

మొక్కు తీరుద్దామని..



పిఠాపురం : 2024 అసెంబ్లీ ఎన్నికల్లో పవన్‌కల్యాణ్ విజయం సాధిస్తే వైజాగ్‌లోని కనకమహాలక్ష్మి.. తిరుమల వెంకటేశ్వరస్వామి.. హైదరాబాద్‌లోని పెద్దమ్మతల్లి గుడికి వస్తానని అనకాపల్లి జిల్లా పాయకరావుపేటకు చెందిన జనసైనికుడు గుత్తుర్తి విజయబాబు మొక్కుకున్నాడు. సైకిల్‌పై మొక్కు తీర్చుకునేందుకు తిరుపతికి బయలుదేరి చిత్రాడలో జరుగుతున్న జనసేన సభ వద్దకు వచ్చారు. సభ చూసిన తర్వాత తిరుమలకు సైకిల్‌పై వెళతానని విజయబాబు తెలిపారు.

చిత్రాడదారులన్నీ జనపవనమై..





జనసైనికా.. కూల్..కూల్..

పిఠాపురం,/కాకినాడ కలెక్టరేట్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : రండి బాబు రండి పుచ్చకాయలు తిని వెళ్లండి.. లేదంటే మజ్జిగ తాగి వెళ్లండి.. ఏదైనా మీ చాయిస్ అంటూ దారి పొడవునా జనసైనికులను చల్లబరిచారు.. చిత్రాడ జనసేన ఆవిర్భావ సభకు అటు, ఇటూ పది కిలోమీటర్ల దూరం వరకూ ఎక్కడిక్కడ ఏర్పాటు చేసిన ఉచిత కౌంటర్ల ద్వారా ఉదయం నుంచి రాత్రి వరకూ పిలిచి మరీ అందించారు. మజ్జిగ ప్యాకెట్లతో పాటు వాటర్ ప్యాకెట్లు భారీ ఎత్తున పంపిణీ చేశారు.



దివ్యాంగుల అభ్యున్నతే ధ్యేయం

- విభిన్న ప్రతిభావంతులకు ఉపకరణాల పంపిణీలో ఎంపీ కేశినేని చిన్ని


విభిన్న ప్రతిభావంతులకు ఉపకరణాలు అందిస్తున్న ఎంపీ కేశినేని చిన్ని, ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, కలెక్టర్ లక్ష్మీశ

మొగల్రాజపురం, మార్చి 14(ఆంధ్ర జ్యోతి): దివ్యాంగుల సమస్యల పరిష్కారానికి కూటమి ప్రభుత్వం కృషిచేస్తోందని, వారి అభ్యున్నతే ధ్యేయంగా పనిచేస్తోందని ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని) అన్నారు. కేంద్ర ప్రభుత్వ అలింకో సంస్థ సహకారంతో ఎంపీ ఆధ్వర్యంలో పీబీ సిద్ధార్థ ఆడిటోరియంలో నగరంలోని మూడు నియోజకవర్గాలకు చెందిన 715 మందికి బ్యాటరీ ట్రైసైకిళ్లు, ట్రై సైకిళ్లు, చంక కర్రలు, వీల్‌చైర్లు, వినికిడి యంత్రాలు, కృత్రిమ అవయవాలు, క్యాలిపర్స్, ఎంఎస్ఐడీ కిట్లు, రోల్లెటర్లను పంపిణీ చేశారు. ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, కలెక్టర్ లక్ష్మీశ పాల్గొన్నారు. గత వైసీపీ ప్రభుత్వం విభిన్న ప్రతిభావంతుల సమస్యలు పట్టించుకోలేదని, మూడున్నరేళ్లుగా ఎంపిక చేసిన వారికి ఉపకరణాలు ఇవ్వలేదని ఎంపీ విమర్శించారు. కేంద్రం 2022లో ఉపకరణాలకు జాబితా ఇస్తే వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. కూటమి అధికారంలోకి రాగానే సీఎం చంద్రబాబుతో చెప్పి కలెక్టర్, జిల్లా అధికారులతో కలిసి కేంద్రం మంజూరు చేసిన పరికరాలను రెండు నెలల క్రితం హైదరాబాద్ నుంచి తెప్పించామని ఆయన తెలిపారు. ఎమ్మెల్సీ కోడ్ కారణంగా పంపిణీ ఆలస్యమైందన్నారు. ఎంపీ కేశినేని చిన్ని చొరవతోనే ఉపకరణాల పంపిణీ జరిగిందని కలెక్టర్ లక్ష్మీశ అన్నారు. ఎన్టీఆర్ జిల్లాను అభివృద్ధి పథంలో నడిపేందుకు పనిచేస్తున్నామని, అందుకు ఎంపీ కేశినేని చిన్ని చొరవతో ముందుకు వెళుతున్నామని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ తెలిపారు. ఏపీ బిల్డింగ్ అండ్ అదర్స్ కన్‌స్ట్రక్ వర్కర్స్ అడ్వయిజరీ కమిటీ చైర్మన్ గొట్టుముక్కల రఘురామరాజు, ఎన్టీఆర్ జిల్లా మహిళా అధ్యక్షురాలు చెన్నుపాటి ఉషారాణి, కార్పొరేటర్ జాస్తి సాంబశివరావు, అలింకో సంస్థ ప్రతినిధి రవిశంకర్ పాల్గొన్నారు.

జనాభా ప్రాతిపదికన మాదిగలకు 1.8, మాలలకు 10 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలి

- ఏకసభ్య కమిషన్ మాదిగలకు ఆరున్నర, మాలలకు ఏడున్నర శాతం ఇవ్వాలని ప్రతిపాదించడాన్ని ఖండిసున్నాం: మాల సంఘాల నేతలు

గాంధీనగర్, మార్చి 14(ఆంధ్రజ్యోతి): 'జనాభా ప్రాతిపదికన మాదిగలకు 1.8 శాతం, మాలలకు 10 శాతం రిజర్వేషన్లు రావాలి. ఎస్సీ వర్గీకరణకు రాష్ట్ర ప్రభుత్వం నియమించిన ఏకసభ్య కమిషన్ రెల్లి కులానికి ఒక శాతం, మాదిగలకు ఆరున్నర శాతం, మాలలకు ఏడున్నర శాతం ఉప రిజర్వేషన్లను ప్రతిపాదించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం.' అని మాల సంఘాల నేతలు తెలిపారు. గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ప్రెస్‌మీట్‌లో వారు మాట్లాడారు. జనాభా గణనలో మాల, ఆది ఆంధ్రులకు తీవ్ర అన్యాయం జరుగుతోందని వారు ఆవేదన వ్యక్తంచేశారు. సుప్రీంకోర్టు మార్గదర్శకాలకు అనుగుణంగా వర్గీకరణ చేయాలన్నారు. 1971 నుంచి 2011 వరకు జనాభా లెక్కల్లో అనేక అక్రమాలు జరిగాయని తెలిపారు. 1971లో మాదిగల కంటే మాలల జనాభా 10,06,043 ఎక్కువ ఉందని 2011 నాటికి మాదిగల కంటే మాలల జనాభా 10,49,506 మాత్రమే ఎక్కువ ఉందని తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో 40 ఏళ్లలో మాలల జనాభాలో ఏ మాత్రం పెరుగుదల లేదన్నారు. ఏపీలో జరిగిన జనగణనలో మాలల జనాభాను ఉద్దేశపూర్వకంగానే తగ్గించినట్టు స్పష్టమవుతోందని వారు ఆరోపించారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ మాల ఉద్యోగుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు నూతలపాటి జగదీష్, అనిల్ కుమార్ అంబటి, అఖిల భారత మాల సంఘాల జేఏసీ చైర్మన్ ఉప్పులేటి దేవీప్రసాద్, ఏపీ మాల ఉద్యోగుల సంఘం కోశాధికారి వై.శ్యామ్‌కుమార్, ఇండియన్ లేబర్ పార్టీ అధ్యక్షుడు డాక్టర్ ముద్ద అంకయ్య, ఏపీ మాల ఉద్యోగుల సంఘం గౌరవ అధ్యక్షుడు బేతాళ సుదర్శనం, సయ్యద్ భావన తదితరులు పాల్గొన్నారు.

అమరావతి ప్రధాన రహదారుల పనులకు టెండర్ల ఖరారు

- హడ్కో కేఎఫ్‌డబ్ల్యూ నిధులతో 24 ప్యాకేజీల్లో ప్రధాన రోడ్లకు టెండర్లు
- ఎల్-1గా నిలిచిన సంస్థల వివరాలను ప్రకటించిన సీఆర్‌డీఏ
- కాంట్రాక్టు సంస్థలకు ఎల్‌వోఏలు ఇచ్చేందుకు సీఆర్‌డీఏ సన్నాహాలు

విజయవాడ, మార్చి 14(ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతిలో ప్రధాన రహదారుల పనులను పరుగులు పెట్టించేందుకు హడ్కో, కేఎఫ్‌డబ్ల్యూ నిధులతో చేపట్టే 24 ప్యాకేజీ పనులకు టెండర్లను సీఆర్‌డీఏ అధికారులు ఖరారు చేశారు. ప్రధాన రోడ్లకు పిలిచిన టెండర్లలో ఎల్-1గా నిలిచిన సంస్థలను సీఆర్‌డీఏ అధికారులు ప్రకటించారు. హడ్కో నుంచి తీసుకునే రూ.11 వేల కోట్ల రుణం, కేఎఫ్‌డబ్ల్యూ నుంచి తీసుకునే రూ.5 వేల కోట్ల రుణం మొత్తం రూ.16 వేల కోట్ల రుణంలో భాగంగా చేపట్టే పనుల్లో రోడ్ల పనులు కూడా ప్రధానమైనవి. హడ్కో చైర్మన్‌ను సీఆర్‌డీఏ అథారిటీలో సభ్యుడిగా నియమించేందుకు ప్రభుత్వం అనుమతి తెలిపినట్టు తెలుస్తోంది. తమ నిధులతో చేసే పనులను హడ్కో సమీక్షించటానికి వీలుగా ఈ నిర్ణయం తీసుకుంది. హడ్కో, కేఎఫ్‌డబ్ల్యూ నిధులతో రాజధానిలో ఈ-6, ఈ-5, ఈ-7, ఈ-11, ఈ-13, ఈ-15, ఎన్-13, ఈ-2, ఈ-4, ఎన్-8, ఎన్-4, ఈ-10, ఈ-12, ఎన్-7, ఎన్-10, ఎన్-14, ఎన్-16, ఎన్-17, ఈ-3(ఫేజ్-2), ఈ-16, ఎన్-1, ఎన్-2, ఎన్-3ఏ, 3బీ, ఎన్-5 రోడ్లకు పిలిచిన టెండర్లలో బడా సంస్థలు టెండర్లు వేశాయి.

ఎల్-1గా నిలిచి రోడ్ల పనులకు టెండర్లు దక్కించుకున్న సంస్థలు

- ఈ-6 రోడ్డు పనులకు ఆర్‌వీఆర్ ప్రాజెక్ట్స్ సంస్థ రూ.337.28 కోట్లకు బిడ్‌ను కోట్ చేసింది.
- ఈ-5 రోడ్డు పనులకు బీఎస్ఆర్ సంస్థ రూ.562.28 కోట్లకు బిడ్‌ను కోట్ చేసింది.
- ఈ-7 రోడ్డు పనులకు బీఎస్ఆర్ సంస్థ రూ.369.38 కోట్లకు బిడ్‌ను కోట్ చేసింది.
- ఈ-11 రోడ్డు పనులకు మేఘా సంస్థ రూ.156.92 కోట్లకు బిడ్‌ను కోట్ చేసింది.
- ఈ-13 రోడ్డు పనులకు ఆర్‌వీఆర్ ప్రాజెక్ట్స్ సంస్థ రూ.207.85 కోట్లకు బిడ్‌ను కోట్ చేసింది.
- ఈ-15 రోడ్డు పనులకు బీఎస్ఆర్ సంస్థ రూ.194 కోట్లకు బిడ్‌ను కోట్ చేసింది.
- ఎన్-13 రోడ్డు పనుల టెండర్లకు ఆర్‌వీఆర్ సంస్థ రూ.254.10కోట్లకు బిడ్‌నుకోట్ చేసింది.
- ఈ-2 రోడ్డు పనులకు బీఎస్ఆర్ సంస్థ రూ.157.47 కోట్లకు బిడ్‌ను కోట్ చేసింది.
- ఈ-4 రోడ్డు పనులకు మేఘా సంస్థ రూ.515.53 కోట్లకు బిడ్‌ను కోట్ చేసింది.
- ఎన్-8 రోడ్డు పనులకు ఎస్‌సీసీ సంస్థ రూ.605.04 కోట్లకు బిడ్‌ను కోట్ చేసింది.
- ఎన్-4 రోడ్డు పనులకు బీఎస్‌సీపీఎల్ సంస్థ రూ.246.41 కోట్లకు కోట్ చేసింది.
- ఈ-10 రోడ్డు పనులకు మేఘా సంస్థ రూ.295.84 కోట్లకు బిడ్‌ను కోట్ చేసింది.
- ఈ-12 రోడ్డు పనులకు బీఎస్ఆర్ సంస్థ రూ.255.60 కోట్లకు బిడ్‌ను కోట్ చేసింది.
- ఎన్-7 రోడ్డు పనులకు ఆర్‌వీఆర్ సంస్థ రూ.453.92 కోట్లకు బిడ్‌ను కోట్ చేసింది.
- ఎన్-14 రోడ్డు పనుల టెండర్లకు ఆర్‌వీఆర్ సంస్థ రూ.252.73 కోట్లకు కోట్ చేసింది.
- ఎన్-16 రోడ్డు పనులను బీఎస్‌సీపీఎల్ సంస్థ రూ.191.92 కోట్లకు కోట్ చేసింది.
- ఎన్-17 రోడ్డు పనుల టెండర్లను బీఎస్‌సీ సంస్థ రూ.186.74 కోట్లకు కోట్ చేసింది.
- ఈ-3 (ఫేజ్-2) రోడ్డు పనులను ఎన్‌సీసీ సంస్థ రూ.188.45 కోట్లకు కోట్ చేసింది.
- ఈ-16 రోడ్డు పనులకు ఎన్‌సీసీ సంస్థ రూ.141.45 కోట్లకు బిడ్‌ను కోట్ చేసింది.
- ఎన్-1 రోడ్డు పనులకు బీఎస్ఆర్ సంస్థ రూ.125.08 కోట్లకు బిడ్‌ను కోట్ చేసింది.
- ఎన్-2 రోడ్డు పనుల టెండర్లలో బీఎస్ఆర్ సంస్థ రూ.111.84 కోట్లకు కోట్ చేసింది.
- ఎన్-3ఏ, 3బీ రోడ్ల పనుల టెండర్లలో బీఎస్‌సీపీఎల్ సంస్థ రూ.154.75 కోట్లకు బిడ్‌ను కోట్ చేసింది.
- ఎన్-5 రోడ్డు టెండర్లలో ఎన్‌సీసీ సంస్థ రూ.70.63 కోట్లకు బిడ్‌ను కోట్ చేసింది.

విశాఖ ఉక్కుప్రైవేటీకరణకు వ్యతిరేకంగా అసెంబ్లీలో తీర్మానం చేయాలి

- ధర్నాచౌక్‌లో విశాఖ ఉక్కు పరిరక్షణ జేఏసీ ధర్నా

ధర్నాచౌక్, మార్చి 14(ఆంధ్రజ్యోతి): విశాఖ స్టీల్ పరిరక్షణ కోసం ఎన్నికల సమయంలో కూటమి నేతలు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని పలువురు వక్తలు డిమాండ్ చేశారు. విశాఖ స్టీల్‌కు కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన ప్యాకేజీ మోసపూరితమని, ప్లాంట్‌కు సొంత గనులు, నిర్వహణ నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. విశాఖ ఉక్కు పరిరక్షణ జేఏసీ ఆధ్వర్యంలో స్థానిక ధర్నాచౌక్‌లో శుక్రవారం ధర్నా జరిగింది. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ చేయరాదని అసెంబ్లీలో తీర్మానించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని నాయకులు డిమాండ్ చేశారు. ఇటీవల ప్లాంట్‌ను కాపాడుకునేందుకు కేంద్రప్రభుత్వం నిధులు కేటాయించిందని అనడం విడ్డూరంగా ఉందన్నారు. ఆ నిధులు కేవలం బకాయి వేతనాలు చెల్లించడానికే సరిపోతాయన్నారు. విశాఖ ఉక్కు రక్షణ కోసం ప్రజలు, ట్రేడ్ యూనియన్లు దీర్ఘకాలంగా పోరాడుతున్నా పట్టించుకోకుండా అనకాపల్లిలో మరో ప్రైవేట్ స్టీల్‌ప్లాంట్ మిట్టల్ కంపెనీకి ప్రభుత్వం మౌలిక వసతులు కల్పించడాన్ని తప్పుబట్టారు. రాజకీయలకు అతీతంగా విశాఖ ఉక్కు పరిరక్షణకు ప్రతి ఒక్కరూ ఉద్యమించాలని పిలుపునిచ్చారు. మాజీమంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు, జేఏసీ చైర్మన్ సీహెచ్ నర్సింగరావు, ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు రావుల రవీంద్రనాథ్ మాట్లాడారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ సంఘీభావం తెలిపారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ వ్యతరేక ఉద్యమానికి తమ మద్దతు ప్రకటించారు.

పిల్లల్ని నీటిలో ముంచి హత్య చేసిన తండ్రి

- అనంతరం ఉరేసుకుని ఆత్మహత్య.. కాకినాడలో దారుణం

సర్పవరం జంక్షన్, మార్చి 14(ఆంధ్రజ్యోతి): కంటికి రెప్పలా చూసుకోవాల్సిన కన్నతండ్రే కాలయముడయ్యాడు. ఇద్దరు చిన్నారుల్ని నీటిలో ముంచి హత్య చేసి, ఆపై ఆత్మహత్యకు పాల్పడిన ఉదంతం శుక్రవారం కాకినాడలో జరిగింది. కాకినాడ నగరం తోట సుబ్బారావునగర్‌లో నివాసం ఉంటున్న వానపల్లి చంద్రకిషోర్ వాకలపూడిలో ఓఎన్జీసీలో అసిస్టెంట్ అకౌంటెంట్‌గా పని చేస్తున్నాడు. హోలీ వేడుకల్లో పాల్గొనేందుకు భార్య, ఇద్దరు కుమారులు జోషిల్ (7), నిఖిల్ (6)ను కార్యాలయానికి తీసుకెళ్లాడు. అనంతరం కుమారులను యూనిఫామ్ కొలతల కోసం టైలర్ వద్దకు తీసుకు వెళుతున్నానని భార్యకు చెప్పి ఇంటికి వెళ్లాడు. అక్కడ పిల్లల కాళ్లు, చేతులు కట్టేసి బకెట్‌లో నీటిలో ముంచి ఊపిరాడకుండా చేసి హత్యచేశాడు. అనంతరం బెడ్‌రూమ్‌లోకెళ్లి ఫ్యానుకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోటీ ప్రపంచంలో తన పిల్లలకు భవిష్యత్తు లేదని, అందుకే వారిని చంపి తానూ మరణిస్తున్నట్టు చంద్రకిషోర్ సూసైడ్ నోట్‌లో రాసి ఉంచాడు. సర్పవరం ఎస్‌హెచ్‌వో బి.పెద్దిరాజు ఆదేశాల మేరకు ఎస్ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తిరుమల చేరుకున్న ఏకసభ్య కమిషన్

తిరుపతి(కలెక్టరేట్), మార్చి 14(ఆంధ్రజ్యోతి): 'తిరుపతి' తొక్కిసలాట ఘటనపై రాష్ట్ర ప్రభుత్వం నియమించిన ఏక సభ్య న్యాయ విచారణ కమిషన్ చైర్మన్ జస్టిస్ సత్యనారాయణమూర్తి శుక్రవారం రాత్రి తిరుమల చేరుకున్నారు. శ్రీవారి దర్శనానికి భక్తులు వెళ్లే క్యూలైన్ల నిర్వహణ తీరును శని, ఆదివారాల్లో ఆయన పరిశీలించనున్నారు. సోమవారం నుంచి వారం రోజుల పాటు టీటీడీ, పోలీసు, రెవెన్యూతో పాటు తొక్కిసలాటలో గాయపడిన 16 మందిని విచారించనున్నారు. ఇప్పటికే 17న హాజరు కావాలని కలెక్టర్ వెంకటేశ్వర్, టీటీడీ ఈవో శ్యామలరావు, ఎస్పీ హర్షవర్ధన్‌రాజుకు నోటీసులు పంపారు. ఇక 18 నుంచి బదిలీ, సస్పెండైన అధికారులతో పాటు పలువురిని ఆరురోజుల పాటు విచారించి, వాంగ్మూలం స్వీకరించనున్నారు. ఈ మూడో దశ విచారణ అత్యంత కీలకంగా మారనుంది.


యూటీఎఫ్ రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న కేఎస్ లక్ష్మణరావు

ప్రభుత్వ బడిని బతికించుకుందాం

- విద్యార్థులను చేర్పించే ప్రక్రియను ప్రారంభించండి
- తల్లిదండ్రులకు నమ్మకం కలిగేలా పనిచేయండి
- రౌండ్ టేబుల్ సమావేశంలో ఉపాధ్యాయులకు వక్తల పిలుపు

గవర్నర్‌పేట, మార్చి 14(ఆంధ్రజ్యోతి): 'ప్రభుత్వ బడి పట్ల విద్యార్థుల తల్లిదండ్రులకు నమ్మకం కలిగించేలా పనిచేసి, ప్రభుత్వ బడులను బతికించుకోవడానికి కృషి చేయండి. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించే ప్రక్రియను ప్రారంభించండి.' అని ఉపాధ్యాయులకు రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు పిలుపునిచ్చారు. యూటీఎఫ్ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం ఎంజీ రోడ్డులోని రాష్ట్ర కార్యాలయంలో విద్యారంగ సమస్యలపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. సమావేశానికి యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.వెంకటేశ్వర్లు, కేఎస్ఎస్ ప్రసాద్ ప్యానెల్ అధ్యక్షులుగా వ్యవహరించారు. పీడీఎఫ్ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు మాట్లాడారు. గత ప్రభుత్వం విద్యారంగ సంస్కరణల పేరుతో తెచ్చిన జీవో నెంబరు 117 కారణంగా 12,512 ప్రాథమిక పాఠశాలలు ఏకోపాధ్యాయ పాఠశాలలుగా మారాయని, 10 లక్షల మంది విద్యార్థులు ప్రైవేట్ పాఠశాలలకు తరలిపోయారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. పీడీఎఫ్ ఎమ్మెల్సీలు, ఉపాధ్యాయ సంఘాల డిమాండ్ వల్ల జీవోను రద్దు చేస్తామని ప్రస్తుత ప్రభుత్వం ప్రకటించిందన్నారు. జీవో నెంబరు 117 రద్దు చేసి మరో జీవో తేవడం కోసం చేస్తున్న కసరత్తులో విద్యారంగ సంస్కరణలు అమలు చేస్తోందని పీడీఎఫ్ ఎమ్మెల్సీ బి.గోపిమూర్తి అన్నారు. విద్యారంగ సంస్కరణల వల్ల 1, 2 తరగతులు మాత్రమే ఉన్న ఫౌండేషన్ పాఠశాలలు 20 వేలకు పైగా పెరుగుతాయని తెలిపారు. భవిష్యత్తులో ఈ పాఠశాలలూ మూసివేస్తారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. మోడల్ ప్రాథమిక పాఠశాలల పేరుతో మిగిలిన ప్రాథమిక పాఠశాలల్లోని 3, 4, 5 తరగతులను మ్యాప్ చేయడాన్ని వ్యతిరేకిస్తున్నామన్నారు. స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీల ద్వారా బలవంతంగా తీర్మానాలు చేయించడం సరికాదని మాజీ ఎమ్మెల్సీ వి.బాలసుబ్రహ్మణ్యం అన్నారు. అన్ని హంగులతో మోడల్ పాఠశాలను నిర్మించాలని ఆయన డిమాండ్ చేశారు. సమావేశంలో పలు తీర్మానాలను ఆమోదించారు. తీసుకున్న నిర్ణయాలను విద్యాశాఖ మంత్రి, ఎమ్మెల్యేలు, గ్రామ సర్పంచ్‌లు, విద్యాకమిటీ సభ్యుల వరకు తీసుకెళ్లాలని నిర్ణయించారు. అంగన్వాడీ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుబ్బరావమ్మ, జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి గొంటి గిరిధర్, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ప్రసన్న, అశోక్, యూటీఎఫ్ కార్యదర్శులు ఎస్పీ మనోహర్‌కుమార్, బి.సుభాషిణి, కేఏ ఉమామహేశ్వరరావు, ఎస్.కిషోర్‌కుమార్ పాల్గొన్నారు.

విశాఖపట్నం-చర్లపల్లి మధ్య హోలీ ప్రత్యేక రైళ్లు

రైల్వేస్టేషన్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): దక్షిణ మధ్య రైల్వే హోలీ ప్రత్యేక రైళ్లను నడుపుతున్నట్లు చీఫ్ పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ ఎ.శ్రీధర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. హోలీ రద్దీ నేపథ్యంలో ఈ రైళ్లను చర్లపల్లి-విశాఖపట్నం మధ్య అప్ అండ్ డౌన్ సర్వీసులను నడుపుతున్నట్లు పేర్కొన్నారు. ఈనెల 16వ తేదీ విశాఖపట్నం-చర్లపల్లి రైలు(నెంబరు 08579) సాయంత్రం 6.20 గంటలకు బయల్దేరి, మరునాడు ఉదయం 8 గంటలకు చర్లపల్లి చేరుకుంటుంది. ఈనెల 17వ తేదీ చర్లపల్లి-విశాఖపట్నం రైలు(నెంబరు 08580) ఉదయం 10 గంటలకు బయల్దేరి అదేరోజు రాత్రి 10 గంటలకు విశాఖపట్నం చేరుకుంటుంది. ఈ ప్రత్యేక రైళ్లు దువ్వాడ, అనకాపల్లి, యలమంచిలి, తుని, అన్నవరం, సామర్లకోట, రాజమండ్రి, నిడదవోలు, తాడేపల్లిగూడెం, ఏలూరు, విజయవాడ, గుంటూరు, సత్తెనపల్లి, పిడుగురాళ్ల, నడికుడి, మిర్యాలగూడ, నల్గొండ స్టేషన్లలో ఆగుతాయి.

ఎస్సీ వర్గీకరణలో ఏపీ ముందంజ



- నెల రోజుల్లోనే సమస్యకు పరిష్కారం
- తెలంగాణలో నిర్లక్ష్యం..: మంద కృష్ణ మాదిగ

ఒంగోలు, మార్చి 14(ఆంధ్రజ్యోతి): 'ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ ప్రక్రియ ఆంధ్రప్రదేశ్‌లో సీఎం చంద్రబాబు ఆధ్వర్యంలో ముందుకు సాగుతుందని విశ్వసిస్తున్నాం. తెలంగాణలో సీఎం రేవంత్‌రెడ్డిలో నిజాయితీ, చిత్తశుద్ధి లోపించింది. దీంతో కొన్ని అడ్డంకులు ఎదురవుతున్నాయి' అని పద్మశ్రీ అవార్డు గ్రహీత, ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక జాతీయ అధ్యక్షులు మంద కృష్ణ మాదిగ అన్నారు. శుక్రవారం ఒంగోలు విచ్చేసిన ఆయన మాదిగ ఉద్యోగుల సంఘం రాష్ట్ర నాయకులు, సాంఘిక సంక్షేమ శాఖ ఉద్యోగి మున్నంగి లక్ష్మయ్య(ఇటీవల చిన్నపాటి ప్రమాదం జరిగి, చేతికి గాయమైంది)ను పరామర్శించారు. అనంతరం ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ... 'మాదిగలతోపాటు, వర్గీకరణ కోరుకున్న దళిత కులాలకు చంద్రబాబుతో మేలు జరుగుతుంది. వర్గీకరణ చేసి, మరిన్ని ఫలాలు అందించాలన్న ఆయన ఆలోచనలను పరిణామాలు ప్రతిఫలిస్తున్నాయి. రాజీవ్ రంజన్ మిశ్రా కమిషన్ రిపోర్టు అందగానే ఆ అంశంపై సీఎం మంత్రివర్గ సమావేశం ఏర్పాటు చేయడంతో ఆ ప్రక్రియ వేగవంతం అవుతుంది. ఈ విషయంలో చంద్రబాబు ప్రత్యేక శ్రద్ధ పెట్టినట్లుగా తెలుస్తుంది. ఎస్సీ వర్గీకరణకు నెలరోజుల్లోనే శాశ్వత పరిష్కారం లభించనుంది. ఇప్పటివరకు రిజర్వేషన్ ఫలాలు దక్కని మాదిగ, రెల్లి, ఇతర ఉపకులాలకు త్వరలోనే న్యాయం జరుగుతుంది. కాగా రాష్ట్రంలో ఉద్యోగ నియామకాలు, పదోన్నతులు, నోటిఫికేషన్‌లు వర్గీకరణ పూర్తయిన తర్వాతనే అమలు చేయాలి' అని విజ్ఞప్తి చేశారు. అనంతరం ఆయన ఎమ్మార్పీఎస్ నాయకులతో కొద్దిసేపు సమీక్షించారు.

వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలి

- ఆంధ్రప్రదేశ్ వాల్మీకి సంఘం డిమాండ్

న్యూఢిల్లీ, మార్చి 14(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఆంధ్రప్రదేశ్ వాల్మీకి సంఘం డిమాండ్ చేసింది. ఏపీ భవన్‌లో శుక్రవారం ఆ సంఘం అధ్యక్షుడు పులి శ్రీనివాసులు మీడియాతో మాట్లాడారు. 'ప్రస్తుతం జరుగుతున్న అసెంబ్లీ, పార్లమెంట్ సమావేశాల్లో వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలని ఎమ్మెల్యేలు పార్థసారథి, సింధూరరెడ్డి, ఎంపీ డీకే అరుణ మాట్లాడారు. రాష్ట్రంలో 50 లక్షల మంది వాల్మీకులు ఉన్నారు. వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చే బిల్లును ఆమోదించేందుకు చర్యలు తీసుకోవాలని రాష్ట్రపతి, ప్రధాని, కేంద్ర గిరిజన వ్యవహారాల మంత్రి కార్యాలయాల్లో వినతిపత్రాలు ఇచ్చాం. 2017లో అప్పటి సీఎం చంద్రబాబు, వాల్మీకులను ఎస్టీ జాబితాలో కలపాలని అసెంబ్లీలో ఏకగ్రీవంగా బిల్లు పాస్ చేసి కేంద్రానికి పంపారు. ఆ బిల్లును ఇప్పటివరకు కేంద్రం ఆమోదించలేదు' అని శ్రీనివాసులు ఆవేదన వ్యక్తం చేశారు.

అత్యంత ప్రతిభావంతమైన మహిళగా జ్యోత్స్న

- మేరీల్యాండ్‌లో ఘనంగా సన్మానించిన ఎన్ఆర్ఐ తెలుగు మహిళలు

అమరావతి, మార్చి 14(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ జాతీయ అధికార ప్రతినిధి, ఆచార్య తిరునగరి జ్యోత్స్న అత్యంత ప్రతిభావంతమైన మహిళగా ఎంపికయ్యారు. అమెరికన్ మల్టీ ఎత్నిక్ కమిషన్(ఏఎంఈసీ) వివిధ రంగాల్లో అత్యంత ప్రతిభావంతులైన 20 మంది మహిళలను ఎంపిక చేసింది. మహిళా సాధికారి, హక్కులు, లింగ సమానత్వం కోసం జ్యోత్స్న చేసిన చిరస్మరణీయ కృషిని గుర్తిస్తూ ఈ అవార్డుకు ఎంపిక చేశారు. యూఎస్ క్యాపిటల్ హిల్, వాషింగ్టన్ డీసీలో జరిగిన ఏఎంఈసీ 13 వార్షిక సమ్మేళనంలో అమెరికా కాంగ్రెస్ సభ్యులు డానీ డెవిస్, జోనాథన్ జాక్సన్ సంయుక్తంగా జ్యోత్స్నకు అవార్డును అందించారు. ఈ నేపథ్యంలో మేరీల్యాండ్‌లో శుక్రవారం ఎన్ఆర్ఐ తెలుగు మహిళలను ఆమెను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా జ్యోత్స్న మాట్లాడుతూ... 'భారతీయ సంస్కృతి ప్రపంచానికే ఆదర్శం. ప్రపంచవ్యాప్తంగా తెలుగు మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారు. కుటుంబ బాధ్యతలు మోస్తూ, సామాజికంగా అద్భుతమైన ప్రగతిని సాధిస్తున్నారు. ఏపీలో సీఎం చంద్రబాబు మహిళలకు పెద్దపీట వేసి అనేక అవకాశాలు కల్పిస్తున్నారు' అని అన్నారు. భాను మాగులూరి, కిషోర్ కంచెర్ల సన్మాన కార్యక్రమాన్ని సమన్వయం చేశారు.

'నైపుణ్య శిక్షణ'కు 'సీడాప్' తూట్లు!

- యువత ఉపాధి కల్పనపై నీలినీడలు
- అర్ధంతరంగా 13 పీఏఐల తొలగింపు
- ఈ ఏడాది లక్ష మందికి శిక్షణ కష్టమే
- వైసీపీకి పనిచేసిన వ్యక్తికి పెద్దపీట

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

నైపుణ్యాభివృద్ధి శాఖలో భాగంగా ఉన్న సొసైటీ ఫర్ ఎంప్లాయిమెంట్ జనరేషన్ అండ్ ఎంటర్‌ప్రైజ్ డెవలప్‌మెంట్ ఇన్ ఏపీ(సీడాప్) గత కొన్నేళ్లుగా యువతకు ఉచితంగా శిక్షణ కార్యక్రమాలు నిర్వహించి, ఉపాధి అవకాశం కల్పిస్తోంది. కేంద్ర ప్రభుత్వ పథకం దీన్‌దయాళ్ ఉపాధ్యాయ గ్రామీణ్ కౌశల్య యోజన(డీడీయూ-జీకేవై) ద్వారా ఈ కార్యక్రమాలు నిర్వహిస్తోంది. ఈ శిక్షణ కార్యక్రమాల అమలుకు 2016, 2019లో ప్రోగ్రామ్ ఇంప్లిమెంటేషన్ ఏజెన్సీ(పీఐఏ)లను ఎంప్యానెల్ చేశారు. మొత్తం 41 పీఐఏలు రాష్ట్రవ్యాప్తంగా నిరుద్యోగ యువతకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయి. అందుకుగాను ఒక్కో వ్యక్తికి సగటున రూ.50వేల చొప్పున పీఐఏలకు వెళ్తాయి. యువతకు శిక్షణతో పాటు భోజనం, రవాణా ఖర్చులు, ఉపాధి కల్పన, ఉద్యోగం వచ్చాక మొదటి రెండు నెలల సహకారం అందించడం పీఐఏల బాధ్యత. వివిధ చేతి వృత్తులు, ఇతర కోర్సులపై 3, 4, 6 నెలల పాటు వేర్వేరు శిక్షణ కార్యక్రమాలను పీఐఏలు నిర్వహిస్తాయి. అయితే కొందరికి మేలు చేసే ఉద్దేశంతో అకస్మాత్తుగా 13 పీఐఏలను ఇటీవల సీడాప్ తొలగించింది. ప్రాజెక్టు అప్రూవల్ కమిటీ(పీఏసీ)లో పెట్టి తొలగించినట్లు వారికి సమాచారం ఇచ్చింది. అయితే తొలగించే ముందు వారికి కనీసం నోటీసులు కూడా జారీచేయలేదు. అలాగే వారి వివరణ కూడా తీసుకోలేదు. సీడాప్ అధికారులు సొంతంగా తీసుకున్న ఈ నిర్ణయాన్ని ఉన్నతాధికారులు వ్యతిరేకించినట్లు తెలిసింది. కానీ మంత్రి నారా లోకేశ్ పేషీలోని ఓ అధికారి, సీడాప్‌లో ఓ కీలక అధికారి, మరో రాష్ట్ర స్థాయి మిషన్ మేనేజర్ కలిసి ఉద్దేశపూర్వకంగా ఈ పీఐఏలను తొలగించినట్లు ప్రచారం జరుగుతోంది.

> సీడాప్ ద్వారా ఐదేళ్లలో 25లక్షల మందికి ఉపాధి కల్పించాలి.. ఇదీ ప్రభుత్వ లక్ష్యం! ఈ లక్ష్యానికి సీడాప్ తూట్లు పొడుస్తోంది. ఏడాదికి లక్ష మంది చొప్పున శిక్షణ ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకోగా అర్ధంతరంగా 13 ప్రోగ్రామ్ ఇంప్లిమెంటేషన్ ఏజెన్సీలను తొలగించి శిక్షణ కార్యక్రమాలు వేగంగా సాగకుండా బ్రేక్ వేసింది. మిగిలిన పీఐఏలకు లాభం చేయడం కోసమే ఉద్దేశపూర్వకంగా 13 పీఐఏలను తొలగించారనే విమర్శలు వస్తున్నాయి. అందులోనూ గత ప్రభుత్వంలో వైసీపీకి బహిరంగంగా ప్రచారం చేసిన ఓ వ్యక్తిని తీసుకొచ్చి పెద్దపీట వేయడం మరిన్ని అనుమానాలకు తావిస్తోంది.

వందల కోట్లతో శిక్షణ

పెద్దగా ప్రచారం లేకపోయినా సీడాప్ ఏటా వందల కోట్లతో శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తోంది. అవి కూడా కేంద్ర ప్రభుత్వ పథక నిధులు కావడంతో ఎలాంటి అడ్డంకులూ లేకుండా శిక్షణ కార్యక్రమాలు జరుగుతున్నాయి. ఏడాదికి కనీసం రూ.200 కోట్లకు పైగా బిల్లులు పీఐఏలకు వెళ్తున్నాయి. వాటిలో ఎక్కువ శాతం తమకే రావాలని కొందరు ప్లాన్ చేసినట్లు తెలిసింది. నిబంధనల ప్రకారం సీడాప్‌లో శిక్షణ కార్యక్రమాలకు ఎంప్యానల్ కావాలంటే జాతీయ గ్రామీణాభివృద్ధి సంస్థ(ఎన్ఐఆర్‌డీ) సిఫారసు చేయాలి. ఖమ్మం జిల్లాకు చెందిన ఓ వ్యక్తి గత ప్రభుత్వంలో సీడాప్‌లో చక్రం తిప్పారు. ఇటీవల ఆయన పీఐఏను ఎన్ఐఆర్‌డీ బ్లాక్ లిస్టులో పెట్టింది. ఆ వెంటనే పేరు మార్చుకుని మరో పీఐఏ ద్వారా మళ్లీ సీడాప్‌లోకి వచ్చారు. ఎన్నికల సమయంలో అనంతపురంలో ఆయన వైసీపీ అభ్యర్థులకు బహిరంగంగా మద్దతు పలికారు. పలుమార్లు అప్పటి సీఎం జగన్‌ను కలిశారు. ప్రభుత్వం మారగానే ఉత్తరాంధ్రలో ఓ ఎంపీ ద్వారా మంత్రి లోకేశ్‌ను ప్రసన్నం చేసుకునే ప్రయత్నాలు మొదలుపెట్టారు. అలాటి వ్యక్తికి ఎక్కువ ఆదాయం కట్టబట్టేలా సీడాప్ పెద్దపీట వేయడం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. ఎలాగైనా ఈ ఏడాది లక్ష మందికి శిక్షణ ఇప్పించి ఉపాధి కల్పించాలని సీడాప్ లక్ష్యంగా పెట్టుకుంది. ఐదేళ్లలో 25లక్షల మందికి ఉపాధి కల్పించాలనే ప్రభుత్వ లక్ష్యంలో భాగంగా ఈ మేరకు సీడాప్ తన లక్ష్యాన్ని నిర్దేశించుకుంది. ఎక్కువ పీఐఏలు ఉంటే రాష్ట్రవ్యాప్తంగా నిరుద్యోగ యువతను, వారి ఆసక్తులను గుర్తించి శిక్షణ ఇచ్చే అవకాశం ఉంటుంది. కానీ ఇప్పుడు కొందరిని తొలగించడం వల్ల మిగిలిన 28 పీఐఏలతో లక్ష మంది శిక్షణ ఇవ్వడం ఎలా సాధ్యమని సీడాప్ వర్గాలు అంటున్నాయి.

ఏపీలో బ్రాండెడ్ మద్యం

తెలంగాణలో తగ్గిన అమ్మకాలు!

- డిసెంబరు, జనవరి, ఫిబ్రవరి నెలల్లో రూ.9,438 కోట్ల మద్యం అమ్మకాలు
- గతంలో ఇదే సమయంలో 10,542 కోట్లు

హైదరాబాద్, మార్చి 14(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌లో అమల్లోకి వచ్చిన కొత్త మద్యం విధానంతో అన్ని రకాల బ్రాండ్‌ల మద్యం దొరుకుతోంది. ఆ ప్రభావం తెలంగాణ మద్యం విక్రయాలపై పడిందని ఎక్సైజ్ అధికారులు చెబుతున్నారు. రాష్ట్రంలో 3నెలలుగా మద్యం విక్రయాలు 'మత్తు'గా సాగుతున్నాయి. అమ్మకాలు, ఆదాయం రెండూ తగ్గిపోయాయి. ఈ ఏడాది జనవరి, ఫిబ్రవరి నెలలకు గతేడాది ఇవే నెలలతో పాటు 2024 డిసెంబరు, అంతకుముందు అదే నెలతో పోలిస్తే వరసగా అమ్మకాలు తగ్గడంతో అధికారులు ఆందోళన చెందుతున్నారు. ఏటా మద్యం, బీర్ల అమ్మకాలు పెరుగుతుండగా.. ఈసారి మాత్రం మూడు నెలల్లోనే రూ.1104 కోట్ల విలువైన అమ్మకాలు తగ్గాయి. ఆంధ్రప్రదేశ్‌లో గతంలో వైసీపీ ప్రభుత్వం ఉన్నప్పుడు పేరున్న సంస్థల మద్యం విక్రయించేవారు కాదు. అక్కడ బ్రాండెడ్ మద్యం దొరక్కపోవడంతో సరిహద్దు జిల్లాలైన నల్లగొండ, ఖమ్మం, మహబూబ్‌నగర్‌ల నుంచి ఏపీవాసులు మద్యాన్ని కొనుగోలు చేసేవారు. దీంతో తెలంగాణలో మద్యం విక్రయాలు పెరిగాయి. కల్తీ కల్లు, మద్యం, నాటుసారాను సరిగా నియంత్రించకపోవడం కూడా మద్యం విక్రయాలు తగ్గడానికి ఓ కారణమైంది. పలు మద్యం దుకాణాల్లో ఎమ్మార్పీ కంటే ఎక్కువ ధరకు విక్రయిస్తుండడంతో మద్యం ప్రియులు ప్రత్యామ్నాయంగా గంజాయి, ఇతర మాదకద్రవ్యాలకు అలవాటు పడుతున్నారు. మద్యం అమ్మకాలు తగ్గడానికి ఇదీ ఓ కారణమని అధికారులు అంటున్నారు. మద్యం, బీర్ల విక్రయాలు పెరిగితే అదే రీతిలో ప్రభుత్వానికి ఆదాయం కూడా పెరుగుతుంది. కానీ, గత మూడు నెలలుగా మద్యం విక్రయాలు తగ్గాయి. ఎక్సైజ్ శాఖ లెక్కల ప్రకారం.. డిసెంబరు, జనవరి, ఫిబ్రవరి నెలల్లో రూ.9,438 కోట్ల మద్యం విక్రయాలు జరగ్గా, గత ఏడాది ఇదే సమయంలో రూ.10,542 కోట్ల విలువైన అమ్మకాలు జరిగాయి. అంటే రూ.1104కోట్ల అమ్మకాలు తగ్గాయి. భారీగా అమ్మకాలు తగ్గడంతో ఆ శాఖ అధికారుల్లో ఆందోళన మొదలైంది. ఈ ఏడాది శాఖకు కేటాయించిన ఆదాయ లక్ష్యాన్ని చేరుకుంటామో లేదోనన్న అనుమానం వ్యక్తమవుతోంది.

దేవేంద్ర, చుక్కా శిల్పలకు బెయిల్ ఇవ్వలేం

- ఎన్ఐఏ ఆరోపణలకు ఆధారాలున్నాయ్: హైకోర్టు
- ఆ ఇద్దరికీ మావోయిస్టు పార్టీతో సంబంధం లేదు
- సీనియర్ న్యాయవాది సత్యప్రసాద్ వాదనలు
- దేవేంద్ర, శిల్ప అప్పీళ్లను కొట్టివేసిన ధర్మాసనం

అమరావతి, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) నమోదు చేసిన కేసులో చైతన్య మహిళా సంఘానికి చెందిన డొంగరి దేవేంద్ర, చుక్కా శిల్పలకు బెయిల్ నిరాకరిస్తూ విశాఖపట్నం మూడో అదనపు జిల్లా కోర్టు ఇచ్చిన ఉత్తర్వుల్లో జోక్యం చేసుకునేందుకు హైకోర్టు నిరాకరించింది. నేర తీవ్రత దృష్ట్యా వీరిద్దరికీ బెయిల్ ఇవ్వలేమని తేల్చిచెప్పింది. విశాఖ కోర్టు ఉత్తర్వులను సవాల్ చేస్తూ వారు వేసిన అప్పీళ్లను కొట్టివేసింది. ఈ మేరకు న్యాయమూర్తులు జస్టిస్ కె.సురేశ్‌రెడ్డి, జస్టిస్ జస్టిస్ టి.చంద్ర ధనశేఖర్‌తో కూడిన ధర్మాసనం ఇటీవల తీర్పు ఇచ్చింది. చైతన్య మహిళా సంఘానికి చెందిన డొంగరి దేవేంద్ర, చుక్కా శిల్ప తన కుమార్తె రాధకు మావోయిస్టు భావజాలాన్ని నూరిపోసి బలవంతంగా మావోయిస్టు పార్టీలో చేర్పించారని తల్లి పల్లెపాటి పోచమ్మ 2021 డిసెంబరులో పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీని ఆధారంగా ఉమ్మడి విశాఖ జిల్లా పెద్దబయలు పోలీసులు వారిద్దరిపై ఐపీసీ, ఉపా చట్టం కింద 2022 జనవరిలో కేసు నమోదు చేశారు. నేర తీవ్రత దృష్ట్యా ఈ కేసు దర్యాప్తును స్వీకరించిన ఎన్ఐఏ విచారణ పూర్తి చేసి సంబంధిత కోర్టులో చార్జిషీటు దాఖలు చేసింది. దేవేంద్ర, శిల్ప బెయిల్ కోసం పిటిషన్లు వేయగా.. విశాఖపట్నం మూడో అదనపు జిల్లా కోర్టు తిరస్కరించింది. ఈ ఉత్తర్వులను సవాల్ చేస్తూ వారు హైకోర్టులో అప్పీల్ వేశారు. వారి తరఫున సీనియర్ న్యాయవాది ఎ.సత్యప్రసాద్ వాదనలు వినిపించారు. 'తన కుమార్తెను బలవంతంగా తీసుకెళ్లి 2017లో మావోయిస్టు పార్టీలో చేర్పించారని రాధ తల్లి ఫిర్యాదులో పేర్కొన్నారు. డొంగరి దేవేంద్ర, చుక్కా శిల్ప చైతన్య మహిళా సంఘానికి చెందినవారని పోలీసులే చెబుతున్నారు. ఈ సంఘం నిషేధిత జాబితాలో లేదు. వీరిద్దరికీ మావోయిస్టు పార్టీతో సంబంధాలు ఉన్నాయని చెప్పేందుకు ఎలాంటి ఆధారాలూ లేవు. బెయిల్ మంజూరు చేయండి' అని కోరారు. ఎన్ఐఏ తరఫున డిప్యూటీ సొలిసిటర్ జనరల్ (డీఎస్‌జీ) పసల పొన్నారావు వాదనలు వినిపించారు. చైతన్య మహిళా సంఘం నిషేధిత జాబితాలో లేనప్పటికీ పిటిషనర్లు మావోయిస్టు పార్టీలో చురుకైన పాత్ర పోషిస్తున్నారని, ఇందుకు సంబంధించి ఎన్ఐఏ సాక్ష్యాధారాలు సేకరించిందని తెలిపారు. ఇరుపక్షాల వాదనలు పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం ఆ అప్పీళ్లను కొట్టివేస్తున్నట్లు ప్రకటించింది.

డీఎస్పీలను నియమించాలి: బహుజన సేన

న్యూఢిల్లీ, మార్చి 14(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీల కేసుల సత్వర పరిష్కారం కోసం ప్రత్యేక సెల్ ఏర్పాటు చేసి డీఎస్పీలను కేటాయించాలని బహుజన సేన రాష్ట్ర అధ్యక్షుడు శ్రీచందు డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. 'గత వైసీపీ ప్రభుత్వ రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ ప్రత్యేక పోలీసు స్టేషన్లలోని 98 డీఎస్పీ పోస్టులను రద్దు చేసింది. రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ కేసుల విచారణ కాలపరిమితి రోజురోజుకూ పెరిగిపోతోంది' అని చందు అన్నారు.

చిత్రజ్యోతి

SINCE 1965

పాతికేళ్ల కల నెరవేరింది



శివాజీ

'కోర్ట్' సినిమాకు ప్రేక్షకుల నుంచి వస్తున్న అద్భుతమైన స్పందన చాలా ఆనందాన్ని ఇచ్చింది. నా 25 ఏళ్ల కల 'మంగపతి' పాత్రతో నెరవేరింది' అని అన్నారు నటుడు శివాజీ. ప్రియదర్శి ప్రధాన పాత్రలో రామ్ జగదీశ్ దర్శకత్వంలో వచ్చిన చిత్రం 'కోర్ట్-స్టేట్ వర్సెస్ ఎ నోబడీ'. ప్రశాంతి తిపిర్నేని నిర్మించారు. దీప్తి గంటా సహ నిర్మాతగా వ్యవహరించారు. ఈ శుక్రవారం విడుదలైన ఈ చిత్రానికి ప్రేక్షకుల నుంచి మంచి స్పందన లభిస్తోంది. ఈ సందర్భంగా నటుడు శివాజీ మీడియాతో మాట్లాడుతూ 'మంగపతి పాత్ర నా కోసమే పుట్టిందని భావిస్తున్నాను. ఈ పాత్రలో సహజమైన భావోద్వేగం ఉంది. ప్రతి కుటుంబంలో ఇలాంటి స్వభావమున్న వ్యక్తి ఉంటారు. నాని గారు నటుడిగా నిరూపించుకొని, ఇప్పుడు నిర్మాతగానూ రాణిస్తున్నారు. కొత్త నటీనటులను ప్రోత్సహించడంలోనూ చొరవ చూపిస్తున్నారు. కోర్ట్ సినిమా బాగోకపోతే తన 'హిట్ 3' చిత్రాన్ని చూడొద్దంటూ సవాలు విసరడం మామూలు విషయం కాదు' అని అన్నారు.



చిరంజీవికి అరుదైన గౌరవం

టాలీవుడ్ కథానాయకుడు చిరంజీవికి అరుదైన గౌరవం దక్కింది. నాలుగు దశాబ్దాలకు పైగా సినీ రంగానికి అందిస్తోన్న విశేష సేవలను గుర్తిస్తూ ఆయన్ను హౌస్ ఆఫ్ కామన్స్ ..యూకే పార్లమెంట్ ఘనంగా సత్కరించనుంది. యూకే అధికార లేబర్ పార్టీ ఎంపీ నవేందు మిశ్రా ఆధ్వర్యంలో ఈనెల 19న ఈ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించనున్నారు. పలువురు యూకే పార్లమెంట్ సభ్యులు, సినీ ప్రముఖులు ఈ కార్యక్రమానికి హాజరు కానున్నారు. అదే వేదికపై బ్రిడ్జ్ ఇండియా సంస్థ కూడా చిరంజీవిని సత్కరించనుంది. సినిమా, ప్రజాసేవలో చిరంజీవి చేసిన సేవా కార్యక్రమాలకు గుర్తింపుగా 'జీవిత సాఫల్య పురస్కారం' ప్రదానం చేయనున్నారు. ఈ సందర్భంగా పలువురు సినీ ప్రముఖులు చిరంజీవికి అభినందనలు తెలిపారు.



కొత్త తేదీన హరిహర వీరమల్లు

ఈ ఏడాది విడుదల కానున్న భారీ చిత్రాల్లో 'హరి హర వీరమల్లు' ఒకటి. పవన్ కల్యాణ్ కథానాయకుడు. జ్యోతి కృష్ణ దర్శకుడు. ఏ.ఎం.రత్నం సమర్పణలో ఏ.దయాకర్‌రావు నిర్మిస్తున్నారు. ఈ చిత్రంపై అభిమానుల అంచనాలు తారస్థాయిలో ఉన్నాయి. యోధుడు వీరమల్లు పాత్రలో పవన్ కల్యాణ్ నటిస్తున్నారు. మొఘల్ రాజుల నుంచి కోహినూర్ వజ్రాన్ని చేజిక్కించుకోవడంతో పాటు, ప్రేక్షకుల మనసు దోచుకునేందుకు వీరమల్లు సిద్ధమవుతున్నారు. అభిమానులంతా ఎంతగానో ఎదురుచూస్తున్న ఈ చిత్రాన్ని మొదట మార్చి 28న విడుదల చేయాలని అనుకున్నారు. కానీ నిర్మాణానంతర కార్యక్రమాలు కొనసాగుతున్నందున విడుదలను వాయిదా వేశారు. ఈ ఏడాది మే 9న తెలుగు, హిందీ, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో ప్రపంచవ్యాప్తంగా విడుదల చేస్తున్నట్లు మేకర్స్ శుక్రవారం తెలిపారు.

ఆ అల్లకల్లోలానికి కారణమేంటి?



నందమూరి కల్యాణ్ రామ్, విజయశాంతి ప్రధాన పాత్రల్లో ప్రదీప్ చిలుకూరి దర్శకత్వంలో అశోక్ వర్ధన్ ముప్పా, సునీల్ బలుసు తెరకెక్కిస్తోన్న చిత్రం 'అర్జున్ సన్నాఫ్ వైజయంతి'. ఈ చిత్రంలో విజయశాంతి శక్తిమంతమైన పాత్రలో కనిపించనున్నారు. ఇప్పటికే విడులైన ఫస్ట్ లుక్ పోస్టర్ ప్రేక్షకుల్లో భారీ అంచనాలను పెంచింది. తాజాగా ప్రీ-టీజర్‌ను మేకర్స్ విడుదల చేశారు. కల్యాణ్‌రామ్ ఒక పడవపై కూర్చుని, సముద్రం వైపు చూస్తూ కనిపిస్తున్నారు. రక్తంతో తడిసిన అతని చొక్కా, అతని జీవితం చుట్టూ ఉన్న అల్లకల్లోలాన్ని సూచిస్తోంది. పడవలు దగ్గరకు వస్తున్నప్పుడు జరగబోయే పెద్ద యుద్ధాన్ని అతని ఉగ్రరూపం హెచ్చరిస్తోంది. అజనీష్ లోక్‌నాథ్ స్వరపరచిన నేపథ్య సంగీతం అద్భుతంగా ఉంది. ఈనెల 17న టీజర్‌ని విడుదల చేయనున్నట్లు చిత్రబృందం పేర్కొంది.

మోదీ, ట్రంప్‌నకు పుతిన్ కృతజ్ఞతలు

» ఉక్రెయిన్-రష్యా సంక్షోభ పరిష్కారంలో చొరవపై హర్షం



మాస్కో, మార్చి14: ఉక్రెయిన్-రష్యా సంక్షోభ పరిష్కారంలో చొరవ తీసుకున్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌నకు రష్యా అధ్యక్షుడు పుతిన్ ధన్యవాదాలు తెలిపారు. చైనా అధ్యక్షుడు జిన్ పింగ్, బ్రెజిల్, దక్షిణాఫ్రికా అధ్యక్షులు కూడా ఈ సంక్షోభ పరిష్కారానికి సమయం ఇచ్చారని గుర్తు చేస్తూ వారికి కూడా కృతజ్ఞతలు తెలిపారు. ఇది యుద్ధాల సమయం కాదని, భారత్ ఎప్పుడూ శాంతినే కోరుకుంటుందని పుతిన్ సమక్షంలోనే మోదీ గతంలో చెప్పారు. మరోవైపు ట్రంప్ అధికారంలోకి రాగానే ఉక్రెయిన్-రష్యా యుద్ధాన్ని విరమింపచేసేందుకు తీవ్రంగా కృషి చేశారు. 30 రోజుల కాల్పుల విరమణ ఒప్పందాన్ని ప్రతిపాదించారు. దీనికి ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ వెనువెంటనే సమ్మతి తెలపగా పుతిన్ ఎట్టకేలకూ అంగీకారం తెలిపారు. అయితే కాల్పుల ఒప్పందం శాశ్వత శాంతికి దారి తీయాలని కోరుకుంటున్నట్లు చెప్పారు. మరోవైపు పుతిన్‌తో చర్చలు ఫలప్రదంగా జరిగాయని ట్రంప్ చెప్పారు. చర్చల సందర్భంగా కుర్స్క్ ప్రాంతంలో రష్యా సైన్యం చుట్టుముట్టిన వేలాది మంది ఉక్రెయిన్ సైనికుల ప్రాణాలు కాపాడాలని పుతిన్‌ను గట్టిగా కోరానన్నారు. దీనిపై సానుకూలంగా స్పందించిన పుతిన్ ఉక్రెయిన్ సైనికులను లొంగిపోవాలని కోరారు. ట్రంప్ విజ్ఞప్తిని సానుభూతితో అర్థం చేసుకున్నామంటూ టెలివిజన్ సందేశంలో తెలిపారు. ఉక్రెయిన్ సైనికులు ఆయుధాలు అప్పగించి లొంగిపోతే వారి ప్రాణాలకు హామీ ఇస్తామన్నారు. ఉక్రెయిన్ సైనికులతో గౌరవంగా వ్యవహరిస్తామని పుతిన్ హామీ ఇచ్చారు.

అర్మేనియా, అజర్‌బైజాన్ మధ్య శాంతి ఒప్పందం

టిబిలిసీ/బాకూ, మార్చి 14: నాలుగు దశాబ్దాల వైరానికి సోవియట్ పూర్వ దేశాలు అర్మేనియా, అజర్‌బైజన్ తెర దించేందుకు సిద్ధమవుతున్నాయి. ఎట్టకేలకు శాంతి ఒప్పంద ముసాయిదాను ఇరుదేశాలు ఆమోదించాయి. ఇక ఆ పత్రాలపై సంతకాలు చేయడమే తరువాయి. అర్మేనియా, అజర్‌బైజన్ 1980ల నుంచి ఎడతెరిపి లేకుండా తలపడుతున్నాయి. నగోర్నో- కరాబఖ్ ప్రాంతం అజర్‌బైజన్ పరిధిలో ఉన్నా సంస్కృతిపరంగా అర్మేనియాకు దగ్గరగా ఉంటుంది. ఈ ప్రాంతం అర్మేనియా సాయంతో అజర్‌బైజన్ నుంచి విడిపోవడంతో ఈ రెండు దేశాల మధ్య ఘర్షణలు భగ్గుమన్నాయి. ఇటీవల ఆ భూభాగాన్ని బలప్రయోగం ద్వారా అజర్‌బైజన్ తిరిగి తనలో విలీనం చేసుకుంది. శాంతి ఒప్పందంపై ఒకసారి సంతకాలు పూర్తయితే ఇరుదేశాల మధ్య తిరిగి రాకపోకలు మొదలవుతాయని అర్మేనియా విదేశాంగ మంత్రిత్వ శాఖ తెలిపింది. ఒప్పంద పత్రం ముసాయిదాకు తమ వైపు నుంచి సమ్మతి తెలిపామని వివరించింది. శాంతి ప్రక్రియ పట్ల సంతృప్తితో ఉన్నామని అజర్‌బైజన్ విదేశాంగ మంత్రిత్వ శాఖ తెలిపింది.

రష్యా ఆయిల్‌కు చైనా కంపెనీలు దూరం!

న్యూఢిల్లీ, మార్చి 14: రష్యాపై అగ్రరాజ్యం అమెరికా ఇటీవల ఆంక్షలు విధించిన నేపథ్యంలో ఆ దేశం నుంచి చమురును కొనుగోలు చేసే విషయంలో చైనా చమురు కంపెనీలు పునరాలోచనలో పడుతున్నాయి. అయితే ఈ నెలలో రెండు చైనా కంపెనీలు ముడిచమురు కొనుగోళ్లను నిలిపివేయగా మరో రెండు కంపెనీలు తమ కొనుగోలు పరిమాణాన్ని తగ్గించుకున్నట్టు ట్రేడ్ వర్గాల ద్వారా తెలుస్తోంది. మాస్కో చమురు రాబడిని దెబ్బతీసే చర్యల్లో భాగంగా రష్యా చమురు ఉత్పత్తిదారులు, బీమా సంస్థలు, ఓడలపై గత జనవరిలో అమెరికా ఆంక్షలు విధించింది. ఈ నేపథ్యంలో అతిపెద్ద కొనుగోలు దేశాలైన భారత్, చైనాలకు రష్యా ఆయిల్ సరఫరాలు తగ్గుముఖం పట్టాయి.

గాజాలో ఇజ్రాయెల్ నరమేధానికి పాల్పడింది

» ఐక్యరాజ్యసమితి మానవ హక్కుల మండలి నివేదిక

జెనీవా, మార్చి14: హమా‌స్‌పై ప్రతీకార దాడుల్లో భాగంగా గాజాలో పాలస్తీనా మహిళలపై ఇజ్రాయెల్ బలగాలు అత్యాచారం, లైంగిక హింసకు పాల్పడినట్లు ఐక్యరాజ్యసమితి మానవ హక్కుల మండలి నివేదికలో పేర్కొంది. క్రమపద్ధతిలో ఓ జాతిని అంతమొందించేందుకు ఇజ్రాయెల్ యత్నించిందని ఆరోపించింది. పౌరప్రాంతాలపై భారీ పేలుడు పదార్థాల వినియోగంతో ఇజ్రాయెల్ నరమేధానికి పాల్పడిందని నివేదికలో పేర్కొంది. ఈ నివేదికపై ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు మండిపడ్డారు. ఇజ్రాయెల్‌కు వ్యతిరేకంగా ఏకపక్షంగా ఇచ్చిన నివేదికగా పేర్కొన్నారు. ఉగ్రవాదులకు అనుకూలంగా ఇచ్చిన నివేదికగా ఆయన అభివర్ణించారు. ఐక్యరాజ్యసమితిలో అమెరికా ప్రతినిధి స్టెఫానిక్ కూడా మానవ హక్కుల మండలి నివేదికను తప్పుబట్టారు. ఇదిలా ఉండగా, పాలస్తీనాకు అనుకూలంగా గతేడాది నిరసనలకు దిగిన విద్యార్థులపై కొలంబియా యూనివర్సిటీ కొరడా ఝుళిపించింది. ఆందోళనల్లో భాగంగా వర్సిటీ క్యాంపస్ భవనాలను ఆక్రమించిన వారికి వివిధ రకాల శిక్షలు విధించినట్లు గురువారం తెలిపింది. సంవత్సరాల తరబడి సస్పెన్షన్లు, తాత్కాలికంగా డిగ్రీ రద్దు చేయడం, క్యాంపస్ నుంచి బహిష్కరణ తదితర ఆంక్షలు విధించినట్లు ప్రకటించింది.

ఐసిస్ అగ్ర నాయకుడు అబూ ఖదీజా హతం

బాగ్దాద్, మార్చి 14: ఉగ్రవాద సంస్థ ఐసిస్‌కు భారీ ఎదురుదెబ్బ తగిలింది. ఆ సంస్థ అగ్రనాయకుడు అబ్దుల్లా ముకి ముస్లేహ్ అల్ రిఫాయ్ అలియాస్ అబూ ఖదీజా హతమయ్యాడు. అతడిని డిప్యూటీ ఖలీఫాగా కూడా వ్యవహరిస్తుంటారు. ఈ విషయాన్ని శుక్రవారం ఇరాక్ ప్రధాని మహమ్మద్ షియా అల్ సుదాని ప్రకటించారు. అమెరికా సాయంతో పనిచేస్తున్న ఇరాకీ దళాలు ఆయనను మట్టుపెట్టినట్టు తెలిపారు. అబూ ఖదీజా చాలా ప్రమాదకర ఉగ్రవాది అని, ఐసిస్ సంస్థ విదేశీ వ్యవహారాలను చూసేవాడని చెప్పారు. అతడి మరణం శాంతికాముకులకు పెద్ద విజయమని అభివర్ణించారు.

రన్యా రావుకు బెయిల్ నిరాకరణ

బెంగళూరు, మార్చి 14: బంగారం స్మగ్లింగ్ కేసులో కన్నడ నటి రన్యా రావుకు ఆర్థిక నేరాల ప్రత్యేక కోర్టు బెయిల్ నిరాకరించింది. కేసులో ఉన్న అభియోగాల తీవ్రత దృష్ట్యా బెయిల్ అభ్యర్థనను తిరస్కరిస్తున్నట్లు పేర్కొంది. ఆమె జ్యుడీషియల్ కస్టడీలోనే ఉండాలన్న ప్రాసిక్యూషన్ వాదనను జడ్జి విశ్వనాథ్ గౌడార్ సమర్థించారు. మార్చి 4న బెంగళూరు ఎయిర్‌పోర్టులో 14.8 కిలోల అక్రమ బంగారంతో అరెస్టయిన తర్వాత రన్యా రావు బెయిల్ కోసం మొదట మెజిస్ట్రేట్ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. అక్కడ బెయిల్ తిరస్కరించడంతో ఆర్థిక నేరాల ప్రత్యేక కోర్టులో బెయిల్ కోసం పిటిషన్ వేశారు. ఇప్పుడు ఇక్కడ కూడా బెయిల్ రాకపోవడంతో ఆమె లాయర్లు సెషన్స్ కోర్టును ఆశ్రయించాలని నిర్ణయించారు.

పోక్సో కేసులో యడియూరప్పకు ఊరట

బెంగళూరు, మార్చి 14(ఆంధ్రజ్యోతి): పోక్సో కేసును ఎదుర్కొంటున్న బీజేపీ కీలకనేత, మాజీ ముఖ్యమంత్రి యడియూరప్పకు ఊరట లభించింది. విచారణకు శనివారం తప్పక హాజరు కావాలని బెంగళూరు ఒకటో ఫాస్ట్‌ట్రాక్ కోర్టు జారీ చేసిన సమన్లపై హైకోర్టు శుక్రవారం స్టే విధించింది. విచారణకు తప్పనిసరి హాజరు నుంచి యడియూరప్పకు వినహాయింపు ఇచ్చింది. సమస్యను చెప్పుకునేందుకు వెళ్లిన సమయంలో యడియూరప్ప తన కూతురితో అనుచితంగా ప్రవర్తించారని ఓ మహిళ చేసిన ఫిర్యాదు మేరకు 2024 ఫిబ్రవరి 2న యడియూరప్పపై పోక్సో కేసు నమోదైంది.

వలపు వలలో రక్షణ ఉద్యోగి..యూపీలో అరెస్టు

న్యూఢిల్లీ, మార్చి 14: ఓ మహిళ విసిరిన వలపు వలలో చిక్కిన రక్షణ శాఖ ఉద్యోగి ఒకరు పాకిస్థాన్‌కు గూఢచారిగా మారాడు. గమనించిన ఉత్తరప్రదేశ్ యాంటీ టెర్రరిజం స్క్వాడ్ (ఏటీఎస్) పోలీసులు అరెస్టు చేశారు. ఫిరోజాబాద్ సమీపంలోని హర్జాజ్‌పూర్‌లో ఉన్న రక్షణ శాఖ పరిధిలోని ఆయుధ తయారీ కర్మాగారంలో ఛార్జ్‌మన్‌గా పనిచేస్తున్న రవీంద్ర కుమార్ పాక్‌కు కీలక సమాచారం అందించినట్టు పోలీసు వర్గాలు తెలిపాయి. అతడితో పాటు, ఆగ్రాలో ఉన్న స్నేహితుడిని కూడా అరెస్టు చేసినట్టు పేర్కొన్నాయి. అతడికి గత ఏడాది ఫేస్‌బుక్ ద్వారా నేహా శర్మ అనే మహిళతో పరిచయం ఏర్పడింది. తాను పాక్ గూఢచారి సంస్థ ఐఎస్ఐ తరఫున పనిచేసినట్టు ఆమె తెలిపింది కూడా. అయినా ఆమె విసిరిన వలపు వలలో చిక్కుకొని, డబ్బుకు ఆశపడి వాట్సప్ ద్వారా పలు పత్రాలు అందజేశాడు.

పెళ్లితో మగవాళ్లు లావెక్కుతారు!

'సింగిల్స్'తో పోలిస్తే వివాహమైన వాళ్లలో 62 శాతం అధిక బరువు ప్రమాదం

» ఇది మహిళల్లో 39 శాతం మాత్రమే

» వార్సా పరిశోధకుల అధ్యయనం వెల్లడి

» పెరిగే ఆహార పరిమాణం, శారీరక శ్రమ లేకపోవడమే కారణమంటున్న నిపుణులు



వార్సా, మార్చి 14: 'అరే ఏంట్రా.. పెళ్లికి ముందు సన్నగా ఉండే వాడివి.. ఇంత లావు అయ్యావు..?' ఇలాంటి మాటలను తరచుగా వింటుంటాం. మనలోనే చాలా మందికి ఈ ప్రశ్న ఎదురై ఉంటుంది. ఇది వాస్తవమేనని అంటున్నారు శాస్త్రవేత్తలు. వివాహం కాని వారితో పోలిస్తే.. పెళ్లయిన పురుషుల్లో అధిక బరువు ప్రమాదం 62 శాతం ఎక్కువగా ఉంటుందని పోలాండ్‌లోని వార్సాకు చెందిన నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కార్డియాలజీ పరిశోధకులు వెల్లడించారు. మహిళల్లో 39 శాతం మాత్రమే ఉంటుందని అధ్యయనంలో పేర్కొన్నారు. పెళ్లి పురుషుల్లో ఊబకాయం సమస్యను మూడు రెట్లు పెంచుతుందని అధ్యయనం వెల్లడించింది. అధిక బరువు అనేది వయస్సుతో ప్రభావితమవుతుందని గుర్తించారు.

వివాహంతో 3 రెట్ల ఊబకాయం రిస్క్!

పరిశోధకులు మల్టీ-సెంటర్ నేషనల్ పాపులేషన్ హెల్త్ ఎగ్జామినేషన్ సర్వే నుంచి 2,405 మంది డేటాను పరిశీలించారు. వారి 50 ఏళ్ల వయస్సులో 35.3 శాతం మంది సాధారణ బరువు కలిగి ఉన్నారు. 38.3 శాతం మంది అధిక బరువు, 26.4 శాతం మంది ఊబకాయంతో ఉన్నారు. అధిక బరువు, వయస్సు, వైవాహిక స్థితి, మానసిక ఆరోగ్యం ఇతర అంశాల మధ్య సంబంధం ఉన్నట్లు గుర్తించారు. వివాహమైన మగవాళ్లు సింగిల్‌గా ఉన్న పురుషుల కంటే ఊబకాయం బారిన పడే ప్రమాదం 3.2 రెట్లు ఎక్కువగా ఉందని, వివాహిత మహిళలకు ఊబకాయం వచ్చే సమస్య ఎక్కువగా లేదని వెల్లడించారు. 'ఒబెసిటీ హెల్త్ అలయెన్స్' డైరెక్టర్ కాథరిన్ జెన్నెర్ మాట్లాడుతూ పురుషులు పెళ్లయిన తర్వాత తినే ఆహార పరిమాణం పెరగడం, బయట తినడం, శారీరక శ్రమ తగ్గడం వంటి కారణాలతో బరువు పెరుగుతారని పేర్కొన్నారు. అయితే సామాజికంగా ఉన్న కొన్ని ఒత్తిళ్లకు కారణంగా మహిళలు శరీర బరువు విషయంలో జాగ్రత్తగా ఉంటారని అభిప్రాయపడ్డారు.

250 కోట్ల మంది

ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా 250 కోట్ల మందిపైగా పెద్దలు, పిల్లలు అధిక బరువు లేదా ఊబకాయంతో బాధపడుతున్నారని, 1990 నుంచి ఊబకాయం రేటు రెట్టింపు కంటే ఎక్కువగా ఉంటోందని పలు అధ్యయనాలు పేర్కొన్నాయి. 2050 నాటికి, పిల్లల్లో మూడోవంతు మంది, వయోజనుల్లో సగానికి పైగా అధిక బరువు లేదా ఊబకాయం బారిన పడతారని లాన్సెట్ అధ్యయనం అంచనా వేసింది. వివాహం తర్వాత పురుషుల్లో అధికంగా కెలోరీలు తీసుకోవడం, వ్యాయామం లేకపోవడం ఫలితంగా మొదటి ఐదేళ్లలో శరీర ద్రవ్యరాశి సూచిక (బీఎంఐ) పెరుగుతుందని గత ఏడాది ఒక చైనా అధ్యయనం వెల్లడించింది. పెళ్లయిన పురుషులు సాధారంగా ఒంటరి వాళ్ల కంటే 1.4 కేజీల బరువు ఎక్కువగా ఉంటారని యూనివర్సిటీ ఆఫ్ బాత్ అధ్యయనం పేర్కొంది. పురుషులు గుండె జబ్బులు, క్యాన్సర్ వంటి కారణాలతో అకాల మరణానికి గురయ్యే అవకాశం ఎక్కువగా ఉంటుందని, ఈ పరిస్థితుల్లో బరువు అనేది ఒక కీలక అంశమని మెన్స్ హెల్త్ ఫోరం కన్సల్టెంట్ జిమ్ పోలార్డ్ అన్నారు. ఊబకాయం సమస్యను ఎదుర్కొనేందుకు మరింత లక్ష్యంతో కూడిన విధానం అవసరమని పేర్కొన్నారు.



మహారాష్ట్రలో పోటీ పరీక్షలన్నీ

ఇక మరాఠీలోనే

» మాతృభాషలోనే ఇంజనీరింగ్ పాఠ్యపుస్తకాలు కూడా: ఫడణవీస్



ముంబై, మార్చి 14: మహారాష్ట్ర పబ్లిక్ సర్వీసు కమిషన్ (ఎంపీఎస్సీ) నిర్వహించే పోటీ పరీక్షలన్నీ ఇకపై మరాఠీలోనే జరుగుతాయని ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్ ప్రకటించారు. ఇంగ్లి‌ష్‌లో పోటీ పరీక్షలు రాసేందుకు మరాఠీ భాష విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నందున ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలిపారు. శాసనమండలిలో ఒక ప్రశ్నకు సమాధానంగా ఈ విషయాన్ని వెల్లడించారు. కొన్ని ఇంజినీరింగ్, అగ్రికల్చర్ పరీక్షలను ఎందుకు మరాఠీలో నిర్వహించడం లేదంటూ శివసేన (ఠాక్రే) సభ్యుడు మిళింద్ నర్వేకర్ అడిగిన ప్రశ్నకు సమాధానంగా ఇకపై అన్ని పరీక్షలు మాతృభాషలోనే జరుగుతాయని చెప్పారు. ఎంపీఎస్సీ నిర్వహించే చాలా పరీక్షలు ఇంగ్లిష్, మరాఠీ ఉభయ భాషల్లో నిర్వహిస్తుంటారని తెలిపారు. కానీ కొన్ని టెక్నికల్ అంశాలపై మరాఠీలో పుస్తకాలు లభ్యంకానందున వాటిని ఇంగ్లి‌ష్‌లోనే జరపాలని గతంలో కోర్టులు ఆదేశాలు ఇచ్చాయని గుర్తు చేశారు. టెక్నికల్ సబ్జెక్టులకు కూడా మరాఠీలో పుస్తకాలు లభించేలా ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. నూతన విద్యావిధానం ప్రకారం మరాఠీలో కూడా ఇంజినీరింగ్ పరీక్షలు నిర్వహించేందుకు అవకాశం ఉందని చెప్పారు. నిర్దేశిత గడువులోగా ఈ లక్ష్యాన్ని చేరుకోవాలని ఎంపీఎస్సీని ఆదేశించినట్టు తెలిపారు.

భూమిపై ఏలియన్స్!

1940ల నుంచి అంతరిక్షనౌక వచ్చి వెళ్తోంది

» మన సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధిని గ్రహాంతర వాసులు పరిశీలిస్తున్నారు

» వెల్లడించిన అమెరికా నిఘా అధికారులు



న్యూఢిల్లీ, మార్చి 14: ఇప్పటి వరకు గ్రహాంతర వాసులు (ఏలియన్స్) ఉన్నారని, లేరని ఎడతెగని వాదనలు జరుగుతూనే ఉన్నాయి. కానీ ఇప్పుడు భూమిపైనే వారి ఉనికి ఉందంటూ అమెరికా నిఘా విభాగం అధికారులు సంచలన విషయం వెల్లడించారు. 'ది ఏజ్ ఆఫ్ డిస్‌క్లోజర్' పేరుతో కొత్తగా విడుదలైన ఓ డాక్యుమెంటరీలో విశ్వంలో మనతో పాటు మరో గ్రహంలోనూ జీవుల ఉనికి ఉందని వివరించారు. ఇతర గ్రహం నుంచి భూమిపైకి వచ్చే అంతరిక్ష నౌకలు (యూఏపీ) ఉన్నాయని, వాటి గురించి తమకు స్పష్టంగా తెలుసని ఆ డాక్యుమెంటరీలో 34 మంది మిలిటరీ, నిఘా అధికారులు పేర్కొన్నారు. ప్రస్తుతం భూమిపైనే గ్రహాంతరవాసుల ఉంటున్నారని వారు కుండబద్దలు కొట్టారు. ఈ విషయంపై తమకు నేరుగానే అవగాహన ఉందని ఆ డాక్యుమెంటరీలో కొంత మంది వెటరన్ అధికారులు వెల్లడించారు. సాంకేతిక పరిజ్ఞాన పరంగా మనం ఎంత అభివృద్ధి సాధించామో పరిశీలించడానికి 1940ల నుంచి ఏలియన్స్ అంతరిక్ష నౌక భూమిపైకి వచ్చి వెళుతోందని తెలిపారు. ఈ విషయాలు తెలిసి కూడా అమెరికా ప్రభుత్వం గోప్యత పాటిస్తోందంటూ విమర్శించారు. దేశ భద్రతకే ఇది పెద్ద ముప్పుగా పరిణమించబోతోందని అభిప్రాయపడ్డారు. గ్రహాంతర వాసుల యూఏపీల వేగం మన అత్యంత వేగవంతమైన ఎయిర్‌క్రాఫ్ట్‌ల కన్నా 10 రెట్లు ఎక్కువగా ఉంటుందని, వాటి వేగం గంటకు 50 వేల మైళ్లు దాటి ఉంటుందని వారు వెల్లడించారు. ఆ డాక్యుమెంటరీలో సెక్రటరీ ఆఫ్ స్టేట్ మార్కో రూబియో, న్యూయార్క్ సెనేటర్ కిర్‌స్టెన్ గిల్లిబ్రాండ్ కూడా తమ అభిప్రాయాలు వెల్లడించారు. నిఘా అధికారుల వాదనను వారు కొట్టిపారేశారు. ఆ యూఏపీలు ఖండాంతర ప్రయోగాలకు సంబంధించినవి కావచ్చని గిల్లిబ్రాండ్ అన్నారు. చైనా, రష్యా లేదా వేరే శత్రుదేశాలకు చెందినవి అయ్యుండవచ్చని ఆమె అభిప్రాయపడ్డారు. ప్రపంచ మిలిటరీ శక్తి సామర్థ్యాలను గ్రహంతర వాసులు పరిశీస్తున్నారని నమ్ముతున్నట్లు మాజీ మిలిటరీ అధికారి ఎలిజోండో చెప్పారు.

గ్రీన్‌కార్డు పొందినంత మాత్రాన

శాశ్వత నివాసం లభించదు

» ఆ విషయాన్ని అమెరికన్లమైన మేం నిర్ణయిస్తాం: జేడీ వాన్స్



న్యూఢిల్లీ, మార్చి 14: గ్రీన్‌కార్డు పొందినంత మాత్రాన వలసదారులకు అమెరికాలో శాశ్వతంగా నివసించే హక్కు లభించదని ఆ దేశ ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ అన్నారు. గురువారం ఫాక్స్ న్యూస్ మీడియా చానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడారు. గ్రీన్‌కార్డుదారులకు అమెరికాలో నిరవధికంగా ఉండే హక్కు లేదని తెలిపారు. 'ఇది భావ ప్రకటనా స్వేచ్ఛకు సంబంధించిన అంశం కాదు. నా ఉద్దేశం ప్రకారం ఇది జాతీయ భద్రతకు సంబంధించినది. అన్నిటికంటే ముఖ్యంగా మా సమాజంలోకి ఎవరిని కలుపుకోవాలనే విషయాన్ని అమెరికా పౌరులుగా మేము నిర్ణయిస్తాం. ఒక వ్యక్తి అమెరికాలో ఉండకూడదని, ఇక్కడ ఉండటానికి వారికి ఎలాంటి చట్టబద్ధమైన హక్కు లేదని దేశాధ్యక్షుడే నిర్ణయం తీసుకుంటే.. ఇక ఇందులో రెండో ఆలోచనే లేదు' అని వాన్స్ స్పష్టం చేశారు. ఇజ్రాయెల్-హమాస్ యుద్ధానికి వ్యతిరేకంగా గతంలో జరిగిన నిరసనల్లో పాల్గొన్నందుకు గ్రీన్‌కార్డుదారుడైన కొలంబియా వర్సిటీ విద్యార్థి మహమూద్ ఖలీల్‌ను పోలీసులు శనివారం అరెస్టు చేశారు. ఖలీల్ గ్రీన్‌కార్డును ట్రంప్ ప్రభుత్వం రద్దు చేసిన నేపథ్యంలో వాన్స్ ఈ వ్యాఖ్యలు చేశారు.

జన్మత: పౌరసత్వంపై సుప్రీంకోర్టుకు ట్రంప్ ప్రభుత్వం

వాషింగ్టన్, మార్చి14: జన్మత: పౌరసత్వంపై ఆంక్షలను పాక్షికంగానైనా అమలు చేయడానికి అనుమతించాల్సిందిగా అమెరికా సుప్రీంకోర్టును ట్రంప్ ప్రభుత్వం కోరింది. ఈ మేరకు ట్రంప్ సర్కారు సుప్రీంకోర్టులో గురువారం అత్యవసర పిటిషన్లు వేసింది. జన్మత: పౌరసత్వాన్ని నిషేధిస్తూ ట్రంప్ ప్రభుత్వం జారీ చేసిన ఆదేశాలపై ఇప్పటికే మేరీల్యాండ్, మసాచుసెట్స్, వాషింగ్టన్ జిల్లా జడ్జీలు నిలుపుదల ఉత్తర్వులు ఇచ్చారు.

ఇంటర్ విద్యార్థులకు ఉచితంగా ల్యాప్‌టాప్‌లు

కచ్చితంగా ద్విభాషా విధానం అమలు

తమిళనాడు ఆర్థిక మంత్రి తెన్నరసు

చెన్నై, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): తమిళనాడు వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో ప్లస్ టూ(ఇంటర్) చదివే విద్యార్థులకు ఉచితంగా ల్యాప్‌టాప్‌లు లేదా ట్యాబ్‌లు అందజేయనున్నట్టు స్టాలిన్ ప్రభుత్వం ప్రకటించింది. శుక్రవారం ఉదయం అసెంబ్లీలో బడ్జెట్ ప్రవేశపెట్టిన రాష్ట్ర ఆర్థికమంత్రి తంగం తెన్నరసు ఈమేరకు ప్రకటించారు. అదేవిధంగా తల్లిదండ్రులు లేని పిల్లలకు 18 ఏళ్లు నిండేవరకు ప్రతి నెలా రూ. 2 వేలు అందించనున్నట్టు ప్రకటించారు. చెన్నై సమీపంలో 2 వేల ఎకరాల్లో కొత్త నగరం కడతామని, సుప్రసిద్ధ ఆధ్యాత్మిక నగరమైన రామేశ్వరంలో విమానాశ్రయం నిర్మించేందుకు చర్యలు చేపడతామని పేర్కొన్నారు. పట్టణ ప్రాంతాల్లో 'కలైంజర్ కనవు ఇల్లమ్ పథకం' కింద రూ.3500 కోట్లతో లక్ష గృహాల నిర్మాణం చేపట్టనున్నట్టు ప్రకటించారు. తమిళ 'తిరుక్కురళ్'ను 45 భాషల్లోకి అనువదించనున్నట్టు ప్రకటించిన మంత్రి.. కేంద్రప్రభుత్వం ఇవ్వబోమని చెప్పిన నిధులను రాష్ట్ర ప్రభుత్వమే సమకూర్చుకుంటుందని, ఖచ్చితంగా ద్విభాషా విధానాన్నే అమలు చేస్తుందని కూడా తేల్చిచెప్పారు. ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లో చదివే 1-5 విద్యార్థులకు అల్పాహార పథకాన్ని ఇప్పటి వరకు చెన్నై, తిరువళ్లూరు జిల్లాల్లో అమలు చేస్తుండగా...ఇకపై రాష్ట్ర వ్యాప్తంగా విస్తరించనున్నట్టు ప్రకటించారు. ప్రస్తుతం ప్రభుత్వపాఠశాలల్లో ప్లస్-2 దాకా చదివి ఉన్నత విద్యా కోర్సుల్లో చేరే విద్యార్థినులకు ప్రతినెలా రూ.1000 చెల్లించే పుదుమైపెణ్, విద్యార్థులకు ఆర్థికసాయం అందించే తమిళ్‌పుదల్వన్ పథకాలను హిజ్రాలకు కూడా విస్తరింపజేయనున్నామని మంత్రి చెప్పారు.



తమిళనాడు సీఎం స్టాలిన్‌తో ఆర్థిక మంత్రి తెన్నరసు

యుద్ధం వచ్చినా బంకర్‌లో సేఫ్

యుద్ధాలు, ప్రకృతి విపత్తుల వేళ ప్రాణరక్షణ కోసం బంకర్లు.. ఒక్కో దాని ఖరీదు 2 కోట్ల డాలర్లు

» దుర్భేద్యమైన భద్రత, అత్యాధునిక సదుపాయాలు

» అమెరికా కంపెనీ 'సేఫ్' ప్రాజెక్టు

న్యూయార్క్, మార్చి 14: దేశాల మధ్య యుద్ధాలు జరిగినప్పుడు, ప్రకృతి ప్రకోపించి భారీ విపత్తులు సంభవించినప్పుడు ఎవరి ప్రాణాలకూ గ్యారెంటీ ఉండదు. సరిగ్గా.. ఇదే పాయింట్‌ను పట్టుకొని ఓ అమెరికా కంపెనీ కొత్త వ్యాపారం మొదలుపెట్టింది. అణుయుద్ధాలు జరిగినా, భయంకరమైన విపత్తులు సంభవించినా.. ప్రాణాలకు ప్రమాదం లేని అత్యంత దుర్భేద్యమైన బంకర్లను నిర్మిస్తామని, వాటిల్లో సురక్షితంగా ఉండవచ్చని ప్రకటించింది. అయితే, ఇవి సాధారణ ప్రజల కోసం కాదు.. సంపన్నులు, సెలబ్రిటీల కోసం. ఒక్కో బంకర్ ఖరీదు 2 కోట్ల డాలర్లు (రూ.172 కోట్లు). ఈ బంకర్లలో అమెరికా అధ్యక్ష భవనం వైట్‌హౌస్‌కు ఉన్నంతటి రక్షణ ఉంటుందని సదరు కంపెనీ.. 'స్ట్రాటిజికల్లీ ఆర్మర్డ్ ఫోర్టిఫైడ్ ఎన్విరాన్‌మెంట్స్' (సేఫ్) చెబుతోంది. అమెరికాలోని 50 నగరాలతోపాటు ప్రపంచవ్యాప్తంగా వెయ్యి ప్రాంతాల్లో ఈ అత్యాధునిక లగ్జరీ బంకర్లను నిర్మించబోతున్నామని ప్రకటించింది. ఈ ప్రాజెక్టుకు ఏరీ అని పేరు పెట్టింది. మొట్టమొదట అమెరికాలోని వర్జీనియాలో 625 మందికి సరిపోయే బంకర్లను వచ్చే ఏడాది నిర్మిస్తామని సేఫ్ అధిపతి అల్ కోర్బి తెలిపారు. 'వీటిలో ఉండే వారికి దేశాధినేతలకు ఉండే భద్రత కన్నా ఎక్కువ భద్రత ఉంటుంది. అత్యంత సురక్షితమైన ప్రదేశంలో ఉన్నామన్న భావన వారికి కలుగుతుంది. విపత్కర సమయాల్లో వారు తమ ఇళ్లను వదిలిపెట్టి ఇక్కడ ఎటువంటి ఆందోళన లేకుండా గడపవచ్చు' అని వివరించారు.





భూగర్భంలో సురక్షితంగా..

సేఫ్ నిర్మించబోయే బంకర్లు భూమికి 200 అడుగుల దిగువన ఉంటాయి. పేలుడు పదార్థాలు, బాంబులు కూడా ఏమీ చేయలేని దృఢత్వంతో వీటి గోడలను నిర్మిస్తారు. బంకర్లలో సురక్షితమైన హైస్పీడ్ లిఫ్టులను ఉపయోగిస్తారు. ఇక సదుపాయాల విషయానికొస్తే.. కృత్రిమమేధతో కూడిన ఆరోగ్య సదుపాయాలు, స్విమ్మింగ్ పూల్స్, డైనింగ్ సౌకర్యాలు, బయోమెట్రిక్ వ్యవస్థలు, ఇంటరాక్టివ్ టెక్నాలజీతో కూడిన గోడలు, పైకప్పు, లైటింగ్ వంటివి ఉంటాయి. ఖరీదును బట్టి సదుపాయాలు కూడా మారుతాయి. రెండు వేల అడుగుల విస్తీర్ణం నుంచి 20 వేల అడుగుల విస్తీర్ణం వరకూ రకరకాల సైజుల్లో బంకర్లు ఉంటాయి. ఏరీ ప్రాజెక్టుకు సంబంధించిన వివరాలను ఫోర్బ్స్ వెబ్‌సైట్.. 'డూమ్స్‌డే బంకర్ల' పేరుతో వెల్లడించింది.

విదేశీ ఉపగ్రహాల ప్రయోగాలతో 1,243 కోట్ల ఆర్జన

న్యూఢిల్లీ, మార్చి 14: అంతరిక్ష ప్రయోగాల్లో వరుస విజయాలు సాధిస్తున్న భారత్... వాణిజ్యపరంగానూ భారీగా విదేశీ మారకద్రవ్యాన్ని ఆర్జిస్తోంది. గత పదేళ్ల కాలంలో 34 దేశాలకు చెందిన విదేశీ ఉపగ్రహాలను ప్రయోగించడం ద్వారా రూ.1243 కోట్ల (143 మిలియన్ డాలర్లు) విదేశీ మారకద్రవ్యాన్ని ఆర్జించినట్టు కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ వెల్లడించారు. 2015 జనవరి నుంచి 2024 డిసెంబరు వరకు వాణిజ్య ప్రాతిపదికను మొత్తం 393 విదేశీ ఉపగ్రహాలు, 3 భారత కస్టమర్ ఉపగ్రహాలను ప్రయోగించినట్టు లోక్‌సభలో తెలిపారు. భారత్ ప్రయోగించిన విదేశీ ఉపగ్రహాల్లో అభివృద్ధి చెందిన దేశాలకు చెందినవి కూడా ఉన్నాయని వివరించారు. అత్యధికంగా అమెరికాకు చెందిన 232 ఉపగ్రహాలను పంపగా, ఆ తర్వాత ఇంగ్లండ్ (83), సింగపూర్ (19) దేశాలకు చెందిన ఉపగ్రహాలు ఉన్నాయి. ప్రస్తుతం 61 దేశాలు, 5 బహుళ జాతి సంస్థలతో భారత్ అంతరిక్ష సహకార ఒప్పందాలు చేసుకుంది.

కాంట్రాక్టు పద్ధతిలో సైంటిస్టుల నియామకాలొద్దు

న్యూఢిల్లీ, మార్చి 14: కేంద్ర ఆరోగ్య పరిశోధన విభాగం (డీహెచ్ఆర్)లో పరిశోధక పదవులు దీర్ఘకాలంగా ఖాళీగా ఉండడంపై పార్లమెంటరీ స్థాయీసంఘం ఆగ్రహం వ్యక్తంచేసింది. నిపుణులు, సుశిక్షితులైన భారతీయ వృత్తి నిపుణులు అభివృద్ధి చెందిన దేశాల బాట పట్టడంపై ఆందోళన వ్యక్తంచేసింది. మేధో వలసలను అడ్డుకునేందుకు.. మొదట పరిశోధక పదవుల్లో కాంట్రాక్టు నియామకాలను ఆపాలని స్పష్టం చేస్తూ కేంద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమంపై ఏర్పాటైన పార్లమెంటరీ కమిటీ రాజ్యసభకు ఇటీవల నివేదిక సమర్పించింది.

షార్‌కు చేరిన 'ప్రొపల్లెంట్ మిక్సర్'

సూళ్లూరుపేట, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): ఇస్రో ఇటీవల 10 టన్నుల ఇంధన సామర్థ్యంతో అభివృద్ధి చేసిన 'ప్రొపల్లెంట్ మిక్సర్' షార్‌కు చేరింది. రాకెట్ల తయారీలో ఘన ఇంధన దశల కోసం దీన్ని వినియోగిస్తారు. ఈ ప్రొపల్లెంట్ మిక్సర్‌ను బెంగళూరు నుంచి రోడ్డు మార్గాన భారీ భద్రత నడుమ శుక్రవారం తెల్లవారుజామున షార్‌కు తీసుకొచ్చారు. రాకెట్ జీరో దశలో ఉన్న స్ట్రాపాన్లు మొదటి దశలోని ఘన ఇంధన మోటార్లకు ఇంధనం సరఫరా చేసేందుకు ఈ భారీ ప్రొపల్లెంట్ మిక్సర్ ఉపయోగపడుతుంది. ఈ మిక్సర్ వెడల్పు 3.3 మీటర్లు, ఎత్తు 8.7 మీటర్లు. సుమారు 150 టన్నుల బరువు ఉంటుంది. దేశంలో 10 టన్నుల ప్రొపల్లెంట్ మిక్సర్‌ను అభివృద్ధి చేయడం ఇదే తొలిసారి.


తిరుమల ఆలయం ముందు జస్టిస్ ఎస్వీఎన్ భట్టి, జస్టిస్ లక్ష్మణ్‌రావు

శ్రీవారి సేవలో న్యాయమూర్తులు

తిరుమల, మార్చి 14(ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎస్వీఎన్ భట్టి శుక్రవారం ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ లక్ష్మణ్‌రావు కూడా ఆయన వెంట ఉన్నారు. అలాగే తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వేణుగోపాల్, మణిపూర్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి కృష్ణకుమార్ కూడా వేర్వేరుగా శ్రీవారిని దర్శించుకున్నారు.


తిరుమల ఆలయం ముందు రఘునందన్‌రావు

మా సిఫారసు లేఖలు తీసుకోవాలి

» తెలంగాణ ఎంపీ రఘునందన్‌రావు

తిరుమల, మార్చి 14(ఆంధ్రజ్యోతి): 'తిరుమల శ్రీవారి వీఐపీ బ్రేక్ దర్శనాల కోసం మా సిఫారసు లేఖలు తీసుకోకుంటే తెలంగాణ ప్రజాప్రతినిధులందరం కలిసి ఒక రోజు తిరుమలకు వస్తాం. టీటీడీ ఏం చేస్తుందో ఆ రోజు చూసుకుంటాం. తెలంగాణ ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, ఎంపీల సిఫార్సు లేఖలను శనివారం నుంచి తీసుకోవాలి' అంటూ బీజేపీ ఎంపీ రఘునందన్‌రావు ఆగ్రహం వ్యక్తంచేశారు. తిరుమల శ్రీవారిని శుక్రవారం దర్శించుకున్న ఆయన ఆలయం ముందు మీడియాతో మాట్లాడారు. తెలంగాణ ప్రాంత ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, ఎంపీలు ఇస్తున్న లేఖలను ఫిబ్రవరి నుంచి తీసుకుని దర్శనం కల్పిస్తామని ఇటీవల ప్రకటించారని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి ఆదేశించినా, బోర్డు తీర్మానం చేసినా తమ సిఫారసు లేఖలను తీసుకోవడం లేదన్నారు. తమ న్యాయమైన కోరికపై సీఎం చంద్రబాబు కూడా స్పందించాలని విజ్ఞప్తి చేశారు.

తిరుమల చేరుకున్న ఏకసభ్య కమిషన్

» నేడు, రేపు క్యూలైన్ల పరిశీలన

తిరుపతి(కలెక్టరేట్), మార్చి 14 (ఆంధ్రజ్యోతి): 'తిరుపతి' తొక్కిసలాట ఘటనపై రాష్ట్ర ప్రభుత్వం నియమించిన ఏక సభ్య న్యాయ విచారణ కమిషన్ ఛైర్మన్ జస్టిస్ సత్యనారాయణమూర్తి శుక్రవారం రాత్రి తిరుమల చేరుకున్నారు. శ్రీవారి దర్శనానికి భక్తులు వెళ్లే క్యూలైన్ల నిర్వహణ తీరును శని, ఆదివారాల్లో ఆయన పరిశీలించనున్నారు. సోమవారం నుంచి టీటీడీ, పోలీసు, రెవెన్యూ అధికారులతో పాటు తొక్కిసలాటలో గాయపడిన 16 మందిని విచారించనున్నారు. ఇప్పటికే 17న హాజరు కావాలని కలెక్టర్ వెంకటేశ్వర్, టీటీడీ ఈవో శ్యామలరావు, ఎస్పీ హర్షవర్ధన్‌రాజుకు నోటీసులు పంపారు. 18 నుంచి బదిలీ, సస్పెండైన అధికారులతో పాటు పలువురిని ఆరురోజుల పాటు విచారించనున్నారు.

'మగ' మహారాణులు!

కోరిక తీరాలంటే చీర కట్టాల్సిందే

» కర్నూలు జిల్లాలో తరతరాలుగా కొనసాగుతున్న ఆచారం
» రెండ్రోజుల పాటు వింతైన వేడుక



కుటుంబ సభ్యులతో కలిసి దేవాలయానికి బయలుదేరిన పురుషులు, ఆదోని మండలం సంతేకుడ్లూరు గ్రామంలోని రతీమన్మథుల విగ్రహాలు

ఆదోని రూరల్, మార్చి 14(ఆంధ్రజ్యోతి): హోలీ అంటేనే సంబరాల పండుగ. వసంత మాసం ఆగమనం సందర్భంగా చేసుకునే సరదాల వేడుక. హోలీ సందర్భంగా చిన్నా పెద్ద తేడా లేకుండా ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటూ సంబరాల్లో మునిగిపోతారు. కర్నూలు జిల్లా ఆదోనిలో మాత్రం హోలీ పండుగ ప్రత్యేకతే వేరు. రెండ్రోజుల పాటు జరిగే ఈ వేడుక ఆశ్చర్యం కలిగిస్తుంది. ఆదోని మండలం సంతేకుడ్లూరు గ్రామంలో హోలీ పండుగ సందర్భంగా వింత ఆచారాన్ని తరతరాలుగా కొనసాగిస్తున్నారు. ఈ గ్రామంలో రెండ్రోజుల పాటు పురుషులు మహిళల్లా అలంకరించుకుంటారు. ఖరీదైన చీరలు, లంగా ఓణీలు ధరించి, ఒంటి నిండా నగలు పెట్టుకుని, పూలతో అలంకరించుకుంటారు. ఆడవాళ్లే ఆశ్చర్యపోయేలా అందంగా ముస్తాబవుతారు. అదే వేషధారణలో పురుషులు గ్రామంలోని బసవేశ్వరస్వామి దేవాలయంలోని రతీమన్మథుల విగ్రహాలకు పూజలు చేస్తారు. కోరిన కోర్కెలు నెరవేరాలని ప్రతి ఇంటి నుంచి కనీసం ఒక్కరైనా ఇలా మహిళల మాదిరిగా తయారై రతీమన్మథుడికి నైవేద్యాన్ని ప్రత్యేకంగా తీసుకుని వస్తారు. మగవారు ఆడవారి వేషధారణలో మొక్కులు తీర్చుకోవడంతో గ్రామంలో కరువు, కాటకాలు ఉండవని ఇక్కడి ప్రజల విశ్వాసం. ఏటా హోలీ పండుగకు వివిధ రాష్ట్రాల నుంచి భక్తులు ఈ వింత ఆచారాన్ని చూసేందుకు భారీగా తరలివస్తుంటారు.

పట్టణాల్లో తాగునీటి సరఫరా ప్రాజెక్టు పునరుద్ధరణ

» 25 చోట్ల ఏఐఐబీ నిధులతో పనులకు నిర్ణయం
» మిగతా చోట్ల పట్టణ మౌలిక వసతుల నిధులు
» డీపీఆర్ సిద్ధం చేయాలని మున్సిపల్ శాఖ ఆదేశాలు

అమరావతి, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని పట్టణ ప్రాంతాల్లో తాగునీటి సరఫరా కోసం మున్సిపల్ శాఖ డీపీఆర్‌లు సిద్ధం చేస్తోంది. ఆంధ్రప్రదేశ్ పట్టణ ప్రాంత నీటి సరఫరా, మురుగునీటి నిర్వహణ అభివృద్ధి ప్రాజెక్టు(ఏపీడబ్ల్యూఎస్ అండ్ ఎస్ఎంఐపీ)ను గత టీడీపీ హయాంలో ఏఐఐబీ నిధులతో చేపట్టారు. రూ.5,350 కోట్లతో 50 పట్టణ స్థానిక సంస్థల్లో నీటి సరఫరా చేపట్టేందుకు 2019 ఫిబ్రవరిలో ఈ ప్రాజెక్టును ప్రారంభించారు. టీడీపీ ప్రభుత్వం 12 శాతం పనులు పూర్తి చేసిన తర్వాత వైసీపీ అధికారంలోకి వచ్చింది. ఆ తర్వాత ఈ ప్రాజెక్టు ఒక్క అడుగు కూడా ముందుకు పడకపోవడంతో ఎక్కడి పనులు అక్కడే ఆగిపోయాయి. ఇప్పుడు కూటమి ప్రభుత్వం ఈ ప్రాజెక్టును పునరుద్ధరించేందుకు చర్యలు ప్రారంభించింది. అయితే పెరిగిన రేట్ల ప్రకారం ఇప్పుడు 50 పట్టణ స్థానిక సంస్థల్లో ఈ ప్రాజెక్టును నిర్వహించడం సాధ్యం కాకపోవడంతో 25 పట్టణాల్లో ఏఐఐబీ నిధులతో ఈ పనులు చేపట్టాలని నిర్ణయించారు. మిగతా చోట్ల పట్టణ మౌలిక వసతుల అభివృద్ధి నిధులను వెచ్చించి నీటి సరఫరా ప్రాజెక్టులను ప్రారంభించాలని నిర్ణయించారు. నాలుగింటిని అమృత్ 2.0 కింద, పామిడిని నగర పంచాయతీగా డీనోటిఫై చేయడం వల్ల మినహాయించారు. మిగిలిన 20 పట్టణ స్థానిక సంస్థల్లోని 15 చోట్ల 2024-25 పట్టణ మౌలిక వసతుల అభివృద్ధి నిధులతో అమలు చేస్తున్నారు. 85 శాతం నేషనల్ హౌసింగ్ బ్యాంక్ ద్వారా పట్టణ మౌలిక వసతుల నిధులతో, 15 శాతం ఏపీ ప్రభుత్వ వాటాతో అభివృద్ధి చేయనున్నారు. ఇందుకు రూ.1,500 కోట్లు ఖర్చు చేయనున్నారు. 2025-26కు సంబంధించి రూ.1,367 కోట్ల పట్టణ మౌలిక వసతుల అభివృద్ధి నిధులతో 9 పట్టణ స్థానిక సంస్థల్లో నీటి సరఫరా ప్రాజెక్టును చేపట్టనున్నారు. ఏఐఐబీ నిధులతో చేపడుతున్న ఏపీ పట్టణ నీటి సరఫరా ప్రాజెక్టు మిగిలిన ఖర్చును పట్టణ మౌలిక వసతుల అభివృద్ధి నిధి కింద ఆమోదం పొందడానికి నేషనల్ హౌసింగ్ బ్యాంక్‌కు డీపీఆర్ నివేదికలు సమర్పించడానికి అమలు సంస్థ పబ్లిక్ హెల్త్ ఇంజనీర్ ఇన్ చీఫ్‌ను ప్రభుత్వం ఆదేశించింది.

వక్ఫ్ ఆస్తుల సమాచారాన్ని నవీకరించండి!

» రికార్డులు కచ్చితంగా ఉండేలా చర్యలు తీసుకోవాలి
» ఢిల్లీ ఐఐటీ బృందంతో వక్ఫ్ బోర్డు ఛైర్మన్ అజీజ్
» 17 నుంచి 22 వరకు రాష్ట్రంలోని వక్ఫ్ ఆస్తుల పరిశీలన

అమరావతి, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని వక్ఫ్ ఆస్తుల సమాచారాన్ని పూర్తి స్థాయిలో నవీకరించాలని, రికార్డులన్నీ కచ్చితంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర వక్ఫ్ బోర్డు ఛైర్మన్ అబ్దుల్ అజీజ్ కోరారు. శుక్రవారం ఆయన ఢిల్లీ ఐఐటీ బృందంతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. గతంలో దేశవ్యాప్తంగా డిజిటలైజ్ చేసిన వక్ఫ్ ఆస్తుల వివరాల్లోని వ్యత్యాసాలను పరిశీలించేందుకు, వాటిని రెవెన్యూ రికార్డులతో సంయుక్తం చేసేందుకు కేంద్ర మైనార్టీ మంత్రిత్వ శాఖ నియమించిన ఢిల్లీ ఐఐటీ బృందం ఈ నెల 17 నుంచి 22 వరకు రాష్ట్రంలో పర్యటించనుంది. ఈ నేపథ్యంలో వక్ఫ్ ఆస్తుల గురించి మరింత లోతుగా పరిశీలించాలని, రికార్డులు సమగ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని అజీజ్ సూచించారు. వక్ఫ్ ఆస్తుల పరిరక్షణ, మెరుగైన పాలన కోసం అందరూ సహకరించాలని కోరారు. ఈ బృందం రాష్ట్రంలోని పలు ముఖ్యమైన ప్రదేశాల్లోని వక్ఫ్ ఆస్తులను సందర్శించి, అక్కడి డేటాను సేకరించనుంది.

నేడు 'స్వర్ణాంధ్ర-స్వచ్ఛ దివస్'

తణుకులో పాల్గొననున్న సీఎం చంద్రబాబు

భీమవరం/తణుకు, జనవరి 14(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు శనివారం పశ్చిమ గోదావరి జిల్లా తణుకులో పర్యటించనున్నారు. ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నాలుగు కార్యక్రమాల్లో పాల్గొంటారు. మొదట 'స్వర్ణాంధ్ర-స్వచ్ఛ దివస్'లో భాగంగా 'సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధం-పునర్వినియోగ వస్తువులను ప్రోత్సహించండి' అనే థీమ్‌తో నిర్వహించే కార్యక్రమంలో పారిశుధ్య కార్మికులతో భేటీ అవుతారు. తర్వాత నియోజకవర్గానికి చెందిన సుమారు రెండు వేల మంది ప్రజలతో ప్రజా వేదిక నిర్వహించనున్నారు. ప్రజలతో మమేకమై వారి సమస్యలను తెలుసుకుంటారు. అనంతరం నియోజకవర్గానికి చెందిన పార్టీ ముఖ్య శ్రేణులతో సమావేశమై వారికి దిశా నిర్దేశం చేస్తారు. జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించి అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలు తీరుపై చర్చిస్తారు.

పెద్ద దేవర ఉత్సవంలో పాల్గొన్న భువనేశ్వరి


సిద్దేశ్వరస్వామికి సారె తీసుకొస్తున్న నారా భువనేశ్వరి

కుప్పం, మార్చి 14(ఆంధ్రజ్యోతి): చిత్తూరు జిల్లా కుప్పం నియోజకవర్గం శాంతిపురం మండలం, కదిరిముత్తనపల్లెలో శుక్రవారం కురబ కులస్థుల ఆధ్వర్యంలో జరిగిన పెద్ద దేవర ఉత్సవంలో ముఖ్యమంత్రి చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి పాల్గొన్నారు. కురబ కులస్థులు తమ కుల దైవమైన సిద్దేశ్వరస్వామితోపాటు మరో నలుగురు దైవాలకు తొమ్మిదేళ్లకు ఒకసారి పెద్ద దేవర ఉత్సవం నిర్వహిస్తారు. పెద్ద దేవర ఉత్సవానికి హాజరైన భువనేశ్వరి స్వామి వారికి సారె సమర్పించి, మొక్కులు చెల్లించుకున్నారు. అంతకుముందు భువనేశ్వరి శాంతిపురం మండలం రాళ్లబూదుగూరు గ్రామంలో జరిగిన కోదండరామస్వామి రథోత్సవంలో పాల్గొని రథం లాగారు.

కుటుంబాన్ని మింగేసిన రోడ్డు ప్రమాదం

» లారీని ఢీకొన్న కారు.. భార్య, భర్త, కుమార్తె దుర్మరణం
» మరొకరికి తీవ్ర గాయాలు

తాడేపల్లిగూడెం రూరల్, మార్చి 14(ఆంధ్రజ్యోతి): పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడెం మండలం కుంచనపల్లి జాతీయ రహదారిపై శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో భార్య, భర్త, చిన్నారి దుర్మరణం పాలయ్యారు. మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసుల కథనం మేరకు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మండపేటకు చెందిన బోగిళ్ల వెంకట సత్య సురేశ్ (39) హైదరాబాద్ ఉద్యోగం చేస్తున్నారు. ఆయన భార్య నవ్య (36), కుమార్తె వాసవీ కృష్ణ (4), వారి బంధువు ఉప్పులూరి శ్రీరమ్యతో కలిసి కారులో మండపేట బయలుదేరారు. తాడేపల్లిగూడెం మండలం కుంచనపల్లి వచ్చేసరికి వారు ప్రయాణిస్తున్న కారు జాతీయ రహదారి పనులు చేస్తున్న లారీని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారు నడుపుతున్న సురేశ్, నవ్య ఘటనా స్థలంలోనే మృతి చెందగా వాసవి కృష్ణను తణుకులోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందింది. శ్రీరమ్య కాళ్లకు గాయం కావడంతో రాజమహేంద్రవరంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ రమేష్ తెలిపారు.

విశాఖ జూలో చిరుత మృతి

ఆరిలోవ(విశాఖపట్నం), మార్చి 14(ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం ఇందిరా గాంధీ జంతు ప్రదర్శనశాలలో 20 ఏళ్ల వయసు కలిగిన చిరుత గురువారం రాత్రి మృతి చెందినట్టు క్యూరేటర్ మంగమ్మ తెలిపారు. సుధ అనే పేరు గల ఈ చిరుత 2008 జనవరి 30న తిమ్మాపురం వద్ద గల సుద్దకొండ సమీపంలో అటవీ శాఖ సిబ్బందికి చిక్కినట్టు చెప్పారు. వార్ధక్య సమస్యలతో బాధపడుతున్న చిరుత గుండెపోటుతో మృతి చెందినట్టు క్యూరేటర్ వెల్లడించారు.



పిఠాపురంలో శుక్రవారం జరిగిన జనసేన ఆవిర్భావ దినోత్సవ (జయకేతనం)సభలో ప్రసంగిస్తున్న జనసేన అధినేత పవన్ కల్యాణ్, వేదికపై ఆ పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు.. నాదెండ్ల మనోహర్, కందుల దుర్గేష్, తంగెళ్ల ఉదయ్‌శ్రీనివాస్, కొణిదెల నాగబాబు, బాలశౌరి, మండలి బుద్ధప్రసాద్, వంశీకృష్ణ శ్రీనివాస్, పంచకర్ల రమేష్‌బాబు, బొలిశెట్టి సత్యనారాయణ, అరవ శ్రీధర్, బొమ్మిడి నాయకర్, నిమ్మక జయరాజ్, పంతం నానాజీ, లోకం నాగమాధవి, సుందరపు విజయ్‌కుమార్, కొణతాల రామకృష్ణ, చిర్రి బాలరాజు, దేవ వరప్రసాద్, గిడ్డి సత్యనారాయణ, బత్తుల రామకృష్ణ, పులపర్తి రామాంజనేయులు, పత్సమట్ల ధర్మరాజు, బాలినేని శ్రీనివాసరెడ్డి, పెండెం దొరబాబు, టీవీ రామారావు, ఆనందసాయి, సామినేని ఉదయభాను, బొలిశెట్టి సత్యనారాయణ, దాసరి కిరణ్, పంచకర్ల సందీప్, రాయపాటి అరుణ, పసుపులేటి ఉషాకిరణ్, చిలకం మధుసూదన్‌రెడ్డి తదితరులు

జయ.. జయ.. కేతనం



జనసంద్రమైన పిఠాపురం.. అధికారంలోకి వచ్చాక జనసేన తొలి సభ

గెలిచాక పిఠాపురంలో పవన్ మొదటి విజయోత్సవ సభ

- అభిమానులతో పోటెత్తిన రహదారులు
- వేల వాహనాలు నేషనల్ హైవేపైనే నిలిపివేత
- కిలోమీటర్ల కొద్దీ నడిచొచ్చిన పవన్ సేన

(కాకినాడ, ఆంధ్రజ్యోతి)




జయకేతనం సభలో వృద్ధురాలి ఉత్సాహం

జనప్రవాహంతో జనసేన సభ పోటెత్తింది. 12వ ఆవిర్భావ సభ వేళ పిఠాపురం 'జయ కేతనం' ఎగురవేసింది. తండోపతండాలుగా వచ్చిన జనంతో చిత్రాడలో ఏర్పాటు చేసిన సభా ప్రాంగణం కిక్కిరిసింది. మధ్యాహ్నం 3.30 గంటలకు సభ ప్రారంభం కావాల్సిఉండగా, ఉదయం నుంచే జనసైనికులు, నేతలు, కార్యకర్తలు భారీగా రావడంతో గ్యాలరీలు నిండిపోయాయి. జనసేన అధికారంలోకి వచ్చిన తర్వాత జరుగుతున్న తొలి భారీ సభ కావడంతో జనసేన నేతలు జయకేతనం సభను సక్సెస్ చేయడంకోసం చెమటోడ్చారు. జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ పిఠాపురంనుంచి తొలిసారి ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత అక్కడ విజయోత్సవాలు నిర్వహించలేదు. నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసిన తర్వాతే సభ ఏర్పాటు చేయాలని భావించారు. దీంతో చాలాకాలం తర్వాత ఏర్పాటుచేసిన ఆవిర్భావ సభ విషయంలో పవన్ సేనలో విపరీతమైన ఆసక్తి నెలకొంది. ఈ నేపథ్యంలో ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి భారీగా సభకు జనం వస్తారని భావించి ఏడుచోట్ల పార్కింగ్ ప్రదేశాలను ఏర్పాటు చేయగా అవన్నీ మధ్యాహ్నానికే నిండిపోయాయి. దీంతో ఇతర ప్రాంతాలనుంచి ఆలస్యంగా సభకు వచ్చిన బస్సులు, కార్లు ఎక్కడికక్కడ 216 జాతీయ రహదారిపై నిలిచిపోయాయి. దీంతో సభావేదిక సమీపంలో భారీగా వాహనాలు నిలిచిపోయాయి. రాయలసీమ, ఉత్తరాంధ్ర తదితర ప్రాంతాలనుంచి తరలివచ్చిన బస్సులు, కార్లు గంటల తరబడి ముందుకు కదలకపోవడంతో వేలాది మంది వాహనాలు దిగి నడుచుకుంటూ సభ వద్దకు చేరుకోవాల్సి వచ్చింది. మరోపక్క 14 ఎకరాల ప్రాంగణంలో జనం కోసం గ్యాలరీలు ఏర్పాటు చేయగా, అవన్నీ సాయంత్రం 4గంటలకే కిక్కిరిసిపోయాయి. ఆ తర్వాత వచ్చిన వారిని పోలీసులు లోపలకు అనుమతించలేదు. అనేక మంది నేతలు, కార్యకర్తలు తమకున్న వీవీఐపీ పాస్‌లను పోలీసులకు చూపించినా స్థలాభావం కారణం లోపలకు పంపలేదు. ఫలితంగా సభలోకి ప్రవేశించే మూడు ద్వారాల వద్దా వేలల్లో జనం నిలబడిపోయారు. అక్కడ ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన ఎల్ఈడీ స్క్రీన్ల ఎదుట నిలబడి ప్రసంగాలను వారంతా వీక్షించారు.

అన్నిదారులూ పిఠాపురానికే..

తెలంగాణ, రాయలసీమ నుంచి వేలాదిమంది శుక్రవారం ఉదయమే చిత్రాడకు చేరుకున్నారు. కొందరు అభిమానులు సైకిళ్లపై జనసేన ఫ్లెక్సీలతో సభకు హాజరయ్యారు. సాయంత్రం 4.30 గంటలకు పవన్ హెలికాప్టర్ దిగడంతో అప్పటికే భారీగా చేరుకున్న జనం కేరింతలతో స్వాగతం పలికారు. ఎండ తీవ్రత అధికంగా ఉండడంతో సభకు వచ్చినవారు ఒకింత ఇబ్బందిపడ్డారు. ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల్లో జనసేనకు ప్రత్యేక బలం ఉంది. జనంలో చాలా మంది ఈ రెండు గోదావరి జిల్లాలనుంచే ఉండడం విశేషం. పవన్‌కల్యాణ్ ప్రసంగానికి హాజరైన జనం అడుగడుగునా చప్పట్లతో అభివాదం తెలిపారు.



జగన్ ఇక జీవితంలో సీఎం కాలేడు

జగన్మోహన్‌రెడ్డి ఇక జీవితంలో ఎప్పటికీ సీఎం కాలేడు. నమ్ముకున్నవారిని కూడా ఆయన మోసం చేస్తారు. చివరకు నా ఆస్తితోపాటు నా వియ్యంకుడి ఆస్తిని కూడా కొంత కాజేశారు. కూటమి ప్రభుత్వం ఇప్పటివరకు చిన్నచిన్న వైసీపీ కార్యకర్తలనే జైల్లో వేసింది. అదే నేనైతే కోట్లాది రూపాయలు కాజేసిన వారిని ఒక్క రోజులోనే జైల్లో వేసేవాడిని. నా ప్రాణం ఉన్నంతవరకు పవన్ కల్యాణ్‌తోనే ఉంటా. పవన్‌తో కలిసి ఒక సినిమా తీయాలనుకుంటున్నా. నాకు రాజశేఖరరెడ్డి రాజకీయ భిక్ష పెట్టారు. అందుకు జగన్ పార్టీ పెడితే మంత్రి పదవి వదులుకుని ఆయన వెంట నడిచాను. కానీ ఆయన నాకెంతో అన్యాయం చేశాడు. మంత్రి పదవి ఇచ్చి తీసేశాడు. అయినా నేను లెక్కపెట్టలేదు. వంశీని, పోసానిని అరెస్టు చేస్తే వాళ్లను పరామర్శించాడు. అధికారంలో ఉండగా రఘురామరాజును కొట్టించావు. చంద్రబాబు భార్యను తిట్టించావు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత 9 నెలలకు వాళ్లను లోపలేశారు. నేనైతే మొదటిరోజే లాఠీతో కొట్టించేవాడిని.

- మాజీ మంత్రి బాలినేని

- పోరాటాలతో 11 ఆవిర్భావ సభలు నిర్వహించాం. వాటికి నాడు వైసీపీ ఎన్నో ఆటంకాలు కలిగించింది.
  - ఎంఎస్ఎంఈ కార్పొరేషన్ చైర్మన్ టి.శివశంకర్

- జగన్ అహంకారం వల్లే వైసీపీ సర్వనాశనం అయిపోయింది.
  - జనసేన ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్‌రెడ్డి

- తెలంగాణలో పుట్టిన జనసేన ఏపీలో విజయం సాధించింది. తెలంగాణలో కూడా దృష్టి పెట్టాలి.
  - పార్టీ తెలంగాణ ఇన్‌చార్జి శంకర్

దేశానికి ఉపయోగపడేలా పవన్ ఎదగాలి

- అందుకు మనమంతా అండగా నిలబడాలి: మంత్రి నాదెండ్ల
- స్థానిక ఎన్నికల్లో నూరు శాతం స్ట్రైక్ రేట్ సాధించాలని పిలుపు



పిఠాపురం, మార్చి 14(ఆంధ్రజ్యోతి): 'రాష్ట్రానికే కాదు దేశానికి ఉపయోగపడేలా డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఎదగాలి. అందుకు మనమంతా అండగా నిలవాలి' అని జనసేన రాజకీయ వ్యవహారాల కమిటీ చైర్మన్, పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. జనసేన ఆవిర్భావ సభలో ఆయన మాట్లాడుతూ ఎన్ని అవమానాలు ఎదురైనా, ఓటమి పలకరించినా పవన్ ఎల్లప్పుడూ ప్రజల పక్షానే నిలిచారని చెప్పారు. 2019 ఎన్నికల్లో పార్టీ ఓటమి తర్వాత భవిష్యత్తు లేదని కొందరు ఎద్దేవా చేసినా తొలుత భవన నిర్మాణ కార్మికుల తరఫున, గత ప్రభుత్వంతో బాధలు పడిన ప్రతి ఒక్కరికీ పవన్ అండగా నిలిచారని తెలిపారు. జనసేన తన 12ఏళ్ల ప్రస్థానంలో విలువలతో కూడిన రాజకీయం చేసిందని, వై నాట్ 175 అన్న మూర్ఖపు నాయకులకు బుద్ధి చెప్పిందన్నారు. రాజధాని రైతులు ఆందోళన చెందినప్పుడు వారికి అండగా నిలిచింది పవన్ అని గుర్తుచేశారు. ప్రజలు, సామాన్యుల పక్షాన జనసేన పార్టీ నిలబడిందని తెలిపారు. కూటమి నాయకులతో పిఠాపురం, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నేతలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. గతంలో జనసేన సమావేశాలు పెట్టుకోవాలంటే చుక్కలు చూపించారని, సమావేశానికి కేవలం 12గంటలు ముందుగా అనుమతులు ఇచ్చి, పలు ఆంక్షలు పెట్టారని తెలిపారు. గత ఎన్నికల స్ఫూర్తితో రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పనిచేసి ఎంపీటీసీ, జడ్పీటీసీ, కౌన్సిలర్లు, కార్పొరేటర్లు.. ఇలా ప్రతిచోటా నూరు శాతం స్ట్రైక్ రేట్ సాధిద్దామని నాదెండ్ల పిలుపునిచ్చారు. సభ ముగిసిన తర్వాత శనివారం స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ స్ఫూర్తితో సభా ప్రాంగణాన్ని, బయట శుభ్రం చేయడంతో పాటు ఫ్లెక్సీలను సైతం తీసే కార్యక్రమాన్ని చేపడుతున్నామని తెలిపారు. పదవుల గురించి కాదని, యువతరాన్ని రాజకీయంగా ఎదిగేలా చేయడమనేదే జనసేన లక్ష్యమని చెప్పారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఒకవిధంగా, అధికారంలోకి వచ్చిన తర్వాత మరోలా ఉండబోమని స్పష్టం చేశారు. అప్పుడు పోరాటాలు చేశాం, ప్రశ్నించాం, ఇప్పుడు ఆ సమస్యలను పరిష్కరిద్దామని మనోహర్ పేర్కొన్నారు.

జగన్ ఇంకో ఇరవై ఏళ్లు హ్యాపీగా నిద్రపోవచ్చు!

- ఏ హాస్యగాడూ ఆయనంత గొప్పగా మాట్లాడలేరు
- 164 సీట్లలో విజయానికి పవన్ కష్టపడ్డారు
- పిఠాపురంలో ఆయన విజయానికి మేమే కారణమని ఎవరనుకున్నా అది వారి ఖర్మ: నాగబాబు



కాకినాడ, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): 'సినిమాల్లో హాస్య నటులు కూడా జగన్ అంత గొప్పగా మాట్లాడలేరు.. ఆయన చెబుతున్న మాటలు హాస్యగాళ్లను వింఎంచిపోయి ఉన్నాయి' అని జనసేన ప్రధాన కార్యదర్శి, ఎమ్మెల్సీ కె.నాగబాబు అన్నారు. శుక్రవారం చిత్రాడ శివారులో జరిగిన పార్టీ 12వ ఆవిర్భావ సభలో ఆయన మాట్లాడారు. అధికారం కోల్పోయిన జగన్ ఇప్పటికీ నిద్ర లేవ లేదు.. ఇంకా నిద్రలోనే కలవరిస్తున్నారని అన్నారు.. కళ్లు తెరిచి చూసేలోగా తొమ్మిది నెలలు అయిపోయాయని.. ఇంకోసారి కళ్లు మూస్తే మొత్తం ఐదేళ్లూ అయిపోతాయని, ఆ తర్వాత అధికారం తనదేనని జగన్ చెప్పే మాటలు ఏ హాస్యగాడూ చెప్పలేరన్నారు. అందుకే జగన్ నిద్రలోనే ఉండాలని, ఇంకో ఇరవై ఏళ్ల తర్వాత బయటకు రావాలని.. అప్పటివరకు తాము డిస్టర్బ్ చేయబోమని, హ్యాపీగా పడుకోవాలని సలహా ఇచ్చారు. పవన్ కల్యాణ్ చొరవతో కూటమి ఏర్పడిందని, ఎన్నికల్లో 164 సీట్లు సాధించేలా పవన్ కష్టపడ్డారని అన్నారు. పిఠాపురంలో పోటీచేస్తానని ఆయన ప్రకటించిన తర్వాత తనను, మరి కొందరిని పిఠాపురం వెళ్లి పనిచేయాలని పవన్ సూచించారని.. కానీ ఆయన విజయం ముందే ఖాయమని అక్కడకు వెళ్లి పని మొదలుపెట్టిన తర్వాత తనకు అర్థమైందన్నారు. అక్కడకు వెళ్లి పనిచేస్తున్నట్లు ఉండడం తప్ప, కొత్తగా చేయాల్సింది ఏమీ లేదని అర్థమైందన్నారు. 'పిఠాపురంలో పవన్‌కు అఖండ విజయం రావడానికి రెండు ముఖ్య కారణాల్లో ఒకటి పవన్ కల్యాణ్ కాగా, రెండోది పిఠాపురం నియోజకవర్గ ప్రజలు.. ఓటర్లు మాత్రమే. వీరిద్దరూ లేకపోతే మేం ఎంత చేసినా ఉపయోగం లేదు. అయితే మాలో ఎవరైనా... ఇంకా ఎవరైనా సరే.. పవన్ విజయానికి మేమే దోహదపడ్డామని అనుకుంటే అది వారి ఖర్మ. ఇంకేం చేయలేం' అని వ్యాఖ్యానించారు. పవన్ పుట్టినప్పుడు తల్లికి సాధారణ ప్రసవం అయిందని, పుట్టినప్పుడు తల్లినే బాధపెట్టని వ్యక్తి.. ప్రజలను ఎందుకు బాధ పడనిస్తారని ప్రశ్నించారు.



వైఎస్ లేకపోతే జగన్ ఎక్కడ?

అలుపెరగని పోరాటం, జెండా దించని తత్వం పవన్‌ను దేశంలో అత్యుత్తమ నాయకుడిగా నిలబెట్టాయని పర్యాటక శాఖా మంత్రి కందుల దుర్గేశ్ తెలిపారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు బూతులు మాట్లాడిన అధికార పార్టీ నేతలను చూశామని, వైఎస్ రాజశేఖర్‌రెడ్డి లేకపోతే జగన్ ఎక్కడని ప్రశ్నించారు.



టమాటా ప్రాసెసింగ్ యూనిట్‌కు శంకుస్థాపన చేస్తున్న మంత్రి భరత్, ఎమ్మెల్యే శ్యాంబాబు

రాష్ట్రానికి 8 లక్షల కోట్ల పెట్టుబడులు: మంత్రి భరత్

తాడిపత్రి/పత్తికొండ, మార్చి 14(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఏర్పడిన తొమ్మిది నెలల్లోనే రూ.8 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయని మంత్రి భరత్ అన్నారు. శుక్రవారం ఆయన అనంతపురం, కర్నూలు జిల్లాల్లో పర్యటించారు. తాడిపత్రిలో మాట్లాడుతూ ఉమ్మడి అనంతపురం జిల్లాకు వచ్చిన కొన్ని ప్రాజెక్టుల సమస్యలు తొలగిపోయి, నిర్మాణాలు త్వరలోనే ప్రారంభమవుతాయని తెలిపారు. తాడిపత్రిలో గ్రానైట్ పరిశ్రమలు పునఃప్రారంభమయ్యేలా చర్యలు తీసుకుంటామన్నారు. కర్నూలు జిల్లా పత్తికొండ నియోజకవర్గం కనకదిన్నె వద్ద రూ.11 కోట్లతో నిర్మించనున్న టమాటా ప్రాసెసింగ్ యూనిట్‌కు ఎమ్మెల్యే శ్యాంబాబుతో కలిసి శంకుస్థాపన చేశారు. ఆరు నెలల్లో పూర్తిచేస్తామన్నారు. టీడీపీ తిరిగి అధికారంలోకి వచ్చాక ఓర్వకల్లు అభివృద్ధికి శ్రీకారం చుట్టామన్నారు. కంపెనీలు ఏర్పాటుచేసి గ్రామీణ యువతకు ఉపాధి కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు, కలెక్టర్ రంజిత్‌బాషా పాల్గొన్నారు.

పథకాల్లో వివక్ష ఉండదు

(మొదటి పేజీ తరువాయి)

చేరనివ్వొద్దని మరోసారి తేల్చిచెప్పారు. టీడీపీ కూటమి అధికారంలోకి వచ్చిన 9 నెలల్లోనే అనేక కార్యక్రమాలకు శ్రీకారం చుట్టామని, పాలనలో స్పష్టమైన మార్పులు కనిపిస్తున్నాయని అన్నారు. ఇన్‌చార్జి మంత్రులు జిల్లాల్లో తప్పనిసరిగా పర్యటించాలని చెప్పారు. ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాలు, పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లే బాధ్యత వారే తీసుకోవాలన్నారు. అభివృద్ధి, ప్రభుత్వ కార్యక్రమాలపై అధికారులతో సమీక్షలు నిర్వహించాలని సూచించారు. ఎక్కడా గ్రూపు రాజకీయాలకు తావివ్వకూడదన్నారు. ప్రతి ఎమ్మెల్యే అసెంబ్లీలో, ఎంపీలు పార్లమెంటులో తమ తమ నియోజకవర్గ సమస్యలను ప్రస్తావించి వాటి పరిష్కారంపై దృష్టి పెట్టాలని కోరారు. మూడు పార్టీల నేతలను, కార్యకర్తలను కలుపుకొని ముందుకు వెళ్లాలని.. ఈ బాధ్యతను ప్రజాప్రతినిధులే తీసుకోవాలన్నారు. సీఎం ఇంకా ఏమన్నారంటే..

పదవుల కోసం పేర్లు పంపండి

నామినేటెడ్ పదవుల భర్తీకి కసరత్తు చేస్తున్నాం. వాటికి పేర్లను సిఫారసు చేయకుండా కొంత మంది నేతలు ఆలస్యం చేస్తున్నారు. వీలైనంత త్వరగా పార్టీ కోసం కష్టపడిన వారి వివరాలను నామినేటెడ్ పదవుల కోసం అందించాలి. సరైన వ్యక్తులను సరైన పదవుల్లో నియమిస్తాం. ఇప్పటివరకు నామినేటెడ్ పదవుల కోసం 60 వేల దరఖాస్తులు వచ్చాయి. అన్నింటినీ నిశితంగా పరిశీలిస్తున్నాం. రాష్ట్రవ్యాప్తంగా 21 ప్రధాన దేవాయాలకు చైర్మన్లను నియవిఎస్తాం. పదవులు తీసుకోవడమే కాకుండా జరిగే ప్రతి ఎన్నికల్లో ప్రభావం చూపించాలి. పదవులు చేపట్టినవారి వారి ప్రతిభ, పనితీరును పర్యవేక్షిస్తున్నాం. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఎంత జాగ్రత్తగా ఉన్నామో ఇప్పుడూ అంతే జాగ్రత్తగా.. హుందాగా వ్యవహరించాలి. ప్రజలకు ఆమోదయోగ్యమైన పరిపాలన అందించాలి.

ఒక్కో నియోజకవర్గంలో 10 వేల రూఫ్‌టాప్‌లు

సోలార్ విద్యుత్‌ను ప్రోత్సహించడం మన ప్రభుత్వ విధానం. పీఎం సూర్యఘర్ పథకాన్ని ప్రతి గ్రామంలో అమలు చేసేందుకు ఎమ్మెల్యేలు, నేతలు చొరవ తీసుకోవాలి. 2 కిలోవాట్ల రూఫ్‌టాప్ ఏర్పాటు చేసుకునే బీసీలకు రూ.20 వేల సబ్సిడీని రాష్ట్రప్రభుత్వం తరఫున అదనంగా అందిస్తాం. కేంద్రం ఇచ్చే మొత్తంతో కలిపి బీసీలకు రూ.80 వేల వరకు రాయితీ వస్తుంది. ఎస్సీ, ఎస్టీలకు ఉచితంగా ఏర్పాటు చేస్తాం. ఒక్కో నియోజకవర్గంలో కనీసం 10 వేల రూఫ్‌టాప్‌ల ఏర్పాటు లక్ష్యంగా పెట్టుకోవాలి.

నిబద్ధతతో కూడిన రాజకీయాలకు ప్రతీక జనసేన

- పవన్ కల్యాణ్‌కు చంద్రబాబు, లోకేశ్ శుభాకాంక్షలు



అమరావతి, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): జనసేన ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పవన్ కల్యాణ్‌కు సీఎం చంద్రబాబు శుభాకాంక్షలు తెలిపారు. 'జనసేవా నిబద్ధత, విలువలతో కూడిన రాజకీయాలకు ప్రతీకగా కొనసాగుతున్న జనసేన 12వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా అధినేత పవన్ కల్యాణ్‌కు, పార్టీ నాయకులకు హృదయపూర్వక శుభాకాంక్షలు' అని ఎక్స్‌లో పేర్కొన్నారు. మంత్రి లోకేశ్ ఎక్స్‌లో స్పందిస్తూ... 'అన్న పవన్ కల్యాణ్‌కు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులకు శుభాకాంక్షలు. రాష్ట్ర ఆర్థిక, సామాజిక అభివృద్ధికి జనసేన కృషి శ్లాఘనీయం. రాష్ట్రాన్ని సుసంపన్నం చేస్తూ, ప్రగతి దిశగా నడిపించడంలో, అందరికీ మెరుగైన భవిష్యత్ ఇవ్వడంలో వారి కృషి నిస్సందేహమైనది' అని పేర్కొన్నారు.



చిత్రాడలో శుక్రవారం నిర్వహించిన జనసేన జయకేతనం సభకు హాజరైన అశేష ప్రజానీకం
సభలో ప్రసంగిస్తున్న పవన్ కల్యాణ్

నిలిచి గెలిచాం!

- అసెంబ్లీ గేటును కూడా తాకలేవని సవాల్ చేశారు
- చరచిన ఆ తొడల్ని బద్దలు కొట్టాం: పవన్ కల్యాణ్

అమరావతి, మార్చి 14(ఆంధ్రజ్యోతి): 'అసెంబ్లీ గేటును కూడా తాకలేవని మనల్ని చాలెంజ్ చేసి.. చరచిన ఆ తొడల్ని బద్దలుకొట్టాం.. అసెంబ్లీలో 21 మంది ఎమ్మెల్యేలు, పార్లమెంటులో ఇద్దరు ఎంపీలతో అడుగుపెట్టాం. దేశమంతా తలతిప్పి తిరిగి చూసేలా వంద శాతం స్ట్రైకరేట్‌తో ఘన విజయం సాధించాం. ఎన్డీయే ప్రభుత్వాన్ని నిలబెట్టాం. ఈ రోజు జయకేతనం ఎగరేస్తున్నాం' అని జనసేన అధ్యక్షుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ప్రకటించారు. జనసేన 12వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం కాకినాడ జిల్లా పిఠాపురం చిత్రాడలో నిర్వహించిన 'జయకేతనం' సభలో ఆయన ప్రసంగించారు. తొలుత తమిళంలో ప్రసంగం మొదలుపెట్టారు. రాజకీయ వైరుధ్యాలు, భాషాయుద్ధాలు, జనసేన విజయాలు.. పలు అంశాలను స్పృశించారు. 'భయం లేదు. భయం లేదు.. భయమన్నది లేనే లేదు. ఒక దుర్నీతి దుర్జన లోకమంతా ఎదురొచ్చినా భయం లేదు.. భయం లేదు కాబట్టే అసలే చీకటి.. గాఢాంధకారమైన వెళ్లే దారంతా గోతులు గుంతలు, లోయలు అగాధాలున్నా.. ఇళ్లేమో దూరమైనా... చేతిలో దీపం లేకపోయినా గుండె ధైర్యమే కవచంగా ధరించిన వాడిని గనుకే.. అన్నీ ఒక్కడినే అయి.. 2014లో జనసేన స్థాపించా. ఓటమి భయం లేదు కాబట్టి 2019లో పోటీ చేశాం. ఓడినా అడుగు ముందుకే వేశాం. మనం నిలబడ్డాం. పార్టీని నిలబెట్టాం. మనం నిలదొక్కుకున్నాం.. నిలదొక్కుకోవడమే కాకుండా నాలుగు దశాబ్దాల టీడీపీ పార్టీని నిలబెట్టాం. మనం 2019లో ఓడినప్పుడు మీసాలు మెలేశారు.. జబ్బలు చరిచారు.. తొడలు కొట్టారు.. ఆడపడుచులను అవమానించారు..ప్రజలను నిరంతరం హింసించారు. ఇదేం న్యాయమని ప్రశ్నిస్తే గొంతెత్తితే వారిపై కేసులు పెట్టారు.. జైల్లో పెట్టారు. నాలుగు దశాబ్దాల సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉన్న నాయకుడిని అక్రమ కేసుల్లో బంధించారు. టీడీపీ కార్యకర్తలు, సీనియర్ నాయకులు రోడ్డు మీదకు రావాలంటేనే భయపడేలా చేశారు. ఇక నాలాంటి వాడిని తిట్టని తిట్టు లేదు. పాల్జేయని అవమానం లేదు.. చేయని కుట్ర లేదు.. వేయని కుతంత్రం లేదు' అని అన్నారు. దేశం కోసం చనిపోవడానికి సంసిద్ధంగా ఉన్నానన్నారు. ఇంకా ఏమన్నారంటే..

నాపై రాతలు..

పవన్ కల్యాణ్ అవసరాలకు ఎలా పడితే అలా మార్చేస్తారని.. లెఫ్ట్, రైట్, సెంటర్ అంటూ మారిపోతున్నారని ఓ హిందీ పత్రికలో ప్రచురించారు. నేను చేగువేరాను ప్రేమిస్తా.. నారాయణగురును గౌరవిస్తా. నేను ఎలా పడితే అలా మార్చేస్తే ఏడు సినిమాలతో సూపర్ స్టార్ అవుతానా? 2007లో కామన్ మ్యాన్ ప్రొటెక్షన్ ఫోర్స్ పెట్టాను. అప్పుడు చేగువేరా, జయప్రకాశ్ నారాయణ, బాలగంగాధర్ తిలక్, మదర్ థెరిస్సా, భగత్‌సింగ్‌ను స్ఫూర్తిగా తీసుకున్నాను. నేను కాలేజీలు, యూనివర్సిటీలకు వెళ్లలేదు. కానీ జ్ఞానాన్ని సముపార్జించడాన్ని చిన్నప్పటి నుంచీ ఆపలేదు. నిత్యం నేర్చుకుంటూనే ఉన్నాను. చరిత్ర, సంస్కృతి, విదేశీ వ్యవహారాలు, ఫిలాసఫీ, సామాజిక, చారిత్రక, రాజకీయ అవగాహన లేకుండా ఎందుకు పార్టీ పెడతాను? దేశ విభజన, తిరుగుబాటు, విప్లవవీరుల గురించి చదవకుండా, అర్థం చేసుకోకుండా పార్టీ పెట్టేస్తామా? వీటి కోసం ప్రత్యేకంగా తెల్లగెడ్డం. సామాన్యుడికి అర్థం కాని లిటరేచర్‌తో మాట్లాడాలా?

మీరే నా బంధం.. అనుబంధం..

మీరే నా బంధం.. అనుబంధం, జనసేనాని రక్త సంబంధం.. మనందరికి కీలక కర్తవ్యం ఉంది. రాజకీయ ప్రస్థానంలో అలుపెరిగిన పోరాటం చేసిన తర్వాత లభించిన చరిత్రాత్మక విజయం ఇది. ఈ విజయం పసిబిడ్డ లాంటిది. ఈ బిడ్డను మనం జాగ్రత్తగా కాపాడుకోవాలి. చాలా జాగ్రత్తగా చూసుకోవాలి. బాధ్యతతో కాపాడుకోవాలి. అలా కాపాడుకోగలిగితే అదే పెద్దదై సమాజాన్ని కాపాడుతుంది. ఈ బిడ్డను మనం దరం కంటికి రెప్పలా కాపాడుకోవాలి. జనసేన సైనికులూ.. మీరు జాగ్రత్తగా, బాగుంటే మేమూ బాగుంటాం. మీరే మమ్మల్ని కూడా క్రమశిక్షణలో పెట్టాలి.

సీఎం చంద్రబాబుకు ధన్యవాదాలు..

2024 ఎన్నికల్లో ఘన విజయం సాధించాం. కలిసి పోరాటం చేశాం. కష్టాలు ఉన్నప్పుడు చేయి అందించాం. అది గుర్తుపెట్టుకుని డిప్యూటీ సీఎంగా కలిసి ఒక వ్యక్తితో బలంగా ప్రయాణం చేస్తున్నాను. సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉన్న రాజకీయ నాయకుడు, హైటెక్ సిటీకి రూపకల్పన చేసిన దార్శనికుడు, క్లెమోర్ మైన్స్‌తో పేల్చేస్తే.. తర్వాతి రోజు చొక్కా దులుకుని వచ్చి డ్యూటీలో చేరిన బలమైన నాయకుడు ముఖ్యమంత్రి చంద్రబాబు. ఆయనకు, లోకేశ్‌కు హృదయపూర్వక ధన్యవాదాలు.

దాశరథి మాటల బలం..

భరత భూమి నేర్పిందో.. ప్రజా కోర్టు నేర్పిందో.. నిజమేవిటో కానీ ఒంటి చేత్తో శత్రువుపై దుమికే శక్తి ఉంది.. అని చెప్పిన దాశరథి కృష్ణమాచార్య మాట బలం తెలంగాణకే కాదు.. నెల్లూరులో చదువుకున్న నాకు కూడా ఉంది. అందుకే అలా జనసేన స్థలం తెలంగాణ అయింది. కర్మ స్థలం ఆంధ్రా అయింది. రుద్రవీణ వాయిస్తా.. అగ్నిధారలు కురిపిస్తా. తిరుగుబాటు జెండా పట్టిస్తా.. దుష్టపాలన నుంచి విముక్తి కల్పిస్తా అన్న కృష్ణమాచార్య మాటలు.. నాకే కాదు.. మబ్బుల్లో పరుగెత్తే పిడుగులు. వేట కోసం బయటకు వచ్చిన కొదమ సింహాల్లాంటి పార్టీ నాయకులు, కార్యకర్తలకు కూడా ఊతం ఇచ్చాయి. ఊతమివ్వడం వల్లనే 2024 ఎన్నికల్లో దాష్టీక ప్రభుత్వాన్ని దించి. ఎన్డీయేని గెలిపించారు. అందుకే మీ అందరికీ గుండెల లోతుల్లో నుంచి ధన్యవాదాలు. కోటి దివిటీల కాంతి జ్యోతి తెలంగాణకు కరెంటు షాక్ తగిలి చనిపోబోయిన నాకు కొండగట్టు ఆంజనేయుడి దయ.. తెలంగాణ అన్నదమ్ముల దీవెన నాకు పునర్జన్మనిచ్చింది.అలాంటి తెలంగాణ తల్లికి వందనాలు.



జయకేతనం సభలో మల్లకంబ ప్రదర్శన చేస్తున్న యువకులు

గద్దర్ నాకు అన్న..

బండెనక బండి కట్టి పదహారు బండ్లు కట్టి.. ఏ బండిలో పోతావు కొడుకో.. నైజాము సర్కరోడా. అని గాలికి గజ్జె కట్టి చేత కర్ర పట్టి.. ఆటనే, పాటనే ఆయుధంగా మరిలిచిన వాడు యువత గుండెల్లోపోరాట స్ఫూర్తి నింపినవాడు. నేను కనిపిస్తే ఎలా ఉన్నావు తంబి అని అప్యాయంగా పలకరించే. మన మధ్య లేని నా అన్న నా గద్దరన్న నేల నుంచి వచ్చిన నా తెలంగాణ జనసైనికులు, నాయకులు, వీరమహిళలకు హృదయపూర్వక శుభాకాంక్షలు.

ఈ హోలీ యాదృచ్ఛికం కాదు..

కొణతాల రామకృష్ణ చెప్పినట్లు హోలీ పండుగ. హోలీ అంటే రంగులు, ఉత్సాహం, మైత్రిని పంచే పండుగ. చెడుపోయింది మంచి వచ్చిందని రంగులు జల్లుకునే పండుగ. మన జయకేతనం ఎగరవేసిన రోజునే హోలీ రావడం యాదృచ్ఛికం కాదు.. భగవంతుడి నిర్ణయం. అందుకే దేశ ప్రజలందరికీ హోలీ శుభాకాంక్షలు. జయకేతన సభకు తమిళనాడు, మహారాష్ట్ర, కేరళ, కర్ణాటక, ఒడిశా నుంచీ వచ్చారు. నా సినిమాలను కాదు.. సిద్ధాంతాలను నమ్మి 400 మందికిపైగా చనిపోయారు. వారి గౌరవం కోసం సినిమాల గురించి ఈ సభలో మాట్లాడకూడదు. జనసైనికులూ నా మాట వినండి. నా మాట వినకపోవడం వల్ల 151 సీట్లు వచ్చిన పార్టీ ఓడిపోయింది.

2003లో పార్టీ పెడతానని చెబితే..

2003లో నేను పార్టీ పెడతానని మా నాన్నకి, అమ్మకి చెప్పాను. అప్పుడు వారిద్దరికీ నచ్చలేదు. శుభ్రమైన భవిష్యత్ పెట్టుకుని పిచ్చా అని అడిగారు. సినిమాను దృష్టిలో పెట్టుకుని నేను ఎదగలేదు. సమాజాన్ని దృష్టిలో పెట్టుకుని ఎదిగాను. సినిమా ఉపకరణం అయింది.. అదే జీవితం కాలేదు. మీరంతా గద్దర్ రాజకీయాల ద్వారా పరిచయం కాలేదు. గద్దర్ ఖుషి సినిమా చూసి, అన్నయ్య దగ్గరకి వచ్చిన మీ తమ్ముడి కలవాలని అన్నారు. గద్దరంటే చిన్నప్పటి నుంచి నాకు ఇష్టం. దేశం కోసం, సమాజం కోసం ఆలోచించేవాడివి. ఏ మేరా భరతమాతను సంకెళ్లలో బంధించి పెట్టావు కదా.. నీ భావం నాకు అర్థం అయిందన్నారు. ఆ రోజు నుంచి మా ఇద్దరికీ స్నేహం ఏర్పడింది. అన్నదమ్ముల బంధం అయింది.

నన్ను ఆడపిల్లలా పెంచారు..

చిన్నప్పుడు నన్ను ఆడపిల్లలా పెంచారు. బయటకు వెళ్తే ఏమైపోతాడో.. సున్నితమైన వ్యక్తి అని ఇంట్లో నుంచి కదలనివ్వకుండా, ఎక్కడికీ వెళ్లనివ్వకుండా పెంచారు. సగటు మనిషిగా ఉండడమే నాకు ఇష్టం. తన కుటుంబం వరకూ జీవితాన్ని కుదించుకుని సగటు మధ్యతరగతి మనిషిలా బతకడమే నా కోరిక. మా నాన్న నన్ను ఎస్సై కావడానికి డిగ్రీ వరకూ చదవాలని అడిగేవారు. కానీ డిగ్రీ పూర్తి చేయలేకపోయా.

భగవంతుడి మాయ..

పాలిటిక్స్ చేస్తానని, సినిమాల్లోకి వస్తానని ఎవరూ ఊహించలేదు. నేనూ ఊహించలేదు. తొలిప్రేమ సినిమా హిట్ తర్వాత ఒక రోజు నేను, ఆనంద్‌సాయి, మరో మిత్రుడితో కలిసి సెకండ్ షో సినిమాకి వెళ్లి.. ఇంటికి వచ్చేసరికి మా నాన్న ఇంటి బయట నా కోసం ఎదురుచూస్తున్నారు. ఆలస్యంగా వచ్చానని తిట్టారు. అప్పటికే మూడు సినిమాలు హిట్ అయ్యాయి.. తొలిప్రేమ విజయవంతంగా నడుస్తోంది.. ఇంకా నన్ను చిన్నపిల్లవాడిలా చూస్తే ఎలా అని అడిగాను. ఆ తర్వాత మరీ ఎక్కువగా తిట్టారు.

ఆ ప్రొఫెసర్‌కు ధన్యవాదాలు

హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ శ్రీపతి రాముడికి ధన్యవాదాలు తెలియజేస్తున్నా. ఆయన జనసేన పార్టీ కాదు. బహుజన సిద్ధాంతాలు, అంబేడ్కర్ ఆశయాలు, అణగారిన వర్గాల కోసం నిలబడిన వ్యక్తి. చాలామంది విద్యార్థులను పీహెచ్‌డీల కోసం తయారు చేసే వ్యక్తి. ఆయన ఎప్పుడూ నా వెంటనే ఉన్నారు.

సనాతన ధర్మంపై సర్టిఫికెట్ అక్కర్లేదు..

సనాతన ధర్మం నా రక్తంలో ఉంది. 14 ఏళ్ల నుంచి దీక్షలు చేస్తున్నాను. అయ్యప్పస్వామి దీక్షా చేశాను. సనాతన ధర్మంపై నాకు సర్టిఫికెట్లు ఇవ్వాల్సిన అవసరం లేదు. 219 దేవాలయాలను అపవిత్రం చేస్తే.. అంతర్వేది రథాన్ని కాల్చేస్తే.. రాముల వారి విగ్రహం నుంచి శిరసును వేరే చేస్తే ఎందుకు బయటకు రాలేదంటున్నారు. కానీ ఆ రోజే స్పందించాను. మా నాన్న 20 ఏళ్ల వయసులో కమ్యూనిస్టు పార్టీ సభ్యుడు.. తర్వాత రామభక్తుడు అయిపోయారు. మా ఇంట్లో నిత్యం రామనామం జపించేవారు. రాముడి విగ్రహం తల నరికేస్తే కోపం రాకూడదంటే ఎలా..? మహ్మద్ ప్రవక్తను దూషించి బతకగలరా..? ఏసుక్రీస్తు, మేరీమాతను అనగలరా..? పార్వతీ దేవిని మాత్రం ఇష్టారాజ్యంగా తిడతారు. నోరు మూసుకుని కూర్చోవాలా..? ఆ జనరేషన్ పోయింది. తప్పును తప్పుగానే చెబుతాను. 15 నిమిషాలు పోలీసులు కళ్లు మూసుకుంటే హిందువులకు తామంటే ఏమిటో చూపిస్తామంటూ ఓల్డ్ సిటీలో నాయకులు అంటే తప్పు పట్టకూడదా..? అల్లాను ద్వేషించమని సనాతన ధర్మం మాకు చెప్పలేదు. కుహనా సెక్యులర్‌వాదుల వల్ల ఇలా అవుతోంది. అన్ని మతాలకు శిక్ష ఒక్కటే ఉండాలి. గుజరాత్‌లో ముస్లింలు చనిపోతే.. దానికి దారి తీసిన పరిస్థితుల గురించి ఆలోచించాలి. గోద్రా మారణహోమం ఎందుకు జరిగిందని ఆలోచిస్తే.. రామభజన చేసినందుకు రైలును తగులబెట్టారు. రెండూ తప్పే.

అన్నీ దేశ భాషలే కదా!

ప్రస్తుతం భాష, సంస్కృతినీ తిడుతున్నారు. హిందీని రుద్దుతున్నారంటూ హడావుడి చేస్తున్నారు. అన్నీ దేశ భాషలే కదా! తమిళనాడులో హిందీ వద్దని అంటున్నారు. అలాగైతే తమిళ సినిమాలను హిందీలోకి అనువదించకండి.. హిందీవాళ్ల డబ్బులు కావాలి. కానీ హిందీ భాష వద్దంటే ఎలా? భాషలను ద్వేషించాల్సిన అవసరం లేదు. దేశానికి తమిళం సహా బహుళ భాషలు కావాలి. బహుభాషలే దేశానికి మంచిది. నార్త్, సౌత్ విభజన, కుల గణన, డీలిమిటేషన్, త్రిభాషా ఫార్ములా గురించి చాలా మంది మాట్లాడుతున్నారు. ఆంధ్రాను విభజిస్తే దేశంలో ఉండమని చాలా మంది అప్పుడన్నారు. దేశాన్ని కట్ చేయడానికి ఇండియా కేకు ముక్కా? ఇండియా అంటే.. ఉత్తర భారతదేశం హిమాలయాల్లో పరమశివుడున్న కైలాసం దగ్గర నుంచి దక్షిణ భారతంలో మురుగన్ నివాసం వరకు. దేశాన్ని విడగొట్టే ధైర్యం, సాహసం ఎవరికైనా ఉందని నేను అనుకోను. రాజకీయ వైరుధ్యాలతో దేశాన్ని ముక్కలు చేయవద్దు. డీలిమిటేషన్‌పై చర్చ పెట్టండి. అంతేగానీ రూపీ సింబల్ మార్చేస్తాం. నా భాషలో పెడతానంటే! ఏ రాష్ట్రం వాళ్లు అలా అనుకుంటే ఎలా..? వివేకం, ఆలోచన ఉండాలి. విధ్వంసం చేయడం చాలా సులువు.. నిర్మాణం చాలా కష్టం. తమిళనాడులో చదువుతున్న సమయంలో నేనూ వివక్షకు గురయ్యాను. గోల్టి అని నన్ను పిలిచేవారు. గోల్టి అంటే తెలుగుకు రివర్స్ అని మా మాస్టర్ చెప్పారు.

బలమైన నాయకత్వం అవసరం

అల్లరి చిల్లరిగా ఉండే వారు నాకు అవసరం లేదు. నిలకడగా ఉండే వారే నా సైన్యం. డిప్యూటీ సీఎం అయ్యాక.. పుస్తకాల బరువుతో వీపు వంగిపోతున్న పిల్ల వాడికి ఆ బరువు తగ్గిస్తే ధన్యుడిని అనుకునేవాడిని. చుక్క నీటి కోసం ఏడ్చే గిరిజనులకు ఒక్క బిందెడు మంచి నీరు ఇస్తే బాగుంటుందనుకునేవాడిని. డోలీ మోతలతో ఇబ్బందులు పడే కొండ ప్రాంతాల్లో ఒక రోడ్డు వేయించగలమా అని అనుకునేవాడిని. మీ అందరి దయ, పట్టుదలతో నాలుగు వేల పైచిలుకు కిలోమీటర్ల రోడ్లు వేయించగలిగాం. రూ.2,500 కోట్లకు పైగా ఖర్చు చేసి రోడ్లు వేశాం. అనుకుంటే ఎంతైనా చేయగలం. నాకు ఈజీగా, గోల చేసే వ్యక్తులు వద్దు.. దేశం కోసం నిలబడే, చీల్చి చెండాడే యువత కావాలి. పాకిస్థాన్ విభజన ఎందుకు ఆపలేపోయారంటే యువరక్తాన్ని తయారుచేయలేకపోయామని సర్దార్ పటేల్ చెప్పారు. నేను వికసిత్ భారత్ ను నిర్మించగలిగే యువత నాయకత్వాన్ని ఆలోచిస్తున్నాను. ఊరికి వంద మంది నేతలను జాతీయ స్థాయికి పంపించడమే నా లక్ష్యం.. 2047కి విదేశాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా ఉండాలి. దేశాన్ని, సమాజాన్ని నడిపే నేతలు మీలో నుంచి పుట్టాలి. ఏపీ, తెలంగాణ నుంచి దేశాన్ని ప్రభావితం చేసే వంద మంది యువ నాయకులను తయారుచేయాలి. దానికి పని చేద్దాం. సరైన నాయకుడు లేకపోతే చిల్లర, పనికిమాలిన వేషాలు వేస్తారు. వైసీపీ వాళ్లు మళ్లీ వచ్చారంటే తప్పు మనది. బలహీనత మనది అవుతుంది.

సైద్ధాంతిక బలం ఉండాలి..

రాజకీయాల్లో సైద్ధాంతిక బలం ఉండాలి. పదవి, అధికారం కోసం గూండాలను వాడుకుంటారు.. మర్డర్లు చేయిస్తారు. వేల కోట్లు దోచేస్తారు. కులాలను కెలికేస్తారు.. విద్వేషాలు రెచ్చగొట్టడం ద్వారా లాభపడడం మరో పద్ధతి. కోడికత్తి దాడి లాంటివి ఎంచుకోలేదు. సైద్ధాంతిక రాజకీయాలు ఎంచుకున్నాను. నాకు ఊహ తెలిసినప్పటి నుంచీ అలాగే జీవించాను. నేను మార్పు కోసం వచ్చాను.. ఓట్ల కోసం కాదు. బాధ్యతగా లేకుండా ఇంత దూరంగా రాగలమా..? 151 సీట్లు ఉన్న పార్టీని 11 సీట్లకు రానివ్వగలిగాం. గెలిచిన మన ఎమ్మెల్యేలను ఇబ్బందులకు గురి చేశారు. అప్పుడే చాలా మంది నన్ను ప్రధాని మోదీకి చెప్పండని అన్నారు. ప్రజల్ని కాపాడడానికి వచ్చానని, నన్ను కాపాడాలని ఎవరినీ అడగనంటూ తిరస్కరించాను. ఇది నా పోరాటం.. నా నేల, నా మీద చేయి వేయమని చెప్పండి నేనేమిటో చెబుతా. ఎవరో వస్తారని ఎప్పుడూ ఏదీ చేయను. ఎంత నిలబడగలనో అంతే నిలబడతాను. ఆలోచించి అడుగు వేస్తాను.. నన్ను బూతులు తిట్టి, వాటిపై డిబేట్లు పెట్టారు. అప్పుడు నేను, నా జీవితం తప్ప వీరికేమీ లేవా అనుకునేవాడిని. ఒకరింట్లో ఆస్తి తగాదాలు, అన్నా చెల్లెళ్ల ఆస్తి గొడవతో రాష్ట్రానికి ఏం సంబంధం? వీరికి ఇన్ని వేల కోట్లు ఎలా వచ్చాయని ఆలోచించాలి. పవన్ ఒక్కడికే కోపం వస్తే ఇంత జరిగింది. ఇన్ని లక్షల మందికి కోపం వస్తే ఏం జరుగుతుందో చూడండి. సమాజంలో అన్యాయం మీద ప్రతి ఒక్కరికి కోపం రావాలి.

తండ్రి సీఎం అయి ఉండాలా..?

పార్టీ పెట్టాలంటే తండ్రి ముఖ్యమంత్రి అయి ఉండాలా..? మామయ్య కేంద్ర మంత్రి అయి ఉండాలా..? బాబాయిని చంపించాలా..? ఇలా చేయాలని ఎక్కడా రాసి లేదు. దశాబ్దం పాటు పార్టీని మోయాలంటే ఎన్ని తిట్లు తినాలి.. అవమానాలు భరించాలి..? నలగాలి.. జ్వలించుకుపోవాలి.. ఎన్ని పోగొట్టుకోవాలి..? వ్యక్తిగత జీవితం నుంచి ఆరోగ్యం వరకూ అన్నీ పోగొట్టుకుని వచ్చాను. వీటన్నింటికి జయకేతనం నాకు గొప్ప ఆనందాన్ని అందించింది. నేను మార్షల్ ఆర్ట్స్ చేసే సమయంలో రాళ్లు గుండెలపై పెట్టుకుని పగులకొట్టించుకునేవాడిని.. ముగ్గురు పిల్లలను ఎత్తుకుని పరుగెత్తేవాడిని. ఇప్పుడు నా చిన్న కొడుకును కూడా ఎత్తుకోలేనంతా బలహీనపడిపోయాను. అయినా మీ అందరి ఆశీస్సులతో మళ్లీ బలం తెచ్చుకుంటాను.

ఆతిథ్యం అదుర్స్

- స్వచ్ఛందంగా వేలాది మందికి భోజనాలు
- మజ్జిగ, ఓఆర్ఎస్, తాగునీరు పంపిణీ



ఉచితంగా పుచ్చకాయలు, మజ్జిగ ప్యాకెట్లు పంచుతున్న జనసైనికులు

పిఠాపురం/గొల్లప్రోలు రూరల్, మార్చి 14(ఆంధ్రజ్యోతి): జనసేన ఆవిర్భావ సభ సందర్భంగా పోటాపోటీగా వేలాది మందికి భోజనాలు పెట్టారు. ఎక్కడికక్కడ మజ్జిగ, తాగునీరు, ఓఆర్ఎస్‌లు, టన్నుల కొద్దీ పుచ్చకాయ ముక్కలు పంపిణీ చేశారు. సభకు తెలుగురాష్ట్రాలతోపాటు దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి లక్షలాదిగా తరలివచ్చారు. గురువారం రాత్రికే పిఠాపురం, గొల్లప్రోలుతోపాటు నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాలకు చేరుకున్న ఇతర ప్రాంతాల వారికి స్థానిక జనసేన నేతలు భోజన సదుపాయాలు ఏర్పాటుచేశారు. శుక్రవారం ఉదయం నుంచి కాకినాడ-కత్తిపూడి మధ్య గల 216 హైవే, పిఠాపురం-సామర్లకోట, బీచ్ రోడ్డు, పిఠాపురం పట్టణం, చిత్రాడకు వచ్చే అన్ని మార్గాల్లో పదుల సంఖ్యలో భోజనాల కౌంటర్లు ఏర్పాటుచేశారు. నియోజకవర్గ పరిధిలో 4 భోజన కేంద్రాలే ఏర్పాటు చేస్తున్నామని ముందు చెప్పినా, స్వచ్ఛందంగా పార్టీ నాయకులు ముందుకొచ్చి భోజనాలు ఏర్పాటు చేశారు. దివ్యాంగులకు వారి వాహనాలు, ట్రైసైకిల్స్‌కు వద్దకు వెళ్లి భోజనాలు అందజేశారు. మజ్జిగ, తాగునీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, పాలు పంపిణీకి భారీగా కౌంటర్లు ఏర్పాటు చేశారు. ఉదయం నుంచి రాత్రి వరకూ అందజేస్తూనే ఉన్నారు. తిరిగి వెళ్లేవారికి బస్సులు, ఇతర వాహనాల్లో భోజన ప్యాకెట్లు అందించారు. సభా ప్రాంగణానికి వెళ్లే దారుల్లో పుచ్చకాయలు అందజేశారు. సభ లోపల బిస్కెట్లు, మజ్జిగ, తాగునీరు నిరంతరాయంగా అందించారు.

సభా వేదిక ప్రత్యేకం..!

- ఇటలీ సౌండ్ సిస్టం.. విదేశీ సాంకేతికత
- అమెరికా సంస్థ బైట్‌గ్రాఫ్ ప్రొడక్షన్స్ ఏర్పాట్లు



కాకినాడ జిల్లా పిఠాపురం మండలం చిత్రాడ శివారులో ఏర్పాటు చేసిన అత్యాధునిక జనసేన ఆవిర్భావ సభా వేదిక

పిఠాపురం, మార్చి 14(ఆంధ్రజ్యోతి): ఇటలీకి చెందిన సౌండ్ సిస్టం.. విదేశీ సాంకేతిక నిపుణులతో ఆడియో, వీడియో వ్యవస్థ.. 100 అడుగుల దూరంలో ఉన్న వారికి, కిలోమీటరు దూరం నుంచి చూసే వారికి ఒకే విధంగా కనిపించేలా వేదిక.. జనసేన ఆవిర్భావ సభావేదిక ప్రత్యేకతలు ఇవీ. అంతర్జాతీయ స్థాయిలో చేసిన ఈ ఏర్పాట్లు ఆకట్టుకున్నాయి. అమెరికాకు చెందిన బైట్‌గ్రాఫ్ ప్రొడక్షన్స్ సంస్థ అధునాతన హంగులతో వేదికను తీర్చిదిద్దింది. 12 రోజులు 470 మంది సాంకేతిక నిపుణులు కష్టపడి 120 అడుగుల వెడల్పున వేదికను నిర్మించారు. ఇటలీ నిపుణులను రప్పించి సౌండ్‌సిస్టం ఏర్పాటు చేయించారు. ఎంత దూరం నుంచి చూసినా వేదికపై ఉన్న వారు స్పష్టంగా కనిపించేలా లైటింగ్, స్పష్టంగా వినిపించేలా సౌండ్ సిస్టంతో పాటు 23 ఎల్ఈడీ వాల్స్, 15 ఎల్ఈడీ స్క్రీన్స్ ఏర్పాటు చేశారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్, గత అధ్యక్షులు క్లింటన్, బుష్ తదితరుల సభలకు, అలాగే ప్రధాని మోదీ అమెరికా సభకు, అక్కడ జరిగే నాటా, ఆటాలతో పాటు మన దేశంలోని 23 రాష్ట్రాలకు చెందిన వారి అసోసియేషన్లు నిర్వహించే సభలకు రెండున్నర దశాబ్దాలుగా బైట్‌గ్రాఫ్ ఏర్పాట్లు చేస్తోంది. ఆ సంస్థకు తెలుగు వ్యక్తి ప్రశాంత్ కొల్లిపర సీఈవోగా ఉన్నారు. పవన్ కల్యాణ్‌పై అభిమానంతో ఆయన ఇక్కడకు వచ్చారు. జనసేన తరఫున తనను సంప్రదించినప్పుడు జనసేన పండుగలో పాలుపంచుకోవాలనే ఉద్దేశంతో ఇక్కడకు వచ్చానన్నారు.

'హయగ్రీవ'ను ఆనాడు లాక్కున్నారు

- 75 శాతం వాటా బలవంతంగా తీసుకున్నారు
- జీవీ, ఎంవీవీ బృందం నాకు అన్యాయం చేసింది
- భూకేటాయింపు రద్దును స్వాగతిస్తున్నా
- మంచి పనులకు ఆ భూమిని ఉపయోగించాలి
- హయగ్రీవ ఎండీ జగదీశ్వరుడు వ్యాఖ్యలు


హయగ్రీవ ఎండీ జగదీశ్వరుడు

విశాఖపట్నం, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): విశాఖలోని ఎండాడలో ఓల్డ్ ఏజ్ హోమ్‌కు కేటాయించిన 12.51 ఎకరాల భూమిని ప్రభుత్వం వెనక్కి తీసుకోవడాన్ని స్వాగతిస్తున్నానని హయగ్రీవ ఫార్మ్స్ అండ్ డెవలపర్స్ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ చిలుకూరి జగదీశ్వరుడు తెలిపారు. హైదరాబాద్‌లో ఉన్న ఆయన శనివారం 'ఆంధ్రజ్యోతి' ప్రతినిధితో ఫోన్‌లో మాట్లాడారు. నాడు భూమి కేటాయింపు, తరువాత జరిగిన పరిణామాలపై ఆయన ఏమన్నారంటే..."రియల్ ఎస్టేట్ వ్యాపారంలో ఉన్న మేం సేవాదృక్పథంతో ఓల్డ్ ఏజ్ హోమ్ నిర్మాణం కోసం 2008లో ప్రభుత్వం నుంచి భూమిని కొనుగోలు చేశాం. అక్కడ పనులు ప్రారంభించే సమయానికి వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో అనుమతులు లభించని పరిస్థితి ఏర్పడింది. అప్పటికి చాలా కాలంగా ఆడిటర్‌గా పరిచయం ఉన్న జి.వెంకటేశ్వరరావు (జీవీ) వైసీపీతో మంచి సంబంధాలు కలిగి ఉన్నారు. ప్రభుత్వ పెద్దలతో మాట్లాడి ప్రాజెక్టును ముందుకు తీసుకువెళతానని, అందుకోసం గద్దె బ్రహ్మాజీ అనే వ్యక్తిని మేనేజింగ్ పార్టనర్‌గా చేర్చాలని కోరారు. ఆయనపై నమ్మకంతో 2020 ఫిబ్రవరిలో బ్రహ్మాజీని భాగస్వామిగా చేర్చుకున్నాం. కానీ, ఏడాది కూడా కాకుండానే నన్ను సంస్థ నుంచి బయటకు గెంటేసే పరిస్థితి తీసుకువచ్చారు. అప్పుడప్పుడు అప్పుగా ఇచ్చిన మొత్తాలన్నీ లెక్కలేసి, సంస్థలో వారికి 75 శాతం దక్కుతుందని, నాకు 25 శాతం మాత్రమే వస్తుందని చెప్పి పత్రాలు తయారుచేసి వాటిపై బలవంతంగా నాతో, నా భార్యతో సంతకాలు చేయించుకున్నారు. వీటన్నింటికీ అప్పటి విశాఖ వైసీపీ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ, తదితరులు సహకారం అందించారు. నాకు తీవ్రమైన అన్యాయం జరగడంతో ఎవరికి చెప్పుకోవాలో తెలియక సెల్ఫీ వీడియో ఒకటి తీసి, అప్పటి ప్రభుత్వానికి పంపించాను. అది ఎలా లీకైందో తెలియదు గానీ మీడియా చేతికి వెళ్లి సోషల్ మీడియాలో వైరల్ అయింది. జీవీ, ఎంవీవీల బృందం నాకు అన్యాయం చేసిందని అందరికీ తెలిసింది. అయితే ప్రభుత్వం ఎవరిపైనా చర్యలు తీసుకోలేదు. రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం వచ్చాక కొంత నమ్మకం కలిగి ధైర్యంగా ఆరిలోవ పోలీస్‌స్టేషన్‌లో వారిపై ఫిర్యాదు చేశాను. విచారణ మొదలై అందులో మనీ లాండరింగ్ అంశాలు ఉన్నాయని తెలియడంతో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ రంగంలోకి దిగింది. ఎంవీవీ, జీవీ కార్యాలయాలు, ఇళ్లల్లో తనిఖీలు నిర్వహించింది. హయగ్రీవ భూములతో వారు నిర్వహించిన 12 లావాదేవీల్లో మనీ లాండరింగ్ జరిగిందని, వాటికి సంబంధించిన ఆధారాలతో సహా మీడియాకు ప్రకటన విడుదల చేసింది. ఇదిలా ఉండగా వైసీపీ ప్రభుత్వం ఉన్నప్పుడు ప్రాజెక్టు నిర్మాణానికి గద్దె బ్రహ్మాజీ పేరుతో జీవీఎంసీకి దరఖాస్తు చేశారు. కలెక్టర్ నుంచి ఎన్‌ఓసీ తీసుకున్నారు. అయితే ఇచ్చిన సమయంలోగా పనులు పూర్తి చేయలేదని నోటీసులు వచ్చాయి. ఇవన్నీ తెలిసి నిర్మాణ అనుమతులు రద్దు చేయాల్సిందిగా ప్రస్తుత ప్రభుత్వానికి నేను లేఖ రాశాను. అటు జిల్లా యంత్రాంగం, ఇటు ఈడీ నివేదికలన్నీ క్రోడీకరించిన ప్రభుత్వం, ఆ భూమిని వెనక్కి తీసుకుంటున్నట్టు ఈ నెల 10న ప్రకటించింది. వాస్తవానికి దీనివల్ల ఆర్థికంగా నాకు నష్టం జరిగింది. అయినా ప్రభుత్వం మంచి నిర్ణయమే తీసుకున్నదని అనిపిస్తోంది. హయగ్రీవ ప్రాజెక్టును పూర్తి వ్యాపారాత్మకంగా మార్చేశారు. అందుకే ప్రభుత్వం ఇప్పుడు ఆ భూమిని ఏమి చేసినా నాకు అభ్యంతరం లేదు. మంచి పనులకు ఉపయోగించాలని కోరుకుంటున్నాను." అని చిలుకూరి జగదీశ్వరుడు వివరించారు.

నిప్పుల కొలిమిలా రాయలసీమ

విశాఖపట్నం, మార్చి 14(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని అనేక ప్రాంతాల్లో శుక్రవారం వడగాడ్పులు వీచాయి. గాలిలో తేమ శాతం గణనీయంగా తగ్గడంతో వేడి వాతావరణం కొనసాగింది. ప్రధానంగా రాయలసీమ నిప్పుల కొలిమిలా మారింది. వడగాడ్పులతో ప్రజలు ఉక్కిరిబిక్కిరయ్యారు. వరుసగా రెండో రోజు శుక్రవారం రాయలసీమలో కొన్నిచోట్ల 40, అంతకంటే ఎక్కువ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. కర్నూలులో 41.2 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది.

రాజధానిలో శ్రీనివాసుడి కల్యాణం నేడు


అమరావతి రాజధాని ప్రాంతంలోని వెంకటపాలెంలో శనివారం జరిగే శ్రీనివాస కల్యాణోత్సవానికి ముస్తాబైన ఆలయం

- హాజరు కానున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

గుంటూరు, మార్చి 14(ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతిలోని వెంకటపాలెంలో జరగనున్న శ్రీనివాసుడి కల్యాణోత్సవం నిర్వహించడానికి టీటీడీ, జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేసింది. శనివారం సాయంత్రం 6.30 గంటల నుంచి 8.30 గంటల వరకు స్వామి వారి కల్యాణం జరుగుతుంది. కార్యక్రమానికి సీఎం చంద్రబాబు హాజరవుతున్నారు. టీటీడీ ఈవో శ్యామలరావు అధికారులతో సమీక్ష నిర్వహించారు. టీటీడీ దాదాపు 300 బస్సులు ఏర్పాటు చేసింది. తుళ్లూరు, తాడేపల్లి, తాడికొండ, మంగళగిరి మండలాల ప్రజలు సులువుగా చేరుకునేందుకు వీలుగా బస్సులను ఏర్పాటు చేశారు. విజయవాడనుంచి వచ్చే వారి కోసం మండంలో ప్రతి 5 నిమిషాలకు ఒక బస్సు ఏర్పాటు చేశారు. శనివారం సాయంత్రం 4 గంటల నుంచి స్వామి వారి కల్యాణాన్ని ప్రారంభిస్తారు. శ్రీనివాస కల్యాణోత్సవానికి రావాలని సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్‌ను టీటీడీ బోర్డు చైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో శ్యామలరావు, జేఈవో వెంకన్న చౌదరి, బోర్డు సభ్యులు ఆహ్వానించారు.


జస్టిస్ కృష్ణమోహన్ కుమారుడు ఆదర్శ్ వివాహ రిసెప్షన్ మంగళగిరిలోని సీకే కన్వెన్షన్‌లో శుక్రవారం జరిగింది. ఈ కార్యక్రమానికి సీఎం చంద్రబాబు హాజరై నవ దంపతులు ఆదర్శ్, సుప్రజను ఆశీర్వదించి, శుభాకాంక్షలు తెలిపారు.

అమరావతికి ప్రధాని మోదీ!?

- ఏప్రిల్ 3, 4 వారాల్లో వచ్చే అవకాశం

విజయవాడ, మార్చి 14(ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతి పనులకు ఏప్రిల్ మూడు, నాలుగు వారాల్లో ప్రధానమంత్రి నరేంద్రమోదీ శంకుస్థాపన చేసే అవకాశముందని తెలుస్తోంది. ఇటీవల ముఖ్యమంత్రి చంద్రబాబు ఢిల్లీ వెళ్లినప్పుడు అమరావతికి రావాల్సిందిగా ఆహ్వానించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో పునర్నిర్మాణ కార్యక్రమ పర్యటనకు మోదీ తప్పకుండా వస్తారని చెబుతున్నారు. అయితే, ఇంతవరకు ఎవరూ ధ్రువీకరించలేదు. విభజన తర్వాత టీడీపీ అధికారంలోకి వచ్చాక 2015, అక్టోబరు 22న అమరావతి పనులకు మోదీ శంకుస్థాపన చేసిన విషయం తెలిసిందే. ఆ తర్వాత హైకోర్టు, సచివాలయం, అసెంబ్లీ, శాసనమండలి, డీజీపీ కార్యాలయాలను ప్రభుత్వం పూర్తిచేసింది. అయితే, వైసీపీ ప్రభుత్వం రావడంతో అమరావతి విధ్వంసం జరగడమే కాకుండా, రాజధానిని అటకెక్కించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే పునర్నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టింది.

డీసీహెచ్‌ఎస్‌లుగా 9 మందికి పదోన్నతులు

అమరావతి, మార్చి 14(ఆంధ్రజ్యోతి): ఆరోగ్యశాఖ తొమ్మిది మంది వైద్యులకు ఆసుపత్రి సేవల జిల్లా సమన్వయ కర్తలు(డీసీహెచ్‌ఎస్)గా పదోన్నతి కల్పించింది. ప్రస్తుతం రాష్ట్రంలో ఆరు డీసీహెచ్‌ఎస్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి, త్వరలో మరో 2 ఖాళీలు ఏర్పడతాయి. శ్రీకాకుళం, విజయనగరం, తూర్పుగోదావరి, కృష్ణ, గుంటూరు, ప్రకాశం జిల్లాల్లో డీసీహెచ్‌ఎస్ పోస్టులు ఇప్పటికే ఖాళీగా ఉన్నాయి. నెల్లూరు, చిత్తూరు జిల్లాల్లో ఖాళీలు ఏర్పడతాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వం తొమ్మిది మందికి డీసీహెచ్‌ఎస్‌లుగా పదోన్నతులు ఇచ్చింది. కాగా, సెకండరీ హెల్త్ విభాగంలో 85 మంది వైద్యులు పదోన్నతికి అర్హులు. వారిలో 50 మంది ప్రమోషన్‌ను నిరాకరించారు. మిగిలిన వారిలో తొమ్మిది మందికి ప్రభుత్వం పదోన్నతి కల్పించింది.

అతివకు అందలం!

- మహిళా సంక్షేమం, ఆర్థిక స్వావలంబనకు ప్రాధాన్యం
- డ్వాక్రా ఉత్పత్తుల విక్రయానికి ఫ్లిప్‌కార్ట్‌తో ప్రభుత్వం ఒప్పందం

(అమరావతి-ఆంధ్రజ్యోతి)



మహిళా సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం ప్రణాళికలు రచిస్తోంది. పేదింటి పడతులు ఆర్థిక స్వావలంబన సాధించే దిశగా వడివడిగా అడుగులు వేస్తోంది. అతివల అభ్యున్నతికి ప్రాధాన్యం ఇవ్వాలన్న సీఎం చంద్రబాబు సంకల్పానికి అనుగుణంగా వారిని ఆర్థికంగా బలోపేతం చేయడం కోసం వివిధ పథకాలను చిత్తశుద్ధితో అమలు చేస్తోంది. జిల్లాల్లో వివిధ సంక్షేమ పథకాల కింద మహిళా లబ్ధిదారుల సంఖ్యను పెంచేందుకు నిరంతరం కలెక్టర్లను అప్రమత్తం చేస్తోంది. గడిచిన ఎనిమిది నెలల్లో రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లోనూ కలిపి మొత్తం 10,64,277 మంది మహిళలకు పింఛన్లు, డ్వాక్రా, దీపం 2.0 తదితర ప్రభుత్వ పథకాల ద్వారా రూ.4,418 కోట్ల ఆర్థిక ప్రయోజనాలను అందించారు. అలాగే 2025-26 బడ్జెట్‌లో మహిళా శిశు సంక్షేమ శాఖకు రూ.4వేల కోట్లు కేటాయించారు. దీపం-2 పథకం కింద 90.1 లక్షల మందికి ఉచిత గ్యాస్ సిలిండర్లు అందించారు. డ్వాక్రా మహిళలకు మెప్మా, స్త్రీనిధి ద్వారా రూ.వేల కోట్ల రుణాలు బ్యాంకు లింకేజీ ద్వారా అందిస్తున్నారు. గణాంకాల ప్రకారం మహిళా లబ్ధిదారులు అత్యధికంగా ఉన్న జిల్లాల్లో శ్రీసత్యసాయి (1,14,758 మంది), కాకినాడ (1,05,454 మంది) టాప్‌లో నిలిచాయి. అతి తక్కువ మహిళా లబ్ధిదారులతో అల్లూరి సీతారామరాజు జిల్లా (8,923 మంది), పార్వతీపురం మన్యం జిల్లా (11,520 మంది) చివరి స్థానాల్లో ఉన్నాయి. కర్నూలు, కృష్ణా, అల్లూరి సీతారామరాజు, కాకినాడ జిల్లాల్లో పూర్తిస్థాయిలో, ప్రభుత్వ లక్ష్యం కంటే ఎక్కువ సంఖ్యలోనే మహిళలకు ప్రయోజనాలు అందుతున్నాయి. మిగిలిన జిల్లాల్లో లక్ష్యంలో 80 శాతం నుంచి 99 శాతం వరకు ప్రయోజనాలు అందిస్తున్నారు. ఈ జిల్లాల్లోనూ లబ్ధిదారుల సంఖ్యను 100 శాతానికి చేరేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. మరోవైపు మే నెలలో అమలు చేయనున్న తల్లికి వందనం పథకం కోసం తాజా బడ్జెట్‌లో రూ.9,407కోట్లు కేటాయించారు. దీనివల్ల మరింతమంది మహిళలకు సంక్షేమ ప్రయోజనాలు దక్కనున్నాయి. ఇవికాకుండా బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మహిళలకు స్వయంఉపాధి కల్పించేందుకు పలు పథకాలు అమలు చేస్తున్నారు. కుట్టుపనిలో 90 రోజుల పాటు శిక్షణ ఇచ్చేందుకు ఇటీవల 175 నియోజకవర్గాల నుంచి 1,02,832 మంది మహిళలను ఎంపిక చేశారు. వీరంతా బీసీ, ఈడబ్ల్యూఎస్, కాపు సామాజిక వర్గాలకు చెందినవారు. శిక్షణ పూర్తయ్యాక వీరందరికీ ఉచితంగా కుట్టుమిషన్లను అందిస్తారు. ఈ మిషన్ల కొనుగోలుకు రూ.255కోట్లు ఖర్చవుతుందని అంచనా. అలాగే, మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయాలనే లక్ష్యంలో భాగంగా డ్వాక్రా సంఘాల ఉత్పత్తులను విక్రయించేందుకు ప్రముఖ ఆన్‌లైన్ వ్యాపార సంస్థ ఫ్లిప్‌కార్ట్‌తో ప్రభుత్వం ఒప్పందం చేసుకుంది. వ్యవసాయ, వ్యవసాయేతర ఉత్పత్తులపై డ్వాక్రా మహిళలకు వ్యాపార శిక్షణ అందించడం కోసం కేటలిస్ట్ మేనేజ్‌మెంట్ సర్వీసెస్‌తో సెర్ప్ ఒప్పందం కుదుర్చుకుంది. చిన్న తరహా హోటల్ వ్యాపారంలో డ్వాక్రా మహిళలకు అవగాహన కల్పించడానికి గాటోస్ కెఫేతో కూడా ఒప్పందం కుదుర్చుకోవాలని సెర్ప్ భావిస్తోంది. వివిధ సేవా రంగాల్లోకి మహిళల భాగస్వామ్యాన్ని విస్తరించి వారి ఆదాయ మార్గాలను మరింత మెరుగుపర్చేందుకు ప్రయత్నిస్తోంది. ఎలక్ట్రీషియన్లు, ప్లంబర్లు, కార్పెంటర్లు, బ్యూటీషియన్లు, గృహోపకరణ మరమ్మతుల విభాగంలో వారికి శిక్షణ ఇప్పించేందుకు హోం ట్రయాంగిల్ కంపెనీతో మెప్మా ఒప్పందం కుదుర్చుకుంది. దీనివల్ల 18,515 మంది మహిళలకు జీవనోపాధి అవకాశాలు లభిస్తాయి. అలాగే, డ్రైవింగ్ నైపుణ్యం ఉన్న వారిని ప్రోత్సహించేందుకు రాపిడో సర్వీస్‌తో మెప్మా ఒప్పందం చేసుకుంది. నైపుణ్యం, ఆసక్తి ఉన్న వెయ్యి మంది మహిళలకు ప్రభుత్వమే ఈ-బైక్‌లు, ఈ-ఆటోలు అందించనుంది. పీఎం విశ్వకర్మ పథకం ద్వారా 1,000 మంది మహిళలకు రూ.లక్ష చొప్పున రుణాలు ఇవ్వనుంది, మహిళా సంఘాల ద్వారా అరకు కాఫీ ప్రమోషన్‌కు 100 ఔట్‌లెట్‌లు, 100 కాఫీ హోటళ్లను ప్రభుత్వం ఏర్పాటు చేస్తోంది.

వివేకా హత్యకు నేటితో ఆరేళ్లు

248మంది విచారణ..ఎనిమిది మందిపై చార్జిషీట్.. ఇంకా పూర్తి కాని సీబీఐ దర్యాప్తు



- సాక్షులు,కీలక వ్యక్తుల అనుమానాస్పద మృతి
- కలకలం రేపిన రంగన్న మరణం

(కడప-ఆంధ్రజ్యోతి)

మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య జరిగి నేటికి (శనివారం) సరిగ్గా ఆరేళ్లు. ఈ కేసులో సాక్షులు, కీలక వ్యక్తులు అనుమానాస్పద స్థితిలో మరణిస్తున్నారు. వివేకా వాచ్‌మెన్, ఈ కేసులో ప్రత్యక్ష సాక్షి రంగన్న మరణం తాజాగా కలకలం రేపింది. ఇలా.. వివేకా హత్య నుంచి రంగన్న అనుమానాస్పద మరణం దాకా.. ఈ కేసు ఊహించని మలుపులు తిరుగుతోంది. 2019లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా మార్చి 14వ తేదీ రాత్రి కడప జిల్లా జమ్మలమడుగు ప్రాంతంలో ప్రచారం నిర్వహించిన వైఎస్ వివేకానందరెడ్డి రాత్రి పొద్దుపోయాక పులివెందులలోని ఇంటికి వచ్చారు. మరుసటి రోజు (15వ తేదీ) తెల్లవారే సరికి తన ఇంటిలోనే హత్యకు గురై కనిపించారు. అయితే 'నారాసుర రక్తచరిత్ర' అంటూ అప్పటి సీఎం చంద్రబాబును ఉద్దేశించి జగన్ మీడియాలో కట్టుకథలు వండి వార్చారు. తన బాబాయి వివేకా హత్యను ఆ ఎన్నికల్లో జగన్ ప్రచారాస్త్రంగా వాడుకున్నారు. ఇది సానుభూతి అస్త్రంగా మారి జగన్ గెలుపునకు బాటలు వేసింది. వివేకా హత్య జరిగినప్పుడు టీడీపీ అధికారంలో ఉంది. వివేకా పీఏ ఎం.వెంకటకృష్ణారెడ్డి ఫిర్యాదుతో పులివెందులలో క్రైం నెంబరు 24/2019 గా కేసు నమోదు అయింది. వివేకా హత్యకు గురికాగా.. మొదట గుండె పోటుగా చిత్రీకరించారు. తర్వాత రక్తపు వాంతులు చేసుకున్నారని ప్రచారం చేశారు. బెడ్‌రూం, బాత్‌రూమ్‌లోని రక్తాన్ని ఆనవాళ్లు లేకుండా కనుమరుగు చేశారు. అదే ఏడాది మే 30న జగన్ సీఎంగా ప్రమాణం చేశారు. సీఎం కాకముందు సీబీఐ విచారణ అంటూ కోర్టులో పిటిషన్ వేసిన జగన్.. ఆ తరువాత దానిని ఉపసంహరించుకున్నారు. కేసు విషయంలో జగన్ వైఖరిలో తేడా కనిపించడంతో వివేకా కుమార్తె డాక్టర్ సునీత సీబీఐ విచారణకు కోరారు. అందుకు హైకోర్టు అంగీకరించడంతో సీబీఐ విచారణ ప్రారంభించింది. 2023 ఫిబ్రవరి 20 నాటికే సుమారు 248 మందిని విచారించింది.

ఆ ఐదేళ్లూ బెదిరింపులు, వేధింపులు

వివేకా హత్య కేసులో కడప ఎంపీ వైఎస్ అవినాశ్ రెడ్డి, ఆయన తండ్రి వైఎస్ భాస్కర్‌రెడ్డితోపాటు వైసీపీ కీలక నేత దేవిరెడ్డి శంకర్‌రెడ్డి, వివేకా మాజీ డ్రైవర్ దస్తగిరి, ఎర్రగంగిరెడ్డి, సునీల్ యాదవ్, గజ్జల ఉమాశంకర్‌రెడ్డి, ఉదయ్‌కుమార్‌రెడ్డి.. మొత్తం ఎనిమిది మందిపై సీబీఐ చార్జిషీట్ నమోదు చేసింది. వీరిలో డ్రైవరు దస్తగిరి అప్రూవర్‌గా మారారు. సీబీఐ అధికారులను అప్పట్లో బెదిరించారు. సీబీఐ విచారణ అధికారి రాంసింగ్‌పై కేసు నమోదు చేయించారు. దస్తగిరి అప్రూవర్‌గా మారడంతో హత్య వెనుక ఎవరెవరు ఉన్నారనే విషయం వెలుగులోకి వచ్చింది.

అనుమానాస్పదంగా...

వివేకా కేసుతో సంబంధం ఉన్న చాలామంది గత ఆరేళ్లలో అనుమానాస్పద స్థితిలో మరణించారు. ఈ ఏడాది జనవరి 10న జగన్‌కు వరసకు సోదరుడు వరుస అయ్యే వైఎస్ అభిషేక్‌రెడ్డి అనారోగ్యంతో మృతి చెందారు. ఆయనను సీబీఐ 2021లో విచారించగా, వివేకా చనిపోయినట్లు దేవిరెడ్డి శంకర్‌రెడ్డి నుంచి ఫోన్ కాల్ వచ్చిందని వాంగ్మూలం ఇచ్చారు. కల్లూరు గంగాధర్‌రెడ్డి 2022 జూన్‌లో అనారోగ్యంతో మృతి చెందినట్లు ప్రచారంచేశారు. 'నేరాన్ని నీపై వేసుకుంటే కడప ఎంపీ అవినాశ్‌రెడ్డి, ఆయన తండ్రి భాస్కర్‌రెడ్డి రూ.10కోట్లు ఇస్తారు. నీ జీవితం సెటిల్ చేస్తారం'టూ దేవిరెడ్డి శంకర్‌రెడ్డి ఆఫర్ ఇచ్చారని, అయితే దానిని తాను తిరస్కరించానని గంగాధర్‌రెడ్డి 2021 అక్టోబరులో సీబీఐకి వాంగ్మూలం ఇచ్చారు. ఆ తరువాత సీబీఐనే తనను బలవంతం చేసి అలా చెప్పించిందని మాట మార్చారు. సింహాద్రిపురం మండలం కసునూరుకు చెందిన కె.శ్రీనివాసులరెడ్డి 2019 సెప్టెంబరు 3న అనుమానాస్పద స్థితిలో మృతి చెందారు. శ్రీనివాసుల రెడ్డి బావ పరమేశ్వర్‌రెడ్డిపై వివేకా హత్య కేసుకు సంబంధించి ఆరోపణలు వచ్చాయి. జగన్ డ్రైవరుగా పనిచేసిన నారాయణయాదవ్ 2019 డిసెంబరు 6న మృతి చెందారు. వివేకా హత్య జరిగిన సమయంలో హైదారబాద్‌లో ఉన్న జగన్, భారతి వాహనంలో రోడ్డు మార్గాన పులివెందులకు వచ్చారు. ఆ సమయంలో వారికి నారాయణయాదవ్ డ్రైవర్‌గా ఉన్నారు. ఇక జగన్ మామ ఈసీ గంగిరెడ్డి 2020 అక్టోబరు 3న అనారోగ్యంతో మృతి చెందారు. వివేకా మృతదేహానికి గంగిరెడ్డి ఆస్పత్రిలోనే కుట్లు, బ్యాండేజీ వేశారు. తాజాగా ఈ నెల ఐదోతేదీన రంగన్న అనుమానాస్పద స్థితిలో మరణించారు.


డయాలసిస్ కేంద్రంలో రోగితో మాట్లాడుతున్న మంత్రులు సత్యకుమార్, నిమ్మల తదితరులు

ప్రధాన ఆసుపత్రులన్నింటిలో డయాలసిస్ కేంద్రాలు

- రెండేళ్లలో అందుబాటులోకి పాలకొల్లు వైద్య కళాశాల: మంత్రి సత్యకుమార్
- రూ.కోటితో ఏర్పాటు చేసిన కేంద్రాన్ని ప్రారంభించిన మంత్రి

పాలకొల్లు టౌన్, మార్చి 14(ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా ప్రధాన ఆసుపత్రుల్లో డయాలసిస్ కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్టు మంత్రి సత్యకుమార్ తెలిపారు. పాలకొల్లు ప్రభుత్వాసుపత్రిలో రూ.కోటితో ఏర్పాటు చేసిన డయాలసిస్ కేంద్రాన్ని శుక్రవారం మరో మంత్రి నిమ్మల రామానాయుడితో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... 'రాష్ట్రవ్యాప్తంగా క్యాన్సర్, డయాబెటిస్, టీబీ, కిడ్నీ పనిచేయక పోవడం వంటి ఆరోగ్య సమస్యలు ఉన్న వారి వివరాలను తెలుసుకునేందుకు సర్వే చేపట్టాం. దీనిఆధారంగా వారిఆరోగ్య సంరక్షణకు చర్యలు తీసుకుంటాం. ఇప్పటికే గుండెపోటు నివారణకు పీహెచ్‌సీల్లో ఉచితంగా ఇంజక్షన్లను అందుబాటులోకి తెచ్చాం. రెండేళ్లలో పాలకొల్లులోని మెడికల్ కాలేజ్ నిర్మాణం పూర్తి చేస్తాం' అని తెలిపారు. కాగా, ప్రపంచ స్థాయి నగరంగా రాజధాని అమరావతి నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి సత్యకుమార్ పేర్కొన్నారు. సీఆర్‌డీఏ సమావేశంలో రూ.37,702 కోట్లు విలువ చేసే 59 అభివృద్ధి పనుల టెండర్లకు ప్రభుత్వం ఆమోదం తెలిపిందన్నారు.

టీడీఆర్ బాండ్ల జారీకి నిర్దిష్ట గడువు

- అధికారులను బాధ్యులను చేసిన ప్రభుత్వం
- ఫైళ్ల క్లియరెన్స్ సమయపాలనపై విధివిధానాలు

అమరావతి, మార్చి 14(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా పట్టణ ప్రాంతాల్లో స్థలాలు కోల్పోయిన వారికి టీడీఆర్ బాండ్ల జారీ చేసే విషయంలో జాప్యాన్ని నివారించేందుకు మున్సిపల్, పట్టణాభివృద్ధి శాఖ చర్యలు ప్రారంభించింది. ఇటీవల అసెంబ్లీలో పలువురు ఎమ్మెల్యేలు టీడీఆర్ బాండ్ల జారీలో వైసీపీ హయాంలో భారీగా అక్రమాలు జరిగాయని, వైసీపీ నేతలు టీడీఆర్ బాండ్లను పంచుకున్నారని ఫిర్యాదులు చేశారు. దానిపై మంత్రి నారాయణ స్పందిస్తూ... టీడీఆర్ బాండ్లపై గత ప్రభుత్వంలో జరిగిన అవకతవకలపై సీఐడీ విచారణ చేపట్టామని చెప్పారు. ఈ నేపథ్యంలో టీడీఆర్ బాండ్ల జారీ ప్రక్రియ మందకొడిగా సాగుతోందని పలువురు ఎమ్మెల్యేలు సభ దృష్టికి తెచ్చారు. దీంతో మంత్రి నారాయణ ఆదేశాలతో మున్సిపల్, పట్టణాభివృద్ధిశాఖ టీడీఆర్ బాండ్ల జారీకి నిర్దిష్ట గడువు విధిస్తూ మార్గదర్శకాలు రూపొందించింది. ఆయా అధికారులు ఎంత కాలం లోపు ఫైల్ క్లియర్ చేయాలన్న దానిపై నిబంధనలు రూపొందించి ఆదేశాలిచ్చారు. టీడీఆర్ బాండ్ల ప్రక్రియ ఇక నుంచి మాన్యువల్‌గా కాకుండా ఆన్‌లైన్‌లో చేపట్టాలని సూచించారు. ఈ ప్రక్రియ మొత్తం 50 రోజుల్లో పూర్తి చేయాలని గడువు విధించారు.

13 మంది 'అగ్రి' సూపరింటెండెంట్ల డిప్యుటేషన్లు రద్దు

- ఉత్తర్వులు జారీ చేసిన రిజిస్ట్రార్

[ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్]

గుంటూరు సిటీ, మార్చి 14(ఆంధ్రజ్యోతి): ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయానికి చెందిన తిరుపతి వ్యవసాయ కళాశాల, ఇతర కార్యాలయాల్లో తిష్టవేసిన 13 మంది సూపరింటెండెంట్లకు ఎట్టకేలకు స్థానచలనం కలిగింది. అక్కడ కేవలం నాలుగు పోస్టులు మాత్రమే ఉండగా, 13 మంది సూపరింటెండెంట్లు డిప్యుటేషన్లపై పని చేస్తున్నారు. దీనిపై ఈ నెల 7వ తేదీన 'ఎన్‌జీ రంగా వ్యవసాయ యూనివర్సిటీలో వైసీపీ రాజ్యం' అనే శీర్షికతో 'ఆంధ్రజ్యోతి' ప్రధాన సంచికలో ప్రత్యేక కథనం ప్రచురితమైంది. అప్రమత్తమైన వర్సిటీ అధికారులు దిద్దుబాటు చర్యలకు ఉపక్రమించారు. పెరుమాళ్లపల్లె రిసెర్చ్ స్టేషన్ సూపరింటెండెంట్ కె.మునిరత్నంను లాం అడ్మినిస్ట్రేటివ్ కార్యాలయానికి, తిరుపతి పాలిటెక్నిక్ అగ్రికల్చర్ కాలేజీ సూపరింటెండెంట్ ఎస్‌వీఎస్ రాజేష్ కుమార్‌ను మార్టేరుకు, తిరుపతి ఇంజనీరింగ్ డివిజన్ సూపరింటెండెంట్ సుశీలను లాంలోని కంప్ట్రోలర్ పేషీకి, తిరుపతి రీజనల్ అకౌంట్స్ కార్యాలయం సూపరింటెండెంట్ జె.రెడ్డిమునిని లాం అడ్మినిస్ట్రేటివ్ కార్యాలయానికి, తిరుపతి ఐఏబీఎంలో సూపరింటెండెంట్ కె.సుబ్రహ్మణ్యం రెడ్డి, కలికిరి పాలిటెక్నిక్ అగ్రికల్చర్ కాలేజ్ సూపరింటెండెంట్ కె.కుమార్‌లను పులివెందులకు, తిరుపతి రీజనల్ అకౌంట్స్ కార్యాలయం సూపరింటెండెంట్ కె.చంద్రబాబును ఉదయగిరి వ్యవసాయ కళాశాలకు, తిరుపతి రీజనల్ అకౌంట్స్ కార్యాలయం సూపరింటెండెంట్ వసంతను సోమశిల పాలిటెక్నిక్ అగ్రికల్చర్ కళాశాలకు, తిరుపతి రీజనల్ అగ్రికల్చర్ రిసెర్చ్ స్టేషన్లో ఉన్న టి.భాస్కర్ నాయుడుని లాం వర్సిటీకి, అనకాపల్లి రీజనల్ అగ్రి రీసెర్చ్ స్టేషన్లోని సింహాచలంను కల్యాణదుర్గం కేవీకేకు, తిరుపతి ఎస్వీ వ్యవసాయ కళాశాలలో ఉన్న మీనాకుమారిని ఉదయగిరి అగ్రి కళాశాలకు, మహానంది వ్యవసాయ కళాశాలలో ఉన్న బి.వేణుగోపాల్‌ను ఉదయగిరికి బదిలీ చేశారు.

నేటి నుంచి ఏపీఈఏపీసెట్ దరఖాస్తులు

- ఏప్రిల్ 24 వరకు దరఖాస్తు చేసుకోవచ్చు
- మే19 నుంచి 27 వరకు ఆన్‌లైన్‌లో పరీక్షలు: చైర్మన్ సీఎస్ఆర్కే ప్రసాద్



జేఎన్టీయూకే, మార్చి 14(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ఇంజనీరింగ్, అగ్రికల్చర్ ఫార్మసీ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ (ఏపీఈఏపీసెట్)-2025కు శనివారం నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు జేఎన్టీయూకే ఉప కులపతి, ఏపీఈఏపీసెట్ చైర్మన్ సీఎస్ఆర్కే ప్రసాద్ తెలిపారు. దీనికి సంబంధించిన నోటిఫికేషన్ ఈ నెల 12న విడుదల చేశారన్నారు. ఎటువంటి అపరాధ రుసుము లేకుండా ఏప్రిల్ 24 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని, మే 19 నుంచి 27 వరకు ఆన్‌లైన్ విధానంలో పరీక్షలు నిర్వహిస్తామని తెలిపారు. రాష్ట్రంలో 46, తెలంగాణలోని హైదరాబాద్‌లో 2... మొత్తం 48 కేంద్రాల్లో పరీక్షలు నిర్వహిస్తామని చెప్పారు. https://-cets.apsche.ap.gov.in వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు పూరించాలని సూచించారు. మే 19 నుంచి 20 వరకు అగ్రికల్చర్, ఫార్మసీ విభాగాలకు రోజుకు రెండు సెషన్లలో పరీక్షలు నిర్వహిస్తామని, ఇంజనీరింగ్ విభాగంలో మే 21 నుంచి 27 వరకు పరీక్షలు జరుగుతాయని ఏపీఈఏపీసెట్ కన్వీనర్ వీవీ సుబ్బారావు తెలిపారు. మే 24న పరీక్ష ఒక సెషన్‌లో మాత్రమే ఉంటుందని, 25న పరీక్ష ఉండదన్నారు. పరీక్షలు ఉదయం 9 నుంచి 12 గంటల వరకు, మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకు జరుగుతాయని చెప్పారు.

ఫీజు వివరాలు: ఓసీ రూ.600, బీసీ రూ.550, ఎస్సీ, ఎస్టీలు రూ.500 చొప్పున ఆన్‌లైన్ గేట్‌వే ద్వారా దరఖాస్తు రుసుం చెల్లించాలి. అపరాధ రుసుం రూ.1,000తో మే 1, రూ.2000తో మే 7, రూ.4వేలతో మే 12, రూ.10వేలతో మే 16 వరకు దరఖాస్తు చేసుకోవచ్చు. ఉర్దూ మాధ్యమాన్ని ఎంచుకున్న విద్యార్థులకు కర్నూలు ప్రాంతీయ కేంద్రంలో మాత్రమే పరీక్ష కేంద్రాన్ని కేటాయిస్తారు.

కొత్తగా అపార్ ఐడీ ఆప్షన్

ఏపీఈఏపీసెట్ దరఖాస్తులో ఈ ఏడాది కొత్తగా అపార్ ఐడీ ఆప్షన్ ఇచ్చారు. ఇది ఆప్షనల్ మాత్రమే, అపార్ ఐడీ లేకపోయినా పరీక్షకు అనుమతిస్తారు. కౌన్సెలింగ్ సమయానికి కాలేజీ నుంచి అపార్ ఐడీ పొందాలి. ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు అర్హత ఉన్న విద్యార్థులు దరఖాస్తులో నూతన ఆదాయ ధ్రువీకరణ పత్రం నంబరు పేర్కొనాలి. రిజర్వేషన్ పొందే విద్యార్థులు కుల ధ్రువీకరణ పత్రం నంబరు పేర్కొనాలి. విద్యార్థులు తప్పనిసరిగా తమకు సమీపంలోని 5 కేంద్రాలను ఎంపిక చేసుకోవాలి. ఎవరు ముందుగా ఎంపిక చేసుకుంటారో వారికి ప్రాధాన్యతాక్రమంలో కేంద్రాన్ని కేటాయిస్తారు. ఈఏపీసెట్‌లో 75శాతం, 10+2 పరీక్షల్లోని గ్రూప్ మార్కుల నుంచి 25 శాతం వెయిటేజీతో కలిపి ర్యాంకులు కేటాయిస్తారు. మే 6నుంచి 8 వరకు దరఖాస్తుల్లో సవరణకు అవకాశం కల్పిస్తారు. మే 12 నుంచి హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ర్యాంకు కార్డులను ఈఏపీసెట్ వెబ్‌సైట్‌తో పాటు మనమిత్ర వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా కూడా డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. విద్యార్థులు సందేహాల నివృత్తికి https://cets.apsche.ap.gov.in వెబ్‌సైట్ ద్వారా గానీ 0884-2359599, 2342499 నంబర్లలో గానీ, helpdeskapeapcet@apsche.org మెయిల్ ఐడీ ద్వారా గానీ సంప్రదించవచ్చని కన్వీనర్ సుబ్బారావు వివరించారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : N.Rahul Kumar, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.

చామదుంపలతో లాభాలెన్నో!

దుంపలు అనేక రకాలు. వీటిలో చామదుంపలకు కొన్ని ప్రత్యేకతలున్నాయి. ముందుగా వాటికి ఆ పేరు ఎలా వచ్చిందో తెలుసుకుందాం. కొద్దిగా నలుపు కలిసిన ఎరుపు రంగును చామనచాయ అంటారు. అలాంటి రంగు ఉన్న దుంపలు కాబట్టి వీటిని చామ దుంపలు అంటారు. దీని పైన ఉండే తొక్క చామనచాయగా ఉంటుంది. కానీ దానిలోని దుంప తెల్లగా ఉంటుంది. దీనిలో ఎక్కువగా పిండి పదార్థాలు ఉంటాయి. అందువల్ల భోజన కుతూహలం గ్రంధం దీనిని 'పిండాలూ దుంప' అని పేర్కొంది. ఈ దుంపల్లో బి విటమిన్, ఇనుము, జింకు,భాస్వరం, రాగి, మాంగనీసు, పొటాషియం సమృద్ధిగా ఉంటాయి. కొంత భాగం ఆహార పీచు కూడా ఉంటుంది. అందువల్ల త్వరగా అరుగుతాయి. ఇక ఆయుర్వేద గ్రంథాల ఆధారంగా చూస్తే

భోజనకుతూహలం
ఆహారంతో ఆరోగ్యం

- ఇవి రక్తస్రవాన్ని అరికడతాయి. కాలేయం సంబంధిత వ్యాధుల్లో బాగా పనిచేస్తాయి. కాలేయ వాపును తగ్గిస్తాయి.
- ఈ దుంపలను ఉడికించినప్పుడు జిగురు ఎక్కువ అవుతుంది. ఈ జిగురు నరాల బలహీనతను తగ్గిస్తుంది. నాడీ వ్యవస్థను బలోపేతం చేస్తుంది.
- చేమ దుంపలు శరీరానికి చలవ చేస్తాయి. మూత్రం సాఫీగా కావటానికి తోడ్పడతాయి. మధుమేహ వ్యాధి ఉన్నవారిలో అరికాళ్లు, అరిచేతుల్లో మంటలు ఉంటాయి. వీటిని చేమ దుంపలు తగ్గిస్తాయి.
- చేమ దుంపలు శరీరానికి పునరుత్తేజం పొందటానికి ఉపయోగపడతాయి. సూర్యరశ్మి వలన కలిగే నష్టాలను అరికడతాయి.

అందుకే వేసవిలో చేమ దుంపలను ఎక్కువగా తినమని ఆయుర్వేద వైద్యులు చెబుతూ ఉంటారు.

- గంగరాజు అరుణాదేవి



వంటిల్లు

ద్రాక్షపండ్లను చూడగానే చటుక్కున నోట్లో వేసుకోనివారు ఉండరు. పుల్లగా, తియ్యగా ఉంటూ ఇంకా ఇంకా తినాలనిపిస్తూ ఉంటాయి. ఇలాంటి ద్రాక్షతో నోరూరించే సరికొత్త వంటకాలు మీ కోసం...





ద్రాక్షతో కొత్తగా... నోరూరేలా..!



కట్టా మీఠా కూర

కావాల్సిన పదార్థాలు

పుల్లని ద్రాక్ష పండ్లు- అర కేజీ, నూనె- రెండు చెంచాలు, జీలకర్ర- పావు చెంచా, ఆవాలు- పావు చెంచా, మెంతులు- పావు చెంచా, సోంపు- పావు చెంచా, ఇంగువ- చిటికెడు, అల్లం తరుగు- ఒక చెంచా, పచ్చి మిర్చి ముక్కలు- ఒక చెంచా, ఎండు మిర్చి- నాలుగు, పసుపు- పావు చెంచా, ఉప్పు- అర చెంచా, ఖర్జూరాలు- ఎనిమిది, జీడిపప్పు పలుకులు- రెండు చెంచాలు, కారం- ఒక చెంచా, బెల్లం పొడి- మూడు చెంచాలు, నల్ల ఉప్పు- చిటికెడు

తయారీ విధానం

- ద్రాక్ష పండ్లను నీటితో కడిగి శుభ్రం చేసుకోవాలి. ఖర్జూరాలను చిన్న ముక్కలుగా కోయాలి.
- స్టవ్ మీద మందపాటి గిన్నె పెట్టి నూనె వేసి వేడి చేయాలి. ఇందులో ఆవాలు, జీలకర్ర, మెంతులు, సోంపు, ఇంగువ, ఎండు మిర్చి, పచ్చి మిర్చి ముక్కలు, అల్లం తరుగు వేసి బాగా కలపాలి. తరవాత ద్రాక్ష పండ్లు, పసుపు, ఉప్పు వేసి కలిపి మూతపెట్టి మగ్గించాలి. అయిదు నిమిషాల తరవాత ఖర్జూరం ముక్కలు, జీడిపప్పు పలుకులు, కారం, బెల్లం వేసి కలపాలి. మూడు నిమిషాల తరవాత చిటికెడు నల్ల ఉప్పు వేసి కలిపి స్టవ్ మీద నుంచి దించాలి. తియ్యగా, పుల్లగా, కారంగా ఉండే ఈ కూర వేడి అన్నం, చపాతీ, పుల్కా, పరాటాల్లోకి బాగుంటుంది.

జాగ్రత్తలు

- ద్రాక్ష పండ్లు అంత పుల్లగా లేని పక్షంలో కొద్దిగా చింతపండు గుజ్జు కలుపుకుంటే కూర రుచి బాగుంటుంది.
- ఎండు ఖర్జూరాలు తీసుకున్నట్లయితే వాటిని మంచినీటిలో పది నిమిషాలు నానబెట్టాలి. అదే ముద్ద ఖర్జూరమైతే నేరుగా వాడుకోవచ్చు.
- ద్రాక్ష పండ్లను మరీ మెత్తగా ఉడికించకూడదు.

ద్రాక్ష హల్వా

కావలసిన పదార్థాలు

ద్రాక్ష పండ్లు- ఒక కేజీ, కార్న్‌ఫ్లోర్- ఒక కప్పు, పంచదార- రెండు కప్పులు, ఫుడ్ కలర్(గ్రీన్)- చిటికెడు, నెయ్యి- మూడు చెంచాలు, బాదం పలుకులు- ఒక చెంచా, కర్బూజా గింజలు- ఒక చెంచా, జీడిపప్పు పలుకులు- ఒక చెంచా

తయారీ విధానం

- ముందుగా ద్రాక్షపండ్లను ఉప్పు నీటితో కడగాలి. బాదం, జీడిపప్పులను సన్నని పలుకుల్లా కోయాలి. ఒక పళ్లేనికి నెయ్యి రాసి దాని మీద బాదం పలుకులు, జీడిపప్పు పలుకులు, కర్బూజా గింజలు చల్లి ఉంచాలి.
- మిక్సీ గిన్నెలో ద్రాక్ష పండ్లు వేసి కొన్ని నీళ్లు పోసి మెత్తగా గ్రైండ్ చేయాలి. ఈ మిశ్రమాన్ని ఫిల్టర్ సహాయంతో వెడల్పాటి గిన్నెలోకి వడబోసి రసాన్ని సిద్ధం చేసుకోవాలి. ఇందులో కొద్దికొద్దిగా కార్న్‌ఫ్లోర్ వేస్తూ ఉండలు కట్టకుండా జాగ్రత్తగా కలపాలి.
- స్టవ్ మీద మందపాటి గిన్నె పెట్టి పంచదార వేసి అర కప్పు నీళ్లు పోసి చిన్న మంట మీద మరిగించాలి. పంచదార మొత్తం కరిగాక ఇందులో కార్న్‌ఫ్లోర్-ద్రాక్షపళ్ల రసాన్ని మెల్లగా పోస్తూ కలపాలి. ఈ మిశ్రమాన్ని రెండు నిమిషాల వరకూ గంటెతో తిప్పుతూనే ఉండాలి. తరవాత ఫుడ్ కలర్, నెయ్యి వేసి బాగా కలపాలి. ఈ మిశ్రమం గిన్నెకు అంటుకోకుండా హల్వా మాదిరి తయారైన తరవాత స్టవ్ మీద నుంచి దించాలి. ఈ హల్వాని ముందుగా సిద్ధం చేసుకున్న పళ్లెంలోకి తీసి సమంగా పరచాలి. పది నిమిషాల తరవాత ఈ పళ్లేన్ని మరోదానిపై బోర్లించి పైన తడితే కేక్ మాదిరి వచ్చేస్తుంది. దీన్ని ముక్కలుగా కోసి ఇస్తే పిల్లలు ఇష్టంగా తింటారు.

జాగ్రత్తలు

- తియ్యగా ఉండే సీడ్‌లెస్ ద్రాక్ష పండ్లను ఎంచుకుంటే హల్వా రుచి బాగుంటుంది.
- కార్న్‌ఫ్లోర్‌లో కొద్దిగా ద్రాక్షరసం చిలకరిస్తూ గంటె జారుడు మిశ్రమంలా కలపాలి. దీన్ని ద్రాక్షరసం గిన్నెలో పోస్తూ కలిపితే రెండూ చక్కగా కలుస్తాయి.



ద్రాక్ష పచ్చడి

కావాల్సిన పదార్థాలు

పుల్లని ద్రాక్ష పండ్లు- పావు కేజీ, పచ్చి మిర్చి- రెండు, వెల్లుల్లి రెబ్బలు- నాలుగు, నల్ల ఉప్పు- అర చెంచా, మిరియాల పొడి- అర చెంచా, కొత్తిమీర- అయిదు రెమ్మలు, ఉప్పు- తగినంత

తయారీ విధానం

- వెల్లుల్లి రెబ్బలకు పొట్టు తీసి ఉంచుకోవాలి. కొత్తిమీర రెమ్మలను నీటితో కడిగి కాడలు తుంచి పెట్టుకోవాలి.
- మిక్సీ గిన్నెలో పచ్చి మిర్చి, వెల్లుల్లి రెబ్బలు, నల్ల ఉప్పు, మిరియాల పొడి, కొత్తిమీర, ద్రాక్ష పండ్లు, చిటికెడు ఉప్పు వేసి కొన్ని నీళ్లు చిలకరించి మెత్తగా గ్రైడ్ చేయాలి. తరవాత గిన్నెలోకి తీయాలి. పుల్లగా ఘాటుగా ఉండే ఈ పచ్చడి పులావు, పరాటా, పుల్కా, చపాతీల్లోకి బాగుంటుంది.

జాగ్రత్తలు

- వెల్లుల్లి అంటే ఇష్టం లేనివారు దాన్ని వేసుకోనక్కర్లేదు
- పచ్చడి కమ్మగా కావాలనుకుంటే కొద్దిగా పుట్నాలపప్పు లేదా కొన్ని వేయించిన పల్లీలు వేసి గ్రైండ్ చేయాలి.

ఫిట్‌నెస్

కాళ్లకీ కావాలి వ్యాయామం

కాళ్లలో కదలికలు సక్రమంగా ఉంటేనే నడవడం, పరుగెత్తడం, సమతుల స్థితిలో నిలబడడం సాధ్యమవుతుంది. కాళ్లు ఆరోగ్యంగా దృఢంగా ఉండేందుకు నిపుణులు సూచిస్తున్న వ్యాయామాలు ఇవే...

మోకాళ్లను వంచండి...

దీనిలో ఒక మోకాలును ముందుకు వంచి రెండో మోకాలును నేరుగా పెట్టాలి. దీనివల్ల తొడలు, కాళ్లలో పేరుకున్న అదనపు కొవ్వు కరుగుతుంది. మోకాళ్లను సులభంగా వంచగలుగుతారు. పాదాల్లోని కండరాలు బలపడతాయి.



కుర్చీలో కూర్చున్నట్లు...

ఒక కుర్చీలో కూర్చున్నట్లు ఊహించుకోండి. కొద్దిగా అటూ ఇటూ కదలండి. ఇలా రోజుకు 15 నిమిషాలు చేస్తే కాళ్లలో సత్తువ పెరుగుతుంది. మోకాళ్ల కీళ్ల బలపడతాయి. తొడల కింది భాగంలో పేరుకుపోయిన కొవ్వు కరుగుతుంది.



కేరింతలు...

చిన్నపిల్లలు పడుక్కొని కాళ్లు చేతులు పైకి కిందికీ ఊపుతూ ఉంటారు. ఎయిర్‌సైక్లింగ్ కూడా ఇలాంటిదే. ప్రతిరోజూ ఉదయం లేవగానే ఎయిర్ సైక్లింగ్ చేస్తే కాళ్లలో బిగుసుకున్న కండరాలు వ్యాకోచం చెందుతాయి. వెన్ను నొప్పి తగ్గుతుంది.



సగం వంగి...

చాలా మంది సులభంగా వంగలేరు. కాళ్లను మడవటానికి కూడా ఇబ్బంది పడతారు. ఇలాంటి వారు కాళ్లను సగం వంచి అటూ ఇటూ కదిలితే... నడుము భాగం నుంచి పాదాల వరకూ ఉన్న కండరాల నొప్పులు, తిమ్మిర్లు తగ్గిపోతాయి. కీళ్లవాతం సమస్యల నుంచి ఉపశమనం కలుగుతుంది. కాళ్లకు రక్తప్రసరణ సక్రమంగా జరుగుతుంది.



అభీ... ఆమిర్ దిల్ మే గౌరీ

"ప్రస్తుతం ఒక మహిళతో డేటింగ్ చేస్తున్నా..." అంటూ బాలీవుడ్ స్టార్ హీరో ఆమిర్ ఖాన్ ముంబయిలో గురువారం తన ప్రీ బర్త్‌డే మీడియా సమావేశంలో ప్రకటించి, ఆమె పేరు చెప్పగానే... సెర్చ్ ఇంజన్లన్నీ బిజీ అయిపోయాయి. ఆమె గురించి వివరాలు తెలుసుకోవాలని సినీ అభిమానులు తహతహలాడారు. ఆమెతో తన అనుబంధం గురించి చెబుతూ 'కభీ కభీ మేరే దిల్ మే...' అంటూ పాట కూడా పాడారు ఆమిర్. ఇంతకీ ఎవరామె?

బాలీవుడ్ సూపర్‌స్టార్ ఆమిర్‌ఖాన్ చేసిన చిన్న ప్రకటనతో.. ఒక్క పూటలోనే సెలబ్రిటీగా మారిపోయారు గౌరీ స్ప్రాట్. నిజానికి గురువారం సమావేశానికి ఒక రోజు ముందు తన ఇంట్లో ఏర్పాటు చేసిన ప్రీ బర్త్‌డే డిన్నర్ పార్టీలో గౌరీని తోటి సూపర్‌స్టార్స్ షారుఖ్ ఖాన్, సల్మాన్‌ఖాన్‌లకు అమీర్ పరిచయం చేశారు. ప్రస్తుతం అమీర్‌తో సహజీవన బంధంలో ఉన్న గౌరి అతనికి చిరకాల మిత్రురాలే. ఆమె స్వస్థలం బెంగళూరు. తల్లి రీటా స్ప్రాట్ ఆ నగరంలో ప్రసిద్ధి చెందిన 'స్ప్రాట్ సెలూన్' నిర్వాహకురాలు. ఆమె తాత స్వాతంత్ర్య సమరయోధుడు. గౌరీ 'బ్లూ మౌంటెన్' స్కూల్లో చదువుకున్నారు. ఫ్యాషన్ విభాగంలో ఉన్నత విద్య అభ్యసించారు. 2004లో లండన్‌లోని 'యూనివర్సిటీ ఆఫ్ ది ఆర్ట్స్'లో స్టయిలింగ్ & ఫొటోగ్రఫీ కోర్సు పూర్తి చేశారు. ప్రస్తుతం తల్లి బాటలోనే ముంబయిలో 'బి బ్లంట్' సెలూన్‌ను నిర్వహిస్తున్నారు. ఆమిర్ ఖాన్ ప్రొడక్షన్ హౌస్‌లో కూడా పనిచేస్తున్నారు. గౌరీకి ఇప్పటికే ఆరేళ్ల కొడుకు ఉన్నాడు. అమిర్‌తో ఆమె స్నేహం 25 ఏళ్ల నాటిది. ఏడాదిన్నర నుంచి వీరి స్నేహం మరింత బలపడి అందమైన అనుబంధంగా మారింది

ట్రెండింగ్



> ఆమిర్‌కు గతంలో రెండు పెళ్లిళ్లు జరిగాయి. మొదటి భార్య రీనా దత్తా. వీరు 1986లో వివాహం చేసుకున్నారు. 2002లో పరస్పర అంగీకారంతో విడాకులు తీసుకున్నారు.

ఇంతకుముందు...

సామాజిక సమస్యలు ప్రధాన ఇతివృత్తంగా రూపొందిన పలు సినిమాల్లో నటించి మంచి నటుడిగా గుర్తింపు పొందిన ఆమిర్ ఖాన్... తొమ్మిది ఫిల్మ్‌ఫేర్ అవార్డులు, నాలుగు జాతీయ చలనచిత్ర అవార్డులతోపాటు 2003లో పద్మశ్రీ, 2010లో పద్మభూషణ్ పురస్కారాలు, చైనా ప్రభుత్వం నుంచి గౌరవ పురస్కారం అందుకున్నారు. అతనికి గతంలో రెండు పెళ్ళిళ్ళు జరిగాయి. మొదటి భార్య రీనా దత్తా. వీరు 1986లో వివాహం చేసుకున్నారు. 2002లో పరస్పర అంగీకారంతో విడాకులు తీసుకున్నారు. పెళ్లి నాటికి రీనా వయసు 19 ఏళ్లు కాగా ఆమిర్ వయసు 21 ఏళ్లు. వీరికి కొడుకు జునైద్ ఖాన్, కూతురు ఐరా ఖాన్ ఉన్నారు. జునైద్ ఇటీవలే బాలీవుడ్‌లోకి అడుగుపెట్టాడు. ఇప్పటికే పలు చిత్రాల్లో సహాయ దర్శకుడిగా పనిచేసి పేరు తెచ్చుకున్నాడు. సామాజిక కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటాడు. ఐరా ఖాన్ ఈ మధ్యే ఫిట్‌నెస్ కోచ్ నుపుర్ శిఖారేను పెళ్ళి చేసుకుంది. మానసిక ఆరోగ్య సమస్యలపై రూపొందించిన ఒక నాటకం ఆమెకు ప్రశంసలను తెచ్చిపెట్టింది.

'లగాన్'తో మొదలై...

ఆమిర్ రెండో భార్య కిరణ్ రావు. 'లగాన్' సెట్స్ మీద మొదలైన వీరి పరిచయం ప్రేమగా మారి, 2005లో వివాహం చేసుకున్నారు. అభిప్రాయ భేదాలతో 2021లో విడాకులు తీసుకున్నారు. పెళ్లి నాటికి కిరణ్ వయసు 32 ఏళ్లు. ఆమె ప్రముఖ దర్శకురాలు, నిర్మాత, స్క్రీన్‌ప్లే రచయిత. వీరి కొడుకు ఆజాద్ రావు ఖాన్ 2011లో సరోగసీ ద్వారా జన్మించాడు. అతను ఎక్కువగా కుటుంబ వేడుకల్లో కనిపిస్తాడు. మీడియాకు దూరంగా ఉంటాడు. రీనా, కిరణ్ ఇద్దరితోనూ స్నేహాన్ని ఆమిర్ కొనసాగిస్తున్నారనీ, పిల్లలందరినీ ప్రేమగా చూసుకుంటాడనీ చెబుతారు. పిల్లలకు వ్యక్తిగతంగా సలహాలు, వృత్తిపరంగా సూచనలు ఇస్తూ తండ్రిగా మార్గనిర్దేశనం చేస్తూ ఉంటారు. గౌరీతో బంధాన్ని ఆమిర్ కుటుంబ సభ్యులందరూ ఆనందంగా అంగీకరించడం విశేషం.

పాత కూలర్ వాడుతున్నారా?



వేసవికాలంలో ప్రతి ఇంట్లో కూలర్లు ఉపయోగిస్తూ ఉంటారు. వీటిని మూడు లేదా నాలుగేళ్లు వాడిన తరవాత గాలి చల్లగా రావడం లేదంటూ కొత్త కూలర్ కొనాలనే ఆలోచన చేస్తూ ఉంటారు. అలా కాకుండా పాతదాన్నే కొత్తగా ఎలా మార్చుకోవాలో తెలుసుకుందాం.

- పాత కూలర్‌ను ఉపయోగించే ముందు దాన్ని శుభ్రం చేయాలి. లోపల ఫ్యాన్‌కి పట్టి ఉన్న బూజు దులిపి రెక్కలను తడి వస్త్రంతో తుడవాలి. ఫ్యాన్‌లో ఏదైనా సమస్య ఉంటే కొత్తదాన్ని తెచ్చి బిగిస్తే సరిపోతుంది.
- కూలర్‌కు మూడు వైపులా అమర్చి ఉండే గడ్డి షీట్ల వల్లే గదిలో చల్లదనం విస్తరిస్తుంది. గత ఏడాది వాడిన కూలర్‌ను చాలాకాలం పక్కన పెట్టి ఉంచడం వల్ల వాటిపై దుమ్ము, ధూళి చేరి ఉంటాయి. వీటిని శుభ్రం చేసినప్పటికీ గదిలో చల్లదనం వ్యాపించదు. కాబట్టి కొత్త షీట్స్ తెచ్చి అమర్చుకుంటే తాజా గాలి వీచి ఇల్లంతా చల్లగా ఉంటుంది.
- పాత కూలర్ నుంచి నీళ్లు కారుతూ ఉంటాయి. నీళ్లు బయటికి వస్తున్నచోట ఎంసీల్‌ను పూతలా రాస్తే సమస్య తీరుతుంది.
- కూలర్ లోపల నీళ్లు నిల్వ ఉండేచోటుని శుభ్రంగా కడగాలి. మోటార్, వాటర్ పంప్, ఫ్లోటింగ్ బాల్‌లను పరిశీలించాలి. కూలర్ ముందు భాగంలో ఉండే ఎయిర్ ఫిల్టర్స్‌ని దుమ్ము లేకుండా పలుచని వస్త్రంతో తుడవాలి. కూలర్‌ని వాడుతున్నంతకాలం వారానికి ఒకసారి తుడవాలి.

మేకప్

వేసవిలో చెక్కుచెదరకుండా...

వేసవిలోఉక్కపోతకు మేకప్ చెదిరిపోయే ఇబ్బందులు ఎక్కువే! ఈ కాలంలో చర్మం జిడ్డుగా మారిపోకుండా తాజాగా ఉంచే మేకప్ ఉత్పత్తులను వాడుకోవాలి. అందుకోసం జెల్ ఆధారిత మాయిశ్చరైజర్, సన్‌స్క్రీన్‌లను పూసుకుని, అవి పూర్తిగా చర్మంలోకి ఇంకిపోయాకే మేకప్ వేసుకోవాలి.

ప్రైమర్: చర్మ రంధ్రాలను దాచడంతో పాటు మేకప్‌ను పట్టి ఉంచే స్వభావం కలిగిన ప్రైమర్ మేకప్‌లో కీలక పాత్ర పోషిస్తుంది. కాబట్టి ప్రత్యేకించి వేసవిలో వాటర్‌ప్రూఫ్ ప్రైమర్ ఎంచుకోవాలి. ఒకవేళ జిడ్డు చర్మం అయితే, మ్యాటిఫయింగ్ ప్రైమర్‌ను ఎంచుకోవాలి. ఈ ప్రైమర్ చర్మం మీద నిమిషం పాటు సెట్ అయ్యే వరకూ ఆగి, ఆ తర్వాతే బేస్ మేకప్ మొదలుపెట్టుకోవాలి.

బేస్ మేకప్: అన్ని ఫౌండేషన్‌లూ, కన్‌సీలర్లు వేసవి వేడిని తట్టుకోలేవు. కాబట్టి కరిగిపోకుండా ఉండడం కోసం వీటిని తక్కువ మోతాదులో వీలైనంత పలుచగా పూసుకోవాలి. వీటిని వద్దనుకొంటే టింటెడ్ మాయిశ్చరైజర్ వాడుకోవచ్చు. షీర్, మీడియం కవరేజ్, లైట్ వెయిట్ అనే మూడు రకాల టింటెడ్ మాయిశ్చరైజర్స్, చర్మం తాజాగా కనిపించేలా చేస్తాయి.

సెట్టింగ్ పౌడర్: కష్టపడి మేకప్ వేసుకున్న తర్వాత సెట్టింగ్ పౌడర్ వాడుకోకపోతే, శ్రమంతా వృథా అవుతుంది. తేలికగా జిడ్డుగా మారే వీలున్న ప్రదేశాలను పౌడర్‌తో సెట్ చేసుకోకపోతే, మేకప్ చెదిరిపోతుంది. కాబట్టి ముక్కు, చెక్కిళ్లు, చుబుకం.. ఈ ప్రదేశాల్లో సెట్టింగ్ పౌడర్ అద్దుకోవాలి. అందుకోసం ఫ్లఫ్ఫీ బ్రష్ మాత్రమే ఉపయోగించాలి. అర నిమిషం తర్వాత, బ్రష్‌తో అదనపు పౌడర్‌ను దులిపేసుకుంటే మేకప్ ఎక్కువ సమయం ఉంటుంది.

స్మడ్జ్‌ప్రూఫ్ లిప్‌స్టిక్: ఈ కాలంలో ఎక్కువ సమయం నిలిచి ఉండే ద్రవరూప లిప్‌స్టిక్స్ ఎంచుకోవాలి. ఇవి అద్దుకున్న క్షణాల్లోనే ఆరిపోయి, రోజంతా నిలిచి ఉంటాయి.



బ్లాటింగ్ పేపర్: ఎన్ని జాగ్రత్తలు పాటించినా వేసవిలో ఉక్కపోత ఎంతో కొంత తప్పదు. దాంతో మేకప్ చెదిరిపోకుండా ఉండడం కోసం బ్లాటింగ్ పేపర్స్ అందుబాటులో ఉంచుకోవాలి. రుమాలు, టిష్యూ పేపర్లకు బదులుగా ఈ బ్లాటింగ్ పేపర్‌ను ఉపయోగించుకోవడం వల్ల మేకప్ చెదిరిపోదు. చెమట కూడా క్షణాల్లో మాయం అవుతుంది.